

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



సోమవారం | 8-4-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 354 | విజయవాడ సిటీ**

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య రా. 11.53 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ. 10.13 తదుపరి రేవతి; వర్జ్యం: రా. 8.59-10.18; దుర్ముహూర్తం: మ. 12.42-1.31, మ. 3.10-3.59; అమృతఘడియలు: తె. ఉ. 7.23, తె. 5.25 మొదలు; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.27

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


వెలలేని వైభోగం..
తరుగు లేని నమ్మకం..
క్రోధి నామ సంవత్సరాది
ఉగాది శుభాకాంక్షలు
బంగారం కొనుగోలుపై ప్రతీ గ్రాముకు
₹250 తగ్గింపు
పాత బంగారం మార్పిడిపై అదనంగా 50/- తగ్గింపు
(ఏప్రిల్ 1 నుండి ఏప్రిల్ 30 వరకు)
డైమండ్ జ్యువెలరీ క్యారట్
₹54,000
మాత్రమే
(EF/VVS1) International Certification Provided
పోల్కి
జ్యువెలరీ పై
మేకింగ్ & వేస్టేజీ
చార్జీలు లేవు
*T&C Apply
VEGA
JEWELLERS
దివిలోనైనా.. భువిలోనైనా.. వేగ తోడుంటే వివాహం వైభోగం అవుతుంది.
Plot # 10, నందమూరి రోడ్, బృందావన్ కాలనీ, MG రోడ్, విజయవాడ.
Call: 72079 16026
VISION - 9966 547 998

www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 8-4-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జగన్ ఇక ఇంటికే!

మళ్లీ గెలవడం చాలా కష్టం: పీకే

ఈ ఐదేళ్లలో అభివృద్ధి చేయలేదు

ఛత్తీస్‌గఢ్‌లో నాటి సీఎం బఘేల్‌లా కేవలం డబ్బు పంపిణీకే పరిమితం

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేదు

తాయిలాలు, నగదు బదిలీ తప్ప ఉద్యోగాలివ్వలేదు

వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ వెల్లడి

తెలంగాణలో బీజేపీ పుంజుకుంటోంది

మొదటి లేదా రెండో స్థానంలో నిలుస్తుంది

తమిళనాట రెండంకెలకు బీజేపీ ఓట్ షేరు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రెండోసారి విజయం సాధించలేకపోవచ్చని రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అలియాస్ పీకే అభిప్రాయపడ్డారు. గత ఐదేళ్లలో రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే ఒక్క పని కూడా ఆయన చేయలేదని, మళ్లీ అధికారంలోకి రావడం చాలా కష్టమని పీటీఐ వార్తాసంస్థకు తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. పీకే 2019 ఎన్నికల్లో జగన్ పార్టీ తరఫున ఎన్నికల వ్యూహకర్తగా పనిచేసిన సంగతి తెలిసిందే. నాటి ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్ మాదిరిగా ప్రజలకు డబ్బు పంపిణీకి మాత్రమే జగన్ పరిమితమయ్యారని.. వారి ఆకాంక్షలను మాత్రం నెరవేర్చలేదన్నారు. దీనివల్ల అభివృద్ధి స్తంభించిందని తెలిపారు (నిరుడు జరిగిన ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో బఘేల్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోయిన సంగతి తెలిసిందే). 'ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నాయకుడు.. ప్రజలకు

మిగతా 12వ పేజీలో...

ఈసారి బీజేపీకి 300కు పైగా

కానీ 370 లక్ష్యం సాధించలేకపోవచ్చు

ఒడిశా, బెంగాల్‌లో నంబర్‌వన్ స్థానంలో!


తూర్పు, దక్షిణాది రాష్ట్రాల్లో కాషాయపార్టీకి సీట్లు, ఓట్లు.. గణనీయంగా పెరుగుతాయి

మోదీ నేతృత్వంలోని బీజేపీ అప్రతిహతంగా దూసుకుపోతోందన్న వాదన వట్టి భ్రమే

ఆ పార్టీ వెనకబడిన సందర్భాలున్నాయి..

విపక్షాలు సొమ్ము చేసుకోలేకపోయాయి: పీకే





ఎన్నికల కమిషన్ అయితే నాకేంటి? రాజ్యాంగ వ్యవస్థలయితే నాకేంటి? నేనింతే..!

తీవ్ర ఆర్థిక నేరాభియోగాలున్న నన్ను సీఎంను చేసినందుకు నేనేం మారలే. నాకు నచ్చినట్లుగానే 58 నెలలు ఏపీని పాలించా. 'ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు.. రూల్స్ మీరొద్దు' అంటూ ఇప్పుడు నోటీసులిస్తే మారాలా? నేనింతే..!

ఈసీ అయితే నాకేంటి? నేను జవాబుదారీని కాదు. నేనింతే..! అన్నట్టుగా ముఖ్యమంత్రి జగన్ తన అహంకార దర్పాన్ని ప్రదర్శిస్తున్నారు. 'నన్ను ప్రశ్నించకముందు ప్రతిపక్షనేత చంద్రబాబును పది తిట్లు తిట్టా... ప్రశ్నించాక పాతిక తిట్లు తిడతా... ఏం చేసుకుంటారో చేసుకోండి' అనేలా ఈసీకి సవాల్ చేశారు.

నన్ను అడిగేదెవడ్రా!

ఈసీ అయితే నాకేంటి? నేనింతే.. సీఎం జగన్ ధిక్కారశైలి

వ్యవస్థలకు జవాబుదారీకాదన్నట్టు వైఖరి

చంద్రబాబుపై పదేపదే దూషణలు

పశుపతి, చంద్రముఖి పాత్రలతో పోలిక

హంతకుడు, దుర్మార్గుడు అంటూ తిట్లు

కోడ్ ఉల్లంఘించారని తేల్చిన ఈసీ

వివరణ ఇవ్వాలని ఉదయం నోటీసు

సాయంత్రానికే జగన్ మళ్లీ అదే తప్పు

బాబు, పవన్‌పై అనుచిత పోస్టులు

తొలగించాలన్న ఈసీ ఆదేశాలూ బేఖాతరు

చేతిలో అధికారం.. అంతకుమించి అహంకారం

ఆ రెండూ కలిస్తే తనలా ఉంటుందనేలా ప్రవర్తన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గౌరవప్రదమైన ముఖ్యమంత్రి హోదాలో ఉంటూ ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన జగన్ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రాజకీయ వేదికలపై ప్రజల సమక్షంలో ప్రతిపక్షనేత చంద్రబాబుపై తీవ్ర దూషణలు, తిట్లకు దిగారు. ఆయన మాటలకు ఎన్నికల కమిషన్ విస్తుపోయింది. సీఎం హోదాలో జగన్‌రెడ్డి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని ఈసీ తేల్చింది. అడ్డగోలుగా ప్రవర్తిస్తూ మాట్లాడిన మాటలపై వివరణ కోరుతూ ఆదివారం ఉదయం జగన్‌కు నోటీసు పంపించింది. '48 గంటల్లో స్పందించండి. లేనిపక్షంలో

మిగతా 11వ పేజీలో...

ఆదివారం రాత్రి ఉయ్యూరులో జరిగిన ప్రజా గళం సభకు హాజరైన జనం



దుర్మార్గుడైన జగన్ సంపదను సృష్టించకుండా అప్పులు చేసి పంపకాలు చేస్తున్నాడు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాడు. సంపద సృష్టించడం రాదు. విధ్వంసమే ఆయన నైజం.

2019లో అధికారంలోకి వచ్చిన ఈ గంజాయి బ్యాచ్ అమరావతితో ఆడుకుంది. మూడు రాజధానులంటూ సిగ్గూ ఎగ్గూ లేకుండా.. బుద్ధీ జ్ఞానం లేకుండా మాట్లాడతారు. వీధి దీపాలు కూడా సరిగా నిర్వహించలేని అసమర్థుడు.. మూడు రాజధానులు నిర్మిస్తానంటే నమ్ముతారా?

- చంద్రబాబు

మేమొచ్చాక

రైతే రాజు!

ధాన్యం, ఇతర పంటలకు మద్దతు ధర అందిస్తాం

రైతు కూలీల కోసం ప్రత్యేక కార్పొరేషన్: చంద్రబాబు

కౌలుదారులకూ న్యాయం చేస్తాం.. పల్లెలను ప్రపంచంతో సంధానిస్తాం

ఐదేళ్లుగా గిట్టుబాటు ధరలేదు.. ధాన్యం కొనుగోళ్లు లేవు

పోలవరం లేకుంటే కృష్ణా డెల్టా ఎడారే.. ఆ ప్రాజెక్టును జగన్ ఆపేశాడు

అధ్వాన రోడ్లపై గోతులు పూడ్చలేదు.. మూడు రాజధానులు కడతాడట

విధ్వంసమే నైజం.. సంపద సృష్టించకుండా అప్పులు చేసి పంపకాలు

ప్రజాధనం దుర్వినియోగం.. రివర్స్ టెండర్లు, రివర్స్ పాలన

చివరికి ప్రజల జీవితాలూ రివర్స్.. యువత భవిష్యత్ అంధకారం

ప్రజాగళంలో చంద్రబాబు వెల్లడి.. పామర్రు, ఉయ్యూరుల్లో సభలు

దివ్యాంగుల పెన్షన్ 6 వేలు.. సత్తెనపల్లిలో చంద్రబాబు ప్రకటన

జగన్‌ను ప్రజలు బాయ్‌కాట్ చేయాలి

వైసీపీ గుర్తుగా గొడ్డలిని పెట్టుకోవాలి

మచిలీపట్నం/పామర్రు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదు. ధాన్యం కొనుగోలు చేయడం లేదు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే రైతులను రాజులను చేస్తాం. రైతులు పండించిన ధాన్యం, ఇతర పంటలకు మద్దతు ధర కల్పిస్తాం. కౌలు రైతులు, రైతు కూలీలకు న్యాయం చేస్తాం. రైతు కూలీల కోసం ఓ ప్రత్యేక కార్పొరేషన్ పెట్టి వారిని ఆదుకుంటాం' అని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రజాగళం యాత్రలో భాగంగా ఆదివారం కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గ కేంద్రం,

మిగతా 11వ పేజీలో...

సీఎం ఓ స్కామ్‌స్టర్!

మద్య నిషేధం చేస్తానని సారా వ్యాపారిగా మారారు: పవన్

ఇసుక కొల్లగొట్టిన దొంగ జగన్

భూములు దోచేసిన దోపిడీదారు

'అమ్మఒడి' ఏడాది ఎగ్గొట్టారు

యువత, మహిళలు, పిల్లల భవిష్యత్తు కోసమే నా తపన

వ్యతిరేక ఓటు చీలకూడదనే ఆరాటం

వైసీపీ పోవాలి.. కూటమి రావాలి

అసెంబ్లీలో నాదెండ్ల, కొణతాల వంటి బలమైన నాయకులుండాలి

'సీపీఎస్'కు ఏడాదిలోగా పరిష్కారం

చెత్తపై పన్ను భారాన్నీ తొలగిస్తాం

అనకాపల్లి విజయభేరి సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్



అనకాపల్లి సభకు హాజరైన జనం.. బీజేపీ, జనసేన గుర్తులను ప్రదర్శిస్తున్న పవన్, సీఎం రమేశ్, కొణతాల రామకృష్ణ

అనకాపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): "రాష్ట్ర ముఖ్యమంత్రి భూములు దోచే స్కామ్‌స్టర్. ఇసుక, సారా వ్యాపారి" అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శించారు. వైసీపీ పోవాలి, కూటమి ప్రభుత్వం రావాలని పిలుపునిచ్చారు. 'వారాహి విజయభేరి' యాత్రలో భాగంగా ఆదివారం అనకాపల్లి నెహ్రూచౌక్ కూడలిలో జరిగిన బహిరంగ సభలో పవన్ ప్రసంగించారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమే దశాబ్దకాలంగా ఒక్క ఎమ్మెల్యే కూడా లేకపోయినా పార్టీని నడుపుతున్నానన్నారు. రాష్ట్రంలో యువత, మహిళలు, పిల్లల భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతోనే వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదని పరితపిస్తున్నట్టు తెలిపారు. అమ్మఒడి పథకంలో కోతలు పెట్టారని, చివరి ఏడాదిలో అమ్మఒడి ఇవ్వకుండా తల్లులకు అన్యాయం చేశారని అన్నారు. రాష్ట్రంలో మద్య నిషేధం చేస్తామని హామీ ఇచ్చిన జగన్ పక్కా సారా వ్యాపారిగా మారిపోయారని విమర్శించారు. ఇసుకను దోచేయడమే కాకుండా భూములను దోచేసే 'స్కామ్‌స్టర్' అని దుయ్యబట్టారు. అభిమానులు తనను చూడగానే సీఎం, సీఎం అంటున్నారని, కానీ క్షేత్రస్థాయిలో జనసేనకు యువత బలం ఉన్నా, నాయకులు లేరని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో

మిగతా 7వ పేజీలో...

మీ భవిష్యత్తు కోసం నిలబడే నాయకులను ఎన్నుకోవాలని కోరుతున్నా. రాష్ట్రంలో మార్పు తేవాలనే లక్ష్యంతోనే యాత్ర కొనసాగిస్తున్నా. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే చెత్తపై పన్నును తొలగించాలని చంద్రబాబుకు చెబుతా. సీపీఎస్ విషయంపై చర్చలు జరిపి ప్రతి ఉద్యోగికీ భద్రత కల్పించేలా చర్యలు చేపడతా.

- పవన్ కల్యాణ్

బాబోయ్ ఎండలు

45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

కలిగిరి, చాగలమర్రిలో 45.8

మరికొన్నాళ్లు వడగాడ్పుల తీవ్రత

4

తెలంగాణ టు కడప

వైసీపీ నేతల అండతో భారీగా మద్యం రవాణా!

పంచలింగాల చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న సెబ్ సిబ్బంది

11

ఆ ఐపీఎస్.. వైసీపీ ఫ్యాన్

సీమలో పెద్దిరెడ్డికి.. రాజధానిలో తాడేపల్లికి జీ హుజూర్

'తిరుపతి'లో వైసీపీ విజయానికి తోడ్పాటు

కుప్పం పంచాయతీ ఎన్నికల్లోనూ అదే తీరు

విజయవాడలో అధికార పార్టీ వారికి వత్తాసు

టీడీపీ నేతలపై దాడులు చేసినా చర్యలు అంతంతే

అసోసియేషన్‌లోనూ ఏకపక్ష వ్యవహార శైలి

క్రాంతి రాణా వ్యవహారంపై ఐపీఎస్‌లలో చర్చ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

హోదా.. ఐపీఎస్. కానీ అధికార పార్టీకి వీర భక్తుడనే పేరుంది. ఎక్కడ పని చేసినా స్వామి భక్తి ప్రదర్శిస్తారని చెబుతారు. ఆయనే.. విజయవాడ పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా. రాష్ట్రంలో ఏకపక్షంగా వ్యవహరించే అధికారుల్లో ఆయన కూడా ఒకరు. ఆయన 'పనితీరు' గురించి ఐపీఎస్ వర్గాలు కథలు కథలుగా చెబుతాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఐపీసీ కన్నా వైసీపీ చట్టానికే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. జగన్ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో అనంతపురం డీఐజీగా క్రాంతి రాణా పనిచేశారు. అప్పట్లో చిత్తూరు జిల్లాకు చెందిన మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాలు తు.చ. తప్పకుండా పాటించేవారనే విమర్శలున్నాయి. స్థానిక

మిగతా 12వ పేజీలో...

'ఆమె'కు ఐఏఎస్ ఇప్పిద్దాం..!

అర్హత లేని ఓ అధికారిణికి అందలం

ఐఏఎస్ హోదా కల్పించేందుకు స్కెచ్

ధనుంజయరెడ్డి అండతో ఫైల్ సిద్ధం

యూపీఎస్సీకి పంపించే ప్రయత్నాలు

సీఎంవోలోని అధికారులంతా ఆమోదం

రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంతో బ్రేక్

నాన్ రెవెన్యూ కోటా పోస్టుల్లేకున్నా ఫైల్

అడ్డదారిలో ఐఏఎస్ ఇప్పించే ప్రయత్నం



కమలాపురంలో జరిగిన బస్సు యాత్రలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల, చిత్రంలో సునీత

జగన్ కుంభకర్ణుడు

ఆరు నెలల క్రితమే నిద్ర లేచాడు

పాలనంతా అక్రమాలు, దౌర్జన్యాలు

హత్యలు, దోపిడీలు, ఇసుక మాఫియా

ఎక్కడా కనిపించని అభివృద్ధి జాడ

జనం గెలిపించింది మర్డర్ చేయడానికేనా?

సీఎం జగన్‌పై చెల్లెళ్లు షర్మిల, సునీత ధ్వజం

కడప, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): "ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుంభకర్ణుడిలా నాలుగున్నర సంవత్సరాలు నిద్రపోయి ఎన్నికలకు ఆరు నెలల ముందు నిద్రలేచాడు. ఆయన పాలనంతా అక్రమాలు, దౌర్జన్యాలు. రాష్ట్రమంతా హత్యలు, దోపిడీలు, ఇసుక మాఫియా, మైనింగ్ మాఫియా... ఎక్కడా అభివృద్ధి లేదు" అంటూ పీసీసీ అధ్యక్షురాలు, జగన్ సోదరి వైఎస్ షర్మిలారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా షర్మిల, వివేకానంద రెడ్డి కుమార్తె సునీత కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలోని పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లె, కమలాపురంలలో ఆదివారం బస్సుయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా

మిగతా 11వ పేజీలో...

బొమ్మలు: అక్బర్

రాయసకారులూ బహుపరాక్!

'ఎ ఫేర్ వెల్ టు ఆర్మ్స్' నవలని ఏకంగా 50సార్లు తిరగ రాసి, కనీసం 47 ముగింపులు మార్చి మార్చి రాసిన ఆ పెద్దాయన్ని చూసి బిత్తరపోయి, 'ది ప్యారిస్ రివ్యూ', "అయ్యా దేనికిదంతా?" అనడగ్గా, "సరైన పదాల దొరక్క!" అన్నాడా పెద్దమనిషి తాపీగా. టాల్స్టాయ్ 'వార్ అండ్ పీస్' ఎంత బృహన్నవలో తెలియనివాళ్ళు అరుదే! ఆ మహా పురుషుడు కూడా దాన్ని అనేకసార్లు తిరగ రాశాడు! వంటి చేత్తోనే ఈ పనులు చేసేరు వీళ్ళు! అసలు - ఏ ఫస్ట్ డ్రాఫ్ట్ అయినా ఒక చెత్తే పో - అంటాడు, హెమింగ్వే! మంచి రాయసగాడు కావాలంటే ముందు నువ్వు 'చిన్న వాక్యాలు రాయడం నేర్చుకో' అని హితబోధ చేస్తాడు.

బ్రెవిటీ ఏవిటీ?

ఫ్రెడ్రిక్ నీచే, "నా యాంబిషన్ ఏమిటంటే వేరేవాళ్ళు పుస్తకం మొత్తంలో చెప్పిందాన్ని పదే పది వాక్యాల్లో చెప్పటమే." బ్రెవిటీ గురించి ఇంత గొప్పగా ఇంకెవరూ చెప్పి ఉండకపోవచ్చు. అసలు షేక్స్పియర్‌ను మించినోడు ఎవడూ ఉండే అవకాశమే లేదు అతి స్వల్ప మాటల్లో చెప్పడంలో! "బ్రెవిటీ ఈజ్ ది సోల్ ఆఫ్" విట్ అని ఊరికే అన్నాడా ఆ మహానుభావుడు? ఫ్రాన్సిస్ బేకన్ వ్యాసాలు బ్రెవిటీకి పట్టుగొమ్మలు. రోదసీ యాత్రికుడి క్యాప్సూల్ మీల్‌లా, వేల క్యాలరీల స్టఫ్ అంతా రెండో మూడో పదాల్లో ఇమిడ్చేస్తాడు. చూడండి ఈ కాప్స్యూల్: "Reading maketh a full man; conference a ready man; and writing an exact man."

రాతలో 'మోత' పదాల గురించి!

మోత మోగే యే పదం మీదో మోజు పడి, వెతుక్కుని మరీ బజాయించాలనుకునే వాళ్లకు భలే కముకు దెబ్బలు కొట్టారు!

జేమ్స్ జె. కిల్పాట్రిక్ అనే ఓ పెద్దాయన, - అయ్యా బాబులూ! "చదువుకునే వాడు వెతుక్కోవాల్సి వచ్చే పదాల్ని కాదు వాడాల్సింది, అర్థం చేసుకోగలిగే పరిచిత పదాల్ని వాడండి... అద్భుతమైన అన్యపదమేదో మిమ్మల్ని నిలవనీకుండా గంతులేయిస్తుంటే అది సద్దుమణిగి వెళ్లిపోయేదాకా స్థిమితంగా కాసేపు పడుకోండి" అని సెలవిస్తాడు.



"మీలోని అహంభావపు రచయిత హృదయాన్ని అవి ముక్కలు చేస్తున్నా సరే, ఆ ప్రియాతి ప్రియమైనవాటిని చంపేసేయండి. ఆ ప్రియమైన వాటిని చంపేసేయండి!" అని స్టీఫెన్ కింగ్ ఎంత గౌరవంగా చెప్పేడో కదా!

రాతలో సరళత్వమే సహజత్వం

జీవన గాంభీర్యం అంతా సరళత్వంలోనే ఉందనీ, ...రాత నుంచి పెయింటింగ్ వరకూ సరళత్వమే అసలు రహస్యం అంటాడు బుకోవ్‌స్కీ. అమెరికన్ల రాత గురించి వాపోతూ విలియం జిన్సర్ అనే పెద్దాయన, "మన అమెరికా రాతకు పట్టిన దరిద్రం డొంక తిరుగుళ్ళు, అనవసరపు పదాల్లో చిక్కుకుపోవడం, తిప్పి తిప్పి చెప్పటం, ఆడంబరపు అలంకారాలూ, అసందర్భపు భాషా" అని చిరాకు పడతాడు. "ఏ మూర్ఖుడైనా విషయాల్ని పెద్దగా చేయగలడు, బాగా గొట్టుగా చేయగల్డు, ఇంకా బీభత్సం చేయగల్డు. సరిగ్గా దానికి వ్యతిరేకంగా వెళ్లాలంటే మాత్రం దమ్ము కావాలి, కొంచెం తెలివితేటలు వాడాలి," అంటాడు ఐన్‌స్టీన్! సకల కళా వల్లభుడు లియొనార్డో డా వించీ "Simplicity is the ultimate sophistication!" అనేశాడు. హిపోక్రేట్స్ కూడా- భాషకుండాల్సిన గొప్ప గుణం స్పష్టతేననీ, అపరిచిత పదాల వాడకం కంటే దాన్ని దారి తప్పించేవి ఇంకేవీ లేవంటాడు.

శైలీ, గ్రటా

శైలీ గ్రటా అంటూ కంగారుపడే వాళ్లకు చురక అంటిస్తూ, ఆర్నోల్డ్ "ఏదో ఒకటి చెప్పటానికి ఉండి, దాన్ని ఎంత స్పష్టంగా వీలైతే అంత స్పష్టంగా చెప్పటమే శైలి తాలూకూ రహస్యం" అంటాడు.

> "గురి వైపు ఒక రాయికి బదులు పిడికెడు రాళ్లు విసిరే వాడికంటే, అర్థం కోసం కుప్పల పదాలు కుమ్మరించేవాడు ఏ రకంగానూ మెరుగ్గాడు" అంటాడు శామ్యూల్ జాన్సన్.

డార్విన్ బల్లగుద్ది మరీ చెప్పాడు. "శైలీ గిలీ అంటూ పట్టించుకోను. నా బుర్రకు స్పష్టంగా ఏది తడితే అది, నాకొచ్చిన సరళమైన భాషలో రాసుకుపోతా!"

ఎకానమీ ఆఫ్ వర్డ్స్ లేకపోవడం హీనమేనా?

రాసుడు వ్యాపారంలో మహా ముఖ్యమైన పాఠం ఏంటంటే "రాసిందాంట్లో కొవ్వు తగ్గించుకుంటూ వెళ్లడమే అంటాడు" రాబర్ట్ హిన్లిన్ అనే గొప్ప రాయసగాడు.

థామస్‌మన్ అనే ఇంకో ఆయన, "మూర్ఖత్వాలు చాలా రకాలు, అన్నిటికంటే చండాలం అతి తెలివి! అఫ్‌కోర్స్ రాతలో.", అని చీవాట్లు పెడతాడు.

"చెత్త బుట్టలో చాలా మంచి మంచి రాతలు పడుతున్నాయంటే నువ్వు చాలా బాగా రాస్తున్నట్టేపో" అని భుజం తడతాడు ఎర్నెస్ట్ హెమింగ్వే.

"గురి వైపు ఒక రాయికి బదులు పిడికెడు రాళ్ల విసిరే వాడికంటే, అర్థం కోసం కుప్పల పదాలు కుమ్మరించేవాడు ఏ రకంగానూ మెరుగ్గాడు" అంటాడు శామ్యూల్ జాన్సన్. "రాసింది పదే పదే చదవండి. ఏదైనా ఒక చోట, 'మహా బాగా రాశా సుమా!' అనిపించగానే దాన్ని కొట్టి పారేయండి!" అని కూడా సెలవిచ్చాడు ఈయనే!

"నేను పెన్సిల్ మీద కంటే కత్తెర మీదే ఎక్కువ నమ్మకం పెట్టుకుంటా" అని మహా తెలివిగా చెప్పాడు ట్రూమన్ కెపోటే అనే ఇంకో గడుసు పిండం. ఉంచాల్సిన దాని కంటే తీసేయాల్సిందే ఎక్కువ ఉంటుందని చెప్పడం కోసం.

"అన్నిటికన్నా మహా విలువైన టాలెంటు ఏదైనా ఉందీ అంటే ఒక పదం అవసరమైన చోట రెండు పదాలు వాడకుండా ఉండటమే," అంటాడు థామస్ జఫర్సన్. ఆలోచించుకుందాం రండి మరి!

■ వి. విజయకుమార్
✆ 85558 02596

ఒక



ఒక లేతవేసవి వాకిట నిలబడి
అలసటను గాలితీగపై ఆరబెట్టుకుంటే
చిగురుమేఘమొకటి
చినుకుచుక్కై బుగ్గను పుణుకుతుంది

ఒక వెలుగుదీపపు నీడలో చతికిలబడి
చీకటిగుప్పెట విప్పుకుంటే
నిండైన నక్షత్రమొకటి
కాంతిపుంజమై
నెమ్మదిగా కౌగిలించుకుంటుంది

ఒక గలగలల
సెలయేటి పాదాల వద్ద ముడుచుకుని
గుండెదేహాన్ని తడుముకుంటే
మృదువైన అలలచెలొకటి
పిల్లతెమ్మెరై
మనసును గాలిపటంలా ఎగరేస్తుంది

ఒక మెత్తని మెలకువశయ్య
ఒడిలో కూలబడి
కునుకుపిట్టను నిమురుకుంటే
రంగురంగుల కలలస్వర్గమొకటి
కమ్మగా నిదురజోల పాడుతుంది

ఒక సొగసైన పూలమొక్క
కొమ్మలచేతులలో తలపెట్టి
దిగులుమబ్బును మోస్తుంటే
అందమైన పరిమళమొకటి
ఆత్మీయతై గదినంతా తేలికపరుస్తుంది

ఒక శిఖరమంటి ప్రాణనేస్తపు
కనుల ద్వారబంధానికి
నిత్యతోరణమై వేళ్ళాడితే
సమస్తదుఃఖాలనూ చెరిపేసే
నీలిఆకాశమొకటి
బ్రతుకుముడులను విప్పుతూ
సారాంశాన్ని బోధిస్తుంది
జీవితాన్ని పాదాక్రాంతం చేసి
అర్థవంతంగా మలుస్తుంది

■ పద్మావతి రాంభక్త
✆ 99663 07777

సేవ - అక్షర తోరణం సమాపనోత్సవాలు

2023 మార్చి 22 ఉగాది నుండి 'సేవ' ఆధ్వర్యంలో 'అక్షర తోరణం' కార్యక్రమం ఇంటర్నెట్ వేదికగా 365రోజులపాటు జరిగింది. ఇప్పుడు వరల్డ్ రికార్డ్‌తో ఏప్రిల్ 9 ఉ.9గంటల నుండి ఏప్రిల్ 11 రా.11 గంటల వరకు 3 రోజులు 60 గంటలపాటు నిర్విరామంగా జూమ్ వేదికగా అక్షర తోరణం సమాపనోత్సవాలు ఇంటర్నెట్‌లో నిర్వహిస్తున్నాం. కె. శ్రీనివాస్, పి.ఎస్. రామమోహన్ రావు, కొలకలూరి ఇనాక్, కె. శివారెడ్డి, పి. విజయబాబు, మేడసాని మోహన్, నందిని సిధారెడ్డి... ఇంకా 180 మంది ప్రముఖ సాహితీ వేత్తలు, ప్రవాసీయులు పాల్గొంటారు. వివరాలకు: 94926 66660.

కంచర్ల సుబ్బానాయుడు

'తెలుగు సాహిత్యం - కొత్త కోణాలు'

తానా ప్రచురించిన వెల్చేరు నారాయణ రావు రెండు వ్యాస సంపుటాలు 'తెలుగు సాహిత్యం - కొత్త కోణాలు', 'సంస్కృతి, భాష, చరిత్ర'ల ఆవిష్కరణ సభ ఏప్రిల్ 14 సా.6గంటలకు బాలోత్సవ్ భవన్, రాఘవయ్య పార్క్ దగ్గర, విజయవాడలో జరుగుతుంది. సభలో వెల్చేరు నారాయణరావు, మండలి బుద్ధప్రసాద్, బి. తిరుపతిరావు, చినుకు రాజగోపాల్, కె. రామచంద్రారెడ్డి పాల్గొంటారు.

వాసిరెడ్డి నవీన్

చౌడప్ప శతకంలో చేరని కొత్త పద్యాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 'ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు' వారు 1982లో 'అధిక్షేప శతకములు' గ్రంథాన్ని ప్రచురించారు. 'అధిక్షేపం' అంతస్సూత్రంగా కలిగి, పూర్వకవులు రచించిన ఆరు శతకముల సంకలనమీ గ్రంథం. అందులో ఒకటి కవి చౌడప్ప రచించిన 'కవి చౌడప్ప శతకము'. క్రీ.శ. 17వ శతాబ్దికి చెందినవాడైన కవి చౌడప్ప తెలుగు శతక కర్తలలో బహుళ ప్రసిద్ధిని పొందినవాడు. ఈ శతకానికి రాసిన పీఠికలో కవి చౌడప్ప శతకము లోనివిగా దాదాపుగా రెండు వందల పద్యాలు లభ్యమౌతున్నాయని, వాటిల్లోంచి పండితులు పరిష్కరించిన నూట వొక్క పద్యాలు అందులో ప్రచురింపబడుతున్నాయని పేర్కొన్నారు. నాకు తెలిసి, 'కవి చౌడప్ప శతకము'గా ప్రచురించబడిన శతకం అధికారికంగా ఇది ఒక్కటే!

చెన్నైలోని 'గవర్నమెంట్ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీ' తెలుగు విభాగం రికార్డు సంఖ్య 'ఆర్ 01722' తాళపత్ర వ్రాతప్రతిలో 79 పద్యాలతో కూడిన 'కవి చౌడప్ప శతకం' రాత ప్రతి ఒకటి ఉంది. ఏ కాలపుదో, ఎవరిదో తెలియని ఈ రాతప్రతిలో పైన చెప్పిన 'కవి చౌడప్ప శతకము'లో చేరని పద్యాలు కొన్ని ఉన్నాయి. పేరు తెలియని ఈ లేఖకుని దస్తూరీ అంత కుదురైనదిగా లేదు. దానికితోడు తాళపత్రంలో అక్కడక్కడా పడిన మరకల వలన కూడా మాటలలో కొన్ని చోట్ల స్పష్టత కరువైంది. ఇప్పటివరకూ అప్రకటితాలై ఈ తాళపత్ర ప్రతిలో మగ్గుతున్న కవి చౌడప్ప పద్యాలలో భావ స్పష్టత ఉన్న పద్యాలను కొన్నిటిని విడిగా తీసి పరిష్కరించి, స్వల్పమైన వ్యాఖ్యను పద్యం క్రింద చేర్చి ఇక్కడ పొందుపరుస్తున్నాను. ప్రతి పద్యానికి పక్కనున్న సంఖ్య తాళపత్ర వ్రాతప్రతిలోనిది:

కం. రూకేరా సకలానికి
మూకేరా దొరలకెల్ల ముఖ్యము ధరలో
కాకేరా బంగారుకు
కాకోదర కుందవరము కవి చౌడప్పా! (5)

లోకంలో ఏ పని సాధించాలన్నా డబ్బుండాలి. ఆ రోజుల్లో ప్రభువుకు సైన్యం బలమైనదిగా ఉండడం ఎంత ముఖ్యమో ఈ రోజులలో ప్రతి దేశానికి సైనికబలం అంతే ముఖ్యం గనుక ఈ పద్యంలోని చౌడప్ప మాటలు సర్వకాలీనమైనవిగా చెప్పుకోవచ్చు. బంగారానికి ఎంత సెగ తగిలితే అంత వన్నె తేలుతుందన్నది అందరూ ఎరిగిన నిజం.

ఈ తాళపత్ర రాతప్రతిలో లేఖకుడు 'కుందవరము' అనే చాలా పద్యాల్లో వ్రాసుకున్నాడు. 'కుందపురము' అని ఒకటి రెండు పద్యాల్లో కనపడుతుంది. పైన చెప్పబడిన 'అధిక్షేప శతకములు' సంకలనంలోని 'కవి చౌడప్ప పద్యాలలో పేర్కొనబడినట్లుగా 'కుందవరపు' అని ఒక్క పద్యంలో కూడా లేదు.

కం. పేదలకు నెవ్వ డైనను
యీదలచిన వాని చేత యిప్పించ వలెన్
పేదల కీరాదన మే
ల్గాదప్పా కుందవరము కవి చౌడప్పా! (9)

కవి చౌడప్ప శతకంలోని పద్యాలంటే బూతుమాటలమయం అనే అభిప్రాయం జనసామాన్యంలో ప్రసిద్ధమై ఉందన్నది విదితమే! అశ్లీల పదజాలంతో కూడిన పద్యాలను మిగతా శతక కవులెవరూ చెప్పనంత పచ్చిగా కవి చౌడప్ప చెప్పాడనడం కాదనలేని నిజం అయినప్పటికీ, పేదరికం గురించిన పద్యాలను అత్యంత గౌరవ ప్రదమైన మాటలతో చెప్పాడనడం కూడా అంతే నిజం. అందుకు ఒక ఉదాహరణగా నిలిచేదే పై పద్యం!

కం. వాకిట నొకపర దేశియు
ఆకలి గొనియున్నవాని కన్నం బిడకే
తాకుడుచుట దాకుడుచుట
కాకోదర కుందవరము కవి చౌడప్పా! (10)

అభ్యాగతుడు గుమ్మం దగ్గర నిలబడి ఎదురుచూస్తుండగా, గృహస్థుడు ఇంట్లో నింపాదిగా భోజనం చేయడం చాలా తప్పని, అది 'దాకుడుచుట' అనగా 'ఎడమ చేతితో తినడం'తో సమానమైనదని పై పద్యంలో సారాంశం.

కం. నడవడి గలనాడే సా
పడ వలయును పదియునైదు పాశంబులుచా
రెడు నెయి రాజన్నము మీ
గడ పెరుగుతొ కుందవరము కవి చౌడప్పా! (18)

శరీరంలో శక్తి, ఖర్చుపెట్టగల తాహతు, తిన్న తిండిని అరిగించుకోవడానికి సరిపోయేంత పని సమంగా ఉండడం అన్నదే 'నడవడి' కలిగి ఉండడం అంటే! ఆ స్థితి పుష్కలంగా సాగుతున్న రోజులలో భోజనంలో పదీపదిహేనుకు తక్కువ కాకుండా పాయసాలు అనగా రుచికరమైన పదార్థాలు, చారెడు నెయ్యి, తెల్లని రాజనాల బియ్యపు అన్నము, మీగడ పెరుగుతో సంతృప్తిగా భోజనం చేయాలి అని భావం.

కం. తన విద్య దొరల వద్దను
వినిపించినవాడు లోకవిఖ్యాతుండౌ
వినిపించక తన చాతురి
కనుపించదు కుందవరము కవి చౌడప్పా! (28)

ప్రదర్శించనిదే వ్యక్తిలో దాగివున్న ప్రతిభ బహిర్గతం కాదు, నలుగురికీ తెలియదు. ఎప్పుడో ఒకప్పుడు గుర్తించబడకపోతామా అని ఏ ప్రయత్నం చేయకుండా కూర్చోవడం సరైన పని కాదు. తనలో దాగివున్న విలక్షణమైన విద్యను, అర్థంచేసుకుని ఆదరించే అధికారి ముందు పెట్టడం వలన ఉపయోగమే కాని అపకారం జరగదు అని భావం.

కం. ముండా కొడుకుల సంపద
దండుగలకు గాక దాన ధర్మము గలదా
దండించువాని కిత్తురు
ఖండితముగ కుందవరము కవి చౌడప్పా! (38)

భయపెట్టి, దౌర్జన్యం చేసి లాగేసుకునే వాళ్ళకు చేసేది లేక డబ్బును పోగొట్టుకుంటారుగాని, తమంతతాముగా ధర్మకార్యాలకు ఖర్చుపెట్టడానికి, దానంగా ఇవ్వడానికి మాత్రం మనస్కరించని వ్యక్తుల చిత్తవృత్తిని అధిక్షేపిస్తూ చెప్పిన పద్యం ఇది. చౌడప్ప పద విన్యాసం స్పష్టంగా కనిపిస్తుంది ఈ పద్యంలో!

కం. శాంతమున తనదు కార్యము
ఎంత అసాధ్యమయినను జయింపగ వచ్చున్
కుంతి సుతుండు జయించడె
కాంతాశ్రమలకును వోర్చి కవి చౌడప్పా! (74)

శాంతగుణాన్నే ప్రధానంగా ఆశ్రయించినవారికి ఎప్పటికైనా విజయం సిద్ధిస్తుంది అని తానే కాకుండా తన తమ్ములు, వెంట ఉన్న స్త్రీజనం ఎన్నో కష్టాలు పడుతున్నప్పటికీ చివరి వరకూ శాంత స్వభావాన్ని వీడక మహాభారత సంగ్రామంలో విజయం సాధించిన ధర్మరాజును ఉదాహరణగా చూపి చెప్పిన పద్యం పైది.

ఆం.సా. అకాడమీ వారు 'అధిక్షేప శతకములు' గ్రంథంలో ప్రచురించిన 'కవి చౌడప్ప శతకము'లో లేకుండా పైన చెప్పిన తాళపత్ర రాతప్రతిలో కనపడిన పద్యములలో నా పరిష్కరణకు లొంగిన అర్థవంతమైన పద్యములు ప్రస్తుతానికి ఇవి మాత్రమే! ఛందస్సు పరంగా కందపద్యానికి సరిపోతూ, పరిష్కరణకు లొంగుతున్నా అర్థం సరిగా కుదరనివి, ఈ తర్వాత ఉదాహరించినటువంటి పద్యాలు మరి కొన్ని ఉన్నాయి.

కం. నేరుతునని మాటాడగ
వారిజభవుడైన వాని వశమా తంజా
వూరి రఘునాథనాయలు
గారప్పా కుంద్దపురము కవిచౌడప్పా! (75)


అర్థం బోధపడుతున్నప్పటికీ కందపద్యం ఛందస్సుకు సరిపోని పద్యాలు, ఈ క్రింద ఉదాహరించినట్టివి మరికొన్ని ఉన్నాయి.

వేడుక తోవిన వలెనా
రూఢిక విత్వము నలుగురి లోనన్
ఊడిగ ము శేయు వాడే
గాడిద యయ్యెను గదప్ప కవి చౌడప్పా!

అర్థమూ కుదరక, ఛందస్సుకు అన్ని విధాలా సరిపోతున్నా, పరిష్కరణానికి లొంగకుండా ఉన్న పద్యాలు కొన్ని క్రింద ఇస్తున్నాను.

కం. దొరకైనను పేదకైనను
వెరపకు నిల్లాలికైన వేశ్యకునైనన్
గెరగెరి బాగౌ నుమ్మీ
కరుణాకర కుందవరము కవి చౌడప్పా! (60)

కం. హృదయము పదిలంబైతే
గదికొను సంన్యాసికైన కొంమ్ములు గలవా



యిది యెరుగని చదువయ్యలు
గదవప్పా కుందవరము కవి చౌడప్పా! (62)

ఇవన్నీ పరిశీలించి, పరిష్కరిస్తే ఇప్పుడు లభ్యమయ్యే కవి చౌడప్ప పద్యాలకు కనీసం ఇరవై పద్యాలైనా అదనంగా చేరే అవకాశం ఉంది.

■ భట్టు వెంకటరావు

గుడి కొంగలు



నువ్వు ఊరికి పోయి
24 గంటలే గడుస్తోంది
నాకు మాత్రం 24 వేల
వత్సరాల కాలంగా తోస్తుంది

ఇంట్లో వుంటే మన్మరాండ్ల
సెలయేరు గల గల
బడికి పోతే వరద తీసిన
యేరులా వెలవెల

పొద్దున నిద్ర లేచి
టీచర్ కోప్పడ్డప్పుటిలా మొఖం పెట్టి
అమ్మమ్మ ఎప్పుడొస్తుంది అడుగుతారు

సాయంత్రం వచ్చి వాకిట్లో
నీ చెప్పులు లేక అమ్మమ్మ
ఇంకా రాలేదని నిరాశతో
చిన్నబుచ్చుకుంటారు

పైకి వాళ్ల మాట్లాడుతున్నారు
నేను లోన నీ గురించే సంభాషిస్తున్నాను

పూట పూటకు మాత్రలు?
అని ఎవరు పలకరిస్తారు
బీడుగా మారిన నేల గర్భంలో
తవుటం పెట్టి విత్తనం నాటి
నీళ్లెవరు చిలుకరిస్తారు

ఇక తోవ నడువ
పాదాల తప్ప అడుగుల
చెయ్యి పట్టుకుని
చిన్నపిల్లాడిలా ఎవరు నడిపిస్తారు

జ్ఞాపకాలు కోల్పోయిన
మెదడు కరప్టు అయ్యి
పేరు సెల్ నంబర్ చిరునామా

మెడలో గుర్తింపు కార్డు వేలాడుతూ
తప్పిపోయిన ఆల్జీమర్స్
అతన్ని వెతికి నెవ్వారు
ఇంటికి తీసుకు వస్తారు

పొద్దుపోక చుట్టుపక్కల
ఇంటి తలుపు తడితే
అలల అలికిడి లేని
సముద్ర తీరంగా వుంది

కంగున మోగే రింగు సౌకర్యం
ఉంటే ఎంత బాగుండేది
ముక్కు మీద ముక్కువగా వేలాడుతున్న
కండ్ల అద్దాలను దొరకపట్టి ఎవరు ఇస్తారు

నువ్వు లేకుంటే ఊపిరి ఆడక బతుకు
బిక్క మొక వేసి కుమిలి ఏడ్సుంది
జీవిత ప్రయాణం ట్రాఫిక్ జామ్ లో
చిక్కుకుపోయి గిల గిల్లాడుతుంది

ఎక్కడి వారు అక్కడికి
ఎల్లలు దాటి ఎగిరి పోయాక
ఏ ఇంటిలోనైనా కనిపించే
ఒకే ఒక్క నిశ్చల సచిత్రం
గుడుగుక్కిన జంట గుడ్డికొంగలు
నొసట బస్వాన్ని ధరించిన జంగాలు

■ జూకంటి జగన్నాథం

శివేగారి దేవమ్మ కథా పురస్కారాలు

ఐదవ శివేగారి దేవమ్మ కథా పురస్కారాలు కోసం 2022, 2023 సంవత్సరాల్లో ప్రచురితమైన కథా సంపుటాలను, బాలల కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. ఉత్తమ కథా సంపుటానికి రూ.7వేల నగదు, బాలల కథా సంపుటానికి రూ.3వేల నగదు పురస్కార ప్రదానం జరుగును. మీ సంపుటాలు మూడేసి ప్రతులు ఏప్రిల్ 20 లోపు చిరునామా: కె.వి. మేఘనాథ్ రెడ్డి, ఇం.నెం. 11/21/01, ఎన్జీఓస్ కాలనీ, పుత్తూర్ - 517583, తిరుపతి, ఫోన్: 63003 18230కు పంపాలి.

కె.వి. మేఘనాథ్ రెడ్డి

వి. చంద్రశేఖరరావు జయంతి సభ

వి. చంద్రశేఖర రావు జయంతి సభ ఏప్రిల్ 13 సాయంత్రం 6 గంటలకు గుంటూరు 2/7 బ్రాడీపేట, కొరటాల భవన్‌లో జరుగుతుంది. 'కేరాఫ్ బావర్చీ' కథాసంపుటి రచయిత చరణ్ పరిమి వి. చంద్రశేఖరరావు పురస్కారాన్ని అందుకోబోతున్నారు. సభలో పెనుగొండ లక్ష్మీనారాయణ, పాపినేని శివశంకర్, వాసిరెడ్డి నవీన్, సీతారాం, ఎస్. స్పందన, కందిమళ్ళ శివప్రసాద్, వి. ప్రసూన, కాట్రగడ్డ దయానంద్ పాల్గొంటారు.

వి. ప్రసూన

వర్తన సమావేశం

వర్తన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో 3వ సమావేశం ఏప్రిల్ 13 ఉ.10.30గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుది. 'వాక్యం - కవితా వాక్యం' అంశంపై ఏనుగు నరసింహా రెడ్డి ప్రసంగిస్తారు. అధ్యక్షత: చెన్నూరి సీతారాంబాబు.

ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

తెలుగు సాహితీ వనం కవితా పురస్కారాలు

2024 సంవత్సరానికి ఈ పురస్కారాల కోసం చొక్కర తాతారావు, కె.జి. వేణు, మెట్టు శ్రీనివాస రెడ్డి, తిరువాయిపాటి రాజగోపాల్, కవితలు ఎంపికయ్యాయి. జూలైలో జరిగే తెలుగు సాహితీ వనం ఏడవ వార్షికోత్సవ సభలో పురస్కారాలు

తెలుగు సాహితీ వనం

"మానవ ఉద్వేగాల మాటున అంతఃసూత్రాన్ని ఒడిసిపట్టాలని..."

ధీరజ్ కశ్యప్ వేముగంటి • పలకరింపు

కవిత్వమూ, కథలూ కూడా రాసిన రచయితలు ఉన్నారు కానీ, రెండింటినీ కలిపి ఒకే ప్రచురణగా తెచ్చినవారు తెలుగులో అరుదు. మీ 'క్షణికాలు' పుస్తకంలో ఇలా నాలుగు విభాగాల కూర్పు గురించి చెప్పండి?



రాయడానికి అంటూ రచయిత పూనుకున్నాక అది ఖాళీ కాగితంపై కుట్ర పన్నుతున్నట్టే లెక్క. కానీ ఆ రాత వెనక ఉండే వైవిధ్యమైన మానవ ఉద్వేగాలకి, ఆలోచనలకి ఉండే స్వతంత్రతని, విశృంఖలత్వాన్ని ఒప్పుకుంటూ వాటన్నిటి మాటున కదులుతున్న అంతఃసూత్రం ఉండే ఉంటుందని, దాన్ని ఒడిసిపట్టాలనేదే ఈ పుస్తకం వెనక ఉన్న దృష్టి కావొచ్చు. దీని కోసం నేను చూపిన ప్రత్యేకమైన శ్రద్ధ ఏంటి అంటే వేచి చూడడం. ప్రశ్నల నుంచి శూన్యాల వరకు సాహిత్యం కాగల ప్రతీ అనుభవం కోసం ఎదురు చూడడమే నేను చేసింది.

నూటముప్పై పేజీల ఈ పుస్తకంలో నాలుగు భాగాలున్నాయి. వచనం వైపున రెండు భాగాలు: 1. కొన్ని కథలు 2. కాసిన్ని క్షణాలు. కవిత్వ రూపంలో రెండు భాగాలు: 1. కొన్ని తారలు 2. కాసింత శూన్యం.

కథ, కవిత్వం- ఈ రెండు ప్రక్రియల్లోనూ దేని వైపు మీకు మొగ్గు ఉంది? ఎందుకు?

రచన పరంగా నాలో నేను ఇంకా స్పష్టత సాధన చేస్తున్న రచయితననే చెప్పుకోవాలి. ఇక మనస్సుపై అనుభవాల స్పర్శ కదిలిన ప్రతి క్షణం కవిత్వంలానే తోస్తుంది నాకు. నాలో ఉండే ప్రశ్నల వేదనలకి భరించగలిగే రూపివ్వడంలో కవిత్వము; ఆ ప్రశ్నలని దాటి జీవితాన్ని జీవితంలా ఒప్పుకోవడంలో, ఆ క్షణాలని వాక్యాల్లోకి తర్జుమా చేసుకుంటున్న ప్రతీసారి నాకు వచనం ఊపిరందించగలదు అని ఈ మధ్య అనిపిస్తుంది.

సాహిత్య రచన వైపు మరలేందుకు మిమ్మల్ని ప్రభావితం చేసిన రచనలు లేదా రచయితల గురించి చెప్పండి.

సమూలంగా ఈ రచయితని చదివానని, వీళ్లంటే బాగా ఇష్టమని చెప్పలేను. విశ్వంభర దీర్ఘ కవితలో మొదటి నాలుగు మాటలు ఇప్పటికీ వెంటాడుతాయి. శేషేంద్రశర్మ కవిత్వం ఒంటరి సమయాల్లో ఆలంబనై నిలిచింది. పాలిష్ కవయిత్రి Wislawa Szymborska కవితలు కొన్ని నా రచనా ప్రయాణంలో ఒక విడుదలలాంటి స్వేచ్ఛనిచ్చాయి. ఎర్నెస్ట్ హెమ్మింగ్వే 'ఏ క్లీన్ వెల్ లైటెడ్ ప్లేస్' అనే కథలోని మానవ జీవితాల పార్శ్వాలు, అలా కదిలే కథలని వెతుక్కుంటాను. "జీవితాన్ని ఇంత స్వతంత్రంగా, ఇంత స్పష్టంగా చిత్రించొచ్చా" అనే ఆశ్చర్యం ఇచ్చే రచనలంటే ఇష్టం.

"పూర్తి స్పృహతో చేసే పనికి శోకభారం ఉండదు" అన్న రమణుల మాటల ప్రభావం అర్థమయేలా, మీ రచనల్లో దుఃఖభరిత సందర్భాలు ఉన్నా, అక్కడి వ్యక్తులు ఆ దుఃఖంలో లీనమవడం కనపడదు. వాస్తవం ఎలా ఉన్నా జ్ఞాపకాలే బాటసారి గొంతు తడిపేవి అన్న మీ మాటల వెనుక ఆలోచనలేమిటి?

మాటల వెనక ఉన్న భావం - acceptance. పూర్తి ఒప్పుకోలు. మెటాఫిజికల్ టోన్లో సాగే 'కాసింత శూన్యం' కవితలని కాస్త ఎత్తు నుంచి చూస్తే 'ఈర్ష్య', 'నొప్పి', 'మోహం' లాంటి పదాలు కనపడతాయి. అది ప్రయత్నంతో చేసిందని అనుకోను. దాని వెనక ఉద్దేశం- నాలో నేను వాటితో కుదుర్చుకోవాలనుకునే సంధి లాంటిదేమో. నేను నుంచి అనంతం వరకు పరుచుకున్న ఈ విశ్వానుభవమంతా నాతోనే ముడి వేయబడ్డదనే స్పృహ, అది మోపే బరువు, దాన్ని నాలోకి కలుపుకునే ప్రయాణంలోని మాటలేమో ఇవి.

ఎందుకు రాస్తున్నాను అనే ప్రశ్న కుతూహలంగా నైనా, కలవరంగా అయినా మిమ్మల్ని తాకిన సందర్భాలేవైనా ఉన్నాయా?

మానవ స్పృహ మోయక తప్పని శిలువ అని ఒక మాట రాసాను ఈ పుస్తకంలో. న్యూయార్క్ నగరంలోని వంతెనపై వర్షపు జల్లులో ఓ జంట నడుస్తున్న దృశ్యం నిండైన మోహన రాగమై వినిపించిందని కూడా రాసాను. ఒక వైపు మనల్ని శాసించే మానవావస్థలు (హ్యూమన్ కండిషన్), మరో వైపు అకస్మాత్తుగా దాడి చేసే అందమైన అనుభవాలు ఏకకాలంలో ఉండే జిందగీ తత్వాన్ని గమనించడంలోంచి ఈ పుస్తకం పుట్టిందేమో. అలా అని ఆనందాల్ని వెంబడిస్తూ, వాటి కోసమే వెంపర్లాడుతూ, గొప్ప క్షణాలని మాత్రమే కంటూ వెళ్లడంపై నాకు చాలా అనుమానాలున్నాయి. నాకే కాదు వేల ఏళ్లుగా మానవ జాతి తత్వ చింతన మూలాలన్నీ అక్కడివే అనిపిస్తుంది.



పుస్తకంలో ఎన్నో చోట్ల, ఎన్నో రకాలుగా హైదరాబాద్ నగరపు ఉనికి కనపడుతుంది. ఇది ఒట్టి వివరంలా వ్యక్తమైనది కాదని, మీ మొదటి పుట, 'To Hyderaabaad' చెబుతుంది. నగరం మీద ఎందుకంత ప్రేమ?

హైదరాబాద్ గురించి రాయాలని, ఈ నగరానికి నా పుస్తకంలో చోటివ్వాలని ప్రయత్నించకపోవడంలోనే నేను నోస్టాల్జియాని దాటానని అనుకుంటాను. ఈ పుస్తకంలో హైదరాబాద్ కొన్ని క్షణాలై వెలిగి బతుకుతుంది. ఎందుకంటే హైదరాబాద్ అంటే నాకు యవ్వనం. యవ్వనం అంటే నా లెక్కలో beautifully wasted glory (కాలాన్ని అందంగా తగలెట్టగలిగిన గొప్ప అదృష్టం.) వేల మైళ్ళ దూరాలు దాటినా హైదరాబాద్ నాలో ప్రవహించే నిజం. అందుకే అకస్మాత్తుగా, తన ఇష్టానుసారంగా కథల్లో, కవితల్లో మెరుస్తుంది తప్ప నాకంటూ స్థూలంగా అంత చోటివ్వమని అడగలేదు. అందుకే నేను దానికి మొదటి పేజీని తీసుకోమన్నానేమో.

ఇంటర్వ్యూ ■ మానస చామర్తి



బాబుకు బ్రహ్మారథం!

జిల్లాలో ఉత్సాహంగా సాగిన ప్రజాగళం సభలు

చంద్రబాబు ప్రజాగళం సభకు ప్రజలు బ్రహ్మారథం పట్టారు. పార్టీ అధినేత ఉపన్యాసాలకు పామర్రు, ఊయ్యూరు సభలు దద్దరిల్లాయి. చలోక్తులు, వైసీపీ నేతల అక్రమాలు, ప్రభుత్వ అరాచకాలపై వ్యంగ్యాస్త్రాలు సంధించిన ప్రతిసారీ జనం జయజయధ్వానాలతో మోతమోగాయి. విచ్చలవిడిగా గంజాయి వెదజల్లే ప్రభుత్వం కావాలా? రాజధాని నిర్మించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే ప్రభుత్వం కావాలా? నిలకడ లేని నేత కావాలా? జనంలో నిలిచే నేత కావాలా? అని పోలికలు పెట్టి చెప్పిన తీరుకు జనం చప్పట్లు, ఈలలతో మద్దతు తెలిపారు. ఇలా పామర్రు, ఊయ్యూరులలో ఆదివారం జరిగిన ప్రజాగళం సభలు ఉత్సాహంగా.. ఉల్లాసంగా, ఆద్యంతం ఆసక్తిగా సాగాయి. ఎటుచూసినా టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు రెపరెపలాడాయి.



ఉయ్యూరు ప్రజాగళం సభలో మాట్లాడుతున్న పెనమలూరు అభ్యర్థి బోడె ప్రసాద్



టీడీపీ, జనసేన బీజేపీ జెండాలతో అభిమానుల కదనోత్సాహం

వైసీపీ నేతలపై విమర్శనాస్త్రాలకు జనం చప్పట్లు

- అడుగడుగునా నీరాజనం
- ఉయ్యూరులో హైటెక్ సిటీ వంటి టవర్స్ నిర్మాణం
- మంత్రి జోగి కాదు... రోగ్
- ఆయన పెనమలూరుకే ప్రమాదకరం
- బాలశౌరి, వర్ల కుమార్ రాజా, బోడె ప్రసాద్‌లను గెలిపించాలని పిలుపు
- చంద్రబాబు ప్రజాగళం సభలు సూపర్ సక్సెస్

ఆంధ్రజ్యోతి, విజయవాడ/పామర్రు/మచిలీపట్నం/ఉయ్యూరు : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచార సభలకు పామర్రు, పెనమలూరు నియోజకవర్గం, ఉయ్యూరులో జనం పోటెత్తారు. పామర్రు, ఉయ్యూరు సెంటర్లలో నలుదిక్కులు టీడీపీ, జనసేన, బీజేపీ, కార్యకర్తలు, అభిమానులతో నిండిపోయాయి. పామర్రు, ఉయ్యూరులలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రజాగళం సభల్లో ప్రజలను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుంది. పామర్రులో గంటసేపు ప్రసంగించారు.

(మిగతా 4లో)

● నాపేరు డ్రైవర్ చంద్రుడు...

నేను డ్రైవర్ చంద్రుణ్ణి. నేను అనుభవం ఉన్న డ్రైవర్‌ని. నా బస్సు ప్రగతిపథం వైపునకు దూసుకుపోతుంది. ఈ బస్సు ఎక్కిన వారంతా సురక్షితంగా ఉంటారు. ప్రజలంతా అభివృద్ధికి పట్టంకటాలి. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఇంటి నుంచి సైనికులు తయారు కావాలి. పిల్లలు జెండా పట్టుకుని ఊరూరా తిరిగి ప్రచారం చేయాలి.





అభిమాని ఇచ్చిన కళ్లజోడుతో బాబు

● అవసరమైతే హైటెక్ సిటీలాంటి టవర్స్....

అమరావతి రాజధాని నిర్మాణం పూర్తయితే అందులో ఉయ్యూరు ఒక భాగం అయ్యేది. జగన్ పాలనలో సొంత స్థలం ఉన్నా ఇల్లు నిర్మించుకోలేని పరిస్థితి ఏర్పడింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైతే ఉయ్యూరులో హైటెక్ సిటీలాంటి టవర్స్ నిర్మాణం చేస్తా. అందులోనే పలు ఐటీ కంపెనీలను ఏర్పాటు చేస్తా. దీంతోపాటు టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తా. కృష్ణా డెల్టా ఆధునీరణ పూర్తి చేస్తా. కుందేరు వంతెన నిర్మాణాన్ని పూర్తి చేస్తా.



రాష్ట్రానికి సరైన డ్రైవర్ బాబు అంటూ ప్లకార్డులతో మహిళలు



బాబుతో పామర్రు అభ్యర్థి వర్ల కుమార్ రాజా, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి బాలశౌరి



పసుపు జెండాతో తలపాగా చుట్టి చిన్నారి సంబరం

కేసరపల్లిలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూక దాడి

● తీవ్రంగా గాయపడిన బేతాళ రవి, ఈశ్వర్



గాయపడిన బేతాళ రవి, ఈశ్వర్

గన్నవరం : టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూక అమానుషంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ ఘటన ఆదివారం రాత్రి గన్నవరం మండలం కేసరపల్లిలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బేతాళ ఈశ్వర్, రవి ... టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు అభిమానులు. గత ఎన్నికల నుంచి ఆయన వెంటే ఉన్నారు. ఇటీవల టీడీపీలో చేరారు. ఈ నేపథ్యంలో టీడీపీ గ్రామ నాయకత్వంతో కలిసి ఇంటింటా ప్రచారంలో చురుగ్గా పాల్గొంటూ వెంకట్రావుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. దీనిని జీర్ణించుకోలేక వైసీపీకి చెందిన నాగదేశి కొండలరావు, పండు, బాపట్ల సురేష్, పిల్లి సునీల్, బాపట్ల నవీన్, అంబటి రత్నం తదితరులు కొద్దిరోజులుగా రవి, ఈశ్వర్‌లను టీడీపీకి ప్రచారం చేయొద్దని హెచ్చరిస్తున్నారు. వారు మాత్రం యార్లగడ్డ గెలుపు కోసం ప్రచారం చేస్తున్నారు. తమ మాటను ఎందుకు వినరంటూ ఆదివారం ఈశ్వర్‌పై దాడికి దిగారు. ఈశ్వర్ సోదరుడు రవి దగ్గరలోనే ఉన్నాడు. తన తమ్ముడిని ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించాడు. దాడికి ముందుగానే పన్నాగం వేసుకున్న వైసీపీ మూక కర్రలతో సోదరులిద్దరిని తీవ్రంగా కొట్టి గాయపరిచారు. రవి తలకు గట్టిగా దెబ్బ తగిలింది. గాయపడిన వారిని టీడీపీ నాయకులు గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆస్పత్రికి వచ్చి బాధితుల వద్ద వివరాలు సేకరించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పోలీసుల పక్షపాతం

- టీడీపీ కార్యాలయం వద్ద రాకపోకల్లేకుండా బారికేడ్లు
- వైసీపీ కార్యాలయానికి రాకపోకల కోసం బారికేడ్లు తొలగింపు

పోలీసుల తీరుతో నోరెళ్లబెడుతున్న గుడివాడవాసులు



బారికేడ్లను తొలగించడంతో వైసీపీ ఎన్నికల కార్యాలయానికి సాఫీగా రాకపోకలు



టీడీపీ కార్యాలయానికి రాకపోకలు లేకుండా అడ్డం పెట్టిన ఉన్న బారికేడ్లు

గుడివాడ : పట్టణంలో ట్రాఫిక్ పోలీసుల చిత్రవిచిత్రాలకు పట్టణ వాసులు నోరెళ్లబెడుతు న్నారు. స్థానిక ఏలూరురోడ్డులోని జీ3 సింధూర సినిమాహాల్ ఉండటం, బిర్యానీ సెంటర్లు ఉండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంత రాయం కలుగుతుందని ట్రాఫిక్ పోలీసులు కొన్నేళ్లుగా బారికేడ్లు పెట్టి డివైడర్‌ను మూసివేశారు. ఆ ప్రాంతంలో అధికారపార్టీ ఎన్నికల కార్యాలయం ఏర్పాటు చేయడంతో రాకపోకలకు అనువుగా ఉండేలా పోలీసులు బారికేడ్లు తొలగించి స్వామిభక్తిని చాటుకు న్నారు. మరోపక్క ఏలూరురోడ్డులోని టీడీపీ కార్యాలయం (ప్రజావేదిక) వద్ద ఇన్నాళ్లూ బారికేడ్లు లేవు. అక్కడ బారికేడ్లు పెట్టి డివైడర్‌ను మూసివేసి రాకపోకలకు అడ్డంకి సృష్టించారు. ఈ ప్రాంతంలో బ్యాంకులకు, ఆసుపత్రులకు, రాజేంద్రనగర్‌కు వెళ్లాలన్నా చుట్టూ తిరిగి రావలసిన దుస్థితి నెలకొంది. నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్నట్టు పోలీసులు ఉందని, ప్రజల కోసం ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా మారిపోవడం ఏమిటని నగర వాసులు దుమ్మెత్తిపోస్తున్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం): 6-23 (సోమ)

సహర్ (ఉదయం): 4-43 (మంగళ)

ఉగాది నాడు దేవస్థానం బస్సుల్లో ఉచిత ప్రయాణం

-4లో

వడదెబ్బకు ఇద్దరి మృతి

-4లో

రాజీనామా చేసిన వలంటీర్లు 476 మందే

వీరిలో వైసీపీ కోసం వైదొలగినవారు 297 మంది

- వ్యక్తిగత కారణాలతో తప్పుకున్నవారు 179 మంది
- ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం వలంటీర్లు 10,175 మంది

తమ పార్టీ కోసం వలంటీర్లు భారీ సంఖ్యలో రాజీనామా చేశారని అధికార పార్టీ నేతలు చెప్పే మాటలు బూటకమని తాజా లెక్కలు తేటతెల్లం చేస్తున్నాయి. రాజీనామాలు చేసి తమకోసం పనిచేయాలని వైసీపీ నేతలు విజ్ఞప్తి చేసినా, ఒత్తిళ్లు చేసినా, బెదిరించినా, ప్రలోభపెట్టినా వలంటీర్ల నుంచి కనీస స్పందన లేదు. ఆదివారం నాటికి ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా రాజీనామా చేసిన వలంటీర్లు 476 మంది మాత్రమే. వీరిలో అధికార పార్టీ కోసం వైదొలగినవారు 297 మంది మాత్రమే.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 10,613 గ్రామ, వార్డు సచివాలయాల క్లస్టర్లు ఉన్నాయి. ప్రతి క్లస్టర్ పరిధిలో ఒక వలంటీర్ విధులు నిర్వహించాల్సి ఉండగా.. ఈ క్లస్టర్ల పరిధిలో మార్చి 16వ తేదీ వరకు 10,175 మంది వలంటీర్లు పనిచేశారు. ఏప్రిల్ 7వ తేదీ నాటికి మొత్తం 476 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. ఒక్కసారి ఈ రాజీనామాలు చేసిన వారి సంగతి చూస్తే.. మొత్తం రాజీనామాలు చేసిన 476 మంది వలంటీర్లలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాజీనామాలు సమర్పించిన వారు 297 మంది మాత్రమే ఉన్నారు. మరో 179 మంది వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామాలు చేశారు. వీరు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనటానికి రాజీనామాలు చేయలేదు. మరో ఐదుగురు వలంటీర్లను వారిపై వచ్చిన ఫిర్యాదుల కారణంగా విధుల నుంచి తొలగించారు. అధికార పార్టీ నేతలు మాత్రం వీరంతా కూడా తమ కోసమే రాజీనామా చేసినట్టుగా సెల్ఫ్ డబ్బా కొట్టుకుంటూ సెల్ఫ్‌గోల్‌లో పడ్డారు. జిల్లా వ్యాప్తంగా 10,175 మంది వలంటీర్లకుగాను ఇప్పటికీ 9,694 మంది పనిచేస్తున్నారు.


బాబు తోనే భవిష్యత్తు..


పామర్రులో చంద్రబాబు ప్రజాగళం సభకు హాజరైన జనం


చంద్రబాబు సీఎం కావాలని మహిళల ప్లకార్డుల ప్రదర్శన

బాబుకు బ్రహ్మరథం!

(3వ పేజీ తరువాయి)

పెనమలూరు నియోజకవర్గానికి సంబంధించి ఉయ్యూరు మార్కెట్ సెంటర్లో సభ నిర్వహించారు. ధ్వంసమైన రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రజలు బీజేపీ, టీడీపీ, జనసేన కూటమికి మద్దతు ఇచ్చి గెలింపించాలని చంద్రబాబు కోరారు. గతంలో టీడీపీ తరుపున పోటీచేసి ఓడిపోయినప్పటికీ పార్టీనే నమ్ముకని పనిచేస్తున్న వర్ల రామయ్య తనయుడు కుమార్ రాజా వద్ద నగదు లేనప్పటికీ అభ్యర్థిగా నిలబెట్టానని, కోటి రూపాయలు కూడా వర్ల వద్ద లేవని, వర్లను ఉద్దేశించి పదేపదే గెలిపించాలని చంద్రబాబు అన్న సమయంలో కుమార్‌రాజా భావోద్వేగం ఆపుకోలేక కన్నీటిపర్యంతమయ్యారు. ఇప్పటివరకు వైసీపీ ఎంపీగా ఉండి, ఆ పార్టీ నాయకుల ఆగడాలను, భరించలేక వల్లభనేని బాలశౌరి జనసేన టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్నారని అయనను గెలిపించాలని చంద్రబాబు పదేపదే కోరారు. పామర్రు నియోజకవర్గం ఎమ్మెల్యే కైలే పామర్రులో మినీ లోటస్‌పాండ్ మాదిరిగా భవనం నిర్మాణం చేసుకున్నారని, ఇసుక, గ్రావెల్ దోపిడీలో రూ.కోట్లు గడించారని, అభివృద్ధిని మాత్రం గాలికొదిలేశారని దుయ్యబట్టారు. జగన్‌కు గొడ్డలి పట్టుకుని తిరిగేవారు కావాలని, గంజాయి బ్యాచ్ కావాలని, నగదు కావాలని, తనకు మాత్రం ప్రజలను గుండెల్లో పెట్టుకునే నాయకులు కావాలని చెప్పడంతో జనం ఈలలతో హుషారెత్తారు.

అడుగడుగున్నా నీరాజనం

టీడీపీ అధినేత చంద్రబాబుకు జనం అడుగడుగునా నీరాజనం పలికారు. ఆదివారం పామర్రులో మచిలీపట్నం- విజయవాడ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు 4.36 గంటలకు ఆయన చేరుకున్నారు. ఆయనకు టీడీపీ నాయకులు కొనకళ్ల నారాయణరావు, దేవినేని ఉమా, వర్ల కుమార్‌రాజా, ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, గొట్టిపాటి రామకృష్ణ స్వాగతం పలికారు. అనంతరం బస్సులోకి వచ్చిన ఆయన కొద్దిసేపు నాయకులతో మంతనాలు జరిపారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి ఎన్టీఆర్ విగ్రహం సెంటరుకు చేరుకున్నారు. దారిపొడవునా మహిళలు, యువత ఆయనకు స్వాగతం పలికారు. సభావేదిక వద్ద గజమాలతో ఆయనను సత్కరించారు. పామర్రు నుంచి ఉయ్యూరు మార్కెట్ సెంటరు వరకు 12 కిలోమీటర్ల దూరం ఉండగా దారిపొడవునా ఆయన రాకకోసం అభిమానులు వేచి ఉండి హరతులతో స్వాగతం పలికారు.

రోగ్‌తో చాలా ప్రమాదం..

అతను జోగి రమేష్ కాదు.. ఒక రోగ్. అతనికి జిల్లాలో ఎక్కడా మంచి పేరు లేదు. పెడన నియోజకవర్గాన్ని పిండేసిన ఈ రోగ్ ఇప్పుడు పెనమలూరు వచ్చాడు. అతను చాలా ప్రమాదకరం. బంటుమిల్లు మండలంలో సెంటు పట్టా ఇవ్వడానికి ఒక్కొక్క లబ్ధిదారు నుంచి రూ.50 వేలు వసూలు చేశాడు. నా ఇంటి మీదకి కర్రలతో దాడి చేయడానికి వచ్చి నాపైనే కేసు పెట్టారు. వైసీపీలో మంచి వాళ్లకు స్థానం లేదు. బూతులు తిట్టే కొడాలి నాని, పేర్ని నాని, రోగ్ రమేశ్ వంటి వారు మాత్రమే ఉంటారు.

అమరావతిని నాశనం చేశారు : బాలశౌరి



పామర్రులో జరిగిన ప్రజాగళం కార్యక్రమం మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు అధ్యక్షతన జరిగింది. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి మాట్లాడారు. 'విశాఖపట్నంలో సీఎం వైఎస్ జగన్ రూ.500కోట్లతో ఇల్లు కట్టుకున్నాడు. మూడు ప్రాంతాల్లో రాజధాని కోసం ఒక్క ఇటుక వేయలేదు. పేదలకు ఒక్క ఇంటిని కూడా నిర్మాణం చేయలేకపోయారు. రాజదాని ఎక్కడుందో చెప్పుకోవడానికి సిగ్గుచేటుగా ఉంది' అని ఆయన అన్నారు.

రైతులకు తీరని అన్యాయం : వర్ల కుమార్‌రాజా

వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు తీరని అన్యాయం చేశారని పామర్రు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్ రాజా అన్నారు. 'బడుగు, బలహీన వర్గాలకు టీడీపీ అండగా ఉంది. యువతను వీధిన పడేసిన ఘనత వైసీపీది. ధరలను అమాంతం పెంచి పేదల బతకుతో ఆటలాడుకుంది' అని కుమార్‌రాజా అన్నారు.

ఉగాదినాడు దేవస్థానం బస్సుల్లో ఉచిత ప్రయాణం

వన్‌టౌన్ : ఉగాది పర్వదినం సందర్భంగా దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ఈ నెల 9వ తేదీన దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు దేవస్థానం బస్సుల్లో ఉచితప్రయాణం కల్పిస్తున్నామని ఈవో కేఎస్ రామారావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని మంగళవారం ఉదయం 3 గంటల నుంచి అమ్మవారికి సుప్రభాత సేవ జరుగుతుందన్నారు. అనంతరం అమ్మవారికి ఉపాలయాలలో కొలువై ఉన్న దేవతామూర్తులకు స్నపనాభిషేకం నిర్వహిస్తారని, అనంతరం అలంకారం, అర్చన, నివేదన, హారతి కార్యక్రమాలు అనంతరం ఉదయం 9 గంటల నుంచి అమ్మవారి సర్వదర్శనం ప్రారంభమవుతుందని తెలిపారు. ఆ రోజున దేవస్థానానికి చెందిన అన్ని బస్సుల్లోను ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కలుగజేస్తున్నట్టు పేర్కొన్నారు. విజయవాడ రైల్వేస్టేషన్ తూర్పు బుకింగ్ ఆఫీస్ వైపు నాలుగు బస్సులు, పున్నమిఘాట్ నుంచి రెండు బస్సులు, దుర్గాఘాట్ నుంచి రెండు బస్సులు మొత్తం ఎనిమిది సర్వీసులు కొండపైకి తిరుగుతాయని చెప్పారు.

కొండపైకి ద్విచక్ర వాహనాలు, కార్లకు అనుమతి లేదు

ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం భక్తుల రద్దీ దృష్ట్యా కొండపైకి ద్విచక్ర వాహనాలు, కార్లను అనుమతించడం లేదన్నారు. భక్తులు తమ వాహనాలను విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఎదురుగా ఉన్న ప్రదేశంలో కానీ, పున్నమిఘాట్ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో కానీ పార్కింగ్ చేసుకుని కొండపైకి చేరుకోవాలన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ గుంటూరు వరుణ్

ప్రజలకు చేరువగా ప్రపంచస్థాయి గుండె శస్త్రచికిత్సలు

డాక్టర్ గుంటూరు వరుణ్

ప్రభుత్వాసుపత్రి, ఏప్రిల్ 7 : గుండె శస్త్రచికిత్సల్లో అనేక విప్లవాత్మక ఆవిష్కరణలు అందుబాటులోకి వచ్చాయని, నూతన విధానాలను అందిపుచ్చుకుని రోగులకు మెరుగైన సేవలందించే దిశగా వైద్యులకు ప్రోత్సాహం అందించేందుకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఇటర్నేషనల్ కార్డియాక్ సర్జన్ (ఐఏఐసీఎస్) కృషి చేస్తుందని ఐఏఐసీఎస్, ఐఎస్ఏఐసీఎస్ జనరల్ సెక్రటరీ డాక్టర్ గుంటూరు వరుణ్ తెలిపారు. ఐఏఐసీఎస్ తొలివార్షికోత్సవం ఆదివారం విజయవాడ తాజ్ వివంతా హోటల్లో ఘనంగా జరిగింది. అనంతరం హ్యాండ్స్ ఆన్ క్యాథ్ సిల్క్ వర్క్‌షాపు విజయవంతంగా ముగిసింది. కార్యశాలలో వివిధ అంశాలపై పలువురు నిపుణులు ప్రసంగించారు. వివిధ శస్త్రచికిత్సలపై వైద్యులకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ గుంటూరు వరుణ్ ప్రసంగిస్తూ, ప్రపంచస్థాయి గుండె శస్త్ర చికిత్సలను ప్రజలందరికీ చేరువ చేయడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. ఐఎస్ఏఐసీఎస్ అధ్యక్షుడిగా ముంబాయికి చెందిన డాక్టర్ జైనలబెడెన్ హముద్లే, వైస్ ప్రెసిడెంట్‌గా కోయంబత్తూరుకు చెందిన డాక్టర్ ప్రశాంత్ వైజయనాథ్, జనరల్ సెక్రటరీగా డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్ అధినేత డాక్టర్ గుంటూరు వరుణ్‌లు ఎన్నికయ్యారు. కృష్ణా మిల్క్ యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు, వైద్యులు వివేక్‌జవాలి, గోపాలకృష్ణ గోఖలే, జయకృష్ణన్, ఉగల్ కిషోర్‌మిశ్రా, వినీత్ మహాజన్, రెహాన్ పాల్గొన్నారు.

సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేసిన జగన్ : దేవినేని



గొల్లపూడి, ఏప్రిల్ 7 : అస్తవ్యస్త విధానాలతో సీఎం జగన్మోహన్ రెడ్డి సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేశాడని రాష్ట్ర జలనవరులశాఖ మాజీమంత్రి దేవినేని ఉమా ధ్వజమెత్తారు. గొల్లపూడిలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రానున్న రోజుల్లో నీటి ఎద్దడి పొంచి ఉందన్నారు. డెల్టా రెండో పంటకు విరామం ప్రకటించడం దారుణమన్నారు. ఖరీఫ్ పంటలను ఎండ బెట్టారని, పల్లెల్లో, పట్టణాల్లో తాగునీటి కోసం ప్రజలు ఇక్కట్లు పడుతున్నారన్నారు. పులిచింతల ఎండబెడితే ప్రజల గొంతు తడిచేదెలా అని అన్నారు. సొంత ప్రయోజనాలు తప్ప ప్రజా ప్రయోజనాలు పట్టని జగన్‌ను ఇంటికి పంపేందుకు జనం సిద్ధంగా ఉన్నారన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం

కేశినేని శ్రీదేవి, గద్దె అనురాధ



కృష్ణలంక: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని కేశినేని శ్రీదేవి, గద్దె అనురాధలు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం తూర్పు నియోజకవర్గంలోని 22వ డివిజన్‌లో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మలేరియా ఆస్పత్రి నుంచి ప్రారంభించిన ఈ ప్రచారంలో జనసేన, బీజేపీ బలపరిచిన తెలుగుదేశం పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్ని, ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ల విజయాన్ని కాంక్షిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలు పంచి వివరించి చెప్పారు. భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు.


గద్దె రామ్మోహన్ సమక్షంలో టీడీపీలో చేరిన యువకులు

టీడీపీకి పెరుగుతున్న ఆదరణ

కృష్ణలంక, ఏప్రిల్ 7 : కృష్ణలంక హైస్కూల్ సమీపంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, నాయకులు బొప్పన భవకుమార్ తదితరుల సమక్షంలో ఆదివారం రాత్రి దాదాపు 150 మందికి పైగా యువకులు గద్దె, కేశినేని చిన్నిల అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి గద్దె, బొప్పన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందనే భావన రాష్ట్ర ప్రజలతో పాటు ఇతర పార్టీ శ్రేణులు కూడా భావిస్తున్నారన్నారు. అందువల్లనే రాష్ట్రస్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు టీడీపీలో చేరికలు భారీగా పెరిగాయన్నారు. బొప్పన భవకుమార్, షేక్ షాబు, చలమలశెట్టి నాగేశ్వరరావు, స్వామినాయుడు, గణపతి, నాగార్జున, షేక్ ఉమర్ అలీ, షేక్ సుభాని, షేక్ గఫార్, షేక్ ఫరూక్ కొల్లిపర అయ్యప్ప, టీడీపీ యువనాయకులు పోడూరి పవన్‌కుమార్, తవ్వా ప్రకాష్, 20, 21 టీడీపీ డివిజన్ అధ్యక్షులు వేములపల్లి రంగారావు, మోటేపల్లి చిన్నా, పి.లక్ష్మి, చిన్నతల్లి, గొరిపర్తి నామేశ్వరరావు, కొడాలి సాయిబాబు, చింతా వెంకటేశ్వరరావు, బీజేపి నాయకులు వాసా పల్లవ రాజు, జనసేన నాయకులు పి.జయ, షేక్ జావేద్ పాల్గొన్నారు.

పలువురు ప్రముఖులకు 'గీత' అవార్డుల ప్రదానం

ధర్నాచౌక్: ఉగాది సందర్భంగా గీత విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విజయాలు సాధించిన పలువురికి గీతా అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం జరిగింది. నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ప్రముఖ డాక్టర్లు ఎంజే నాయుడు, డాక్టర్ కుందా శ్రీధర్, డాక్టర్ మాధవీ నాయుడు, డాక్టర్ బషీర్ అహ్మద్ మయూఖ్, చిత్ర కళారంగానికి చెందిన కళాసాగర్, ఏపీజీబీ కమిషన్ ఎండీ బొమ్మిశెట్టి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ శేర్వాణీమూర్తి, వ్యక్తిత్వ వికాస నిపుణురాలు కే.పద్మావతి ఈ అవార్డులను అందుకున్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నం రామకృష్ణ, ప్రముఖ చిత్ర సీనియర్ పాత్రికేయుడు వావిలాల రజనీకాంత్‌శర్మ అవార్డులను అందజేశారు. విజన్ ఫౌండర్ చైర్మన్ గీతానంద్ పొక్కులూరి సుబ్బారావు అన్నపూర్ణ, సాయి నాగలక్ష్మీ పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో కథనాలు అవాస్తవం

స్వతంత్ర అభ్యర్థిగా పోటీపై బండ్రెడ్డి స్పందన

అవనిగడ్డ : టిక్కెట్ విషయంలో అసంతృప్తిగా ఉన్న జనసేన నేతలు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దింపనున్నట్టు సామాజిక మాధ్యమాల్లో కథనాలపై బండ్రెడ్డి రామకృష్ణ స్పందించారు. అవనిగడ్డ అభ్యర్థిత్వం విషయంపై అధినేత పవన్ కళ్యాణ్‌ను కలిసి మాట్లాడతానని, ఆయన న్యాయం చేస్తారన్న నమ్మకం ఉందని, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. కూటమిలో చిచ్చు పెట్టేందుకు కొందరు యత్నిస్తున్నారని, ఈ విషయాన్ని కార్యకర్తలు గమనించాలని రామకృష్ణ ఆదివారం మధ్యాహ్నం విడుదల చేసిన వీడియో సందేశంలో స్పష్టం చేశారు.

ఆలయ భూముల వేలంపాటపై విచారణ

వన్‌టౌన్, ఏప్రిల్ 7: పోరంకి వసంత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి దేవస్థానంలో జరిగిన ఆలయ భూముల వేలంపాటలో చోటు చేసుకున్న అవకతవకలపై జోన్ డిప్యూటీ కమిషనర్ విజయరాజు విచారణ చేపట్టారు. ఆదివారం ఆయన పోరంకిలోని ఆలయానికి వెళ్లి అక్కడ ఈవో సుబ్బారెడ్డి, పలువురు రైతులనడిగి వివరాలు తెలుసుకున్నారు పోరంకిలోని ఆలయాలకు చెందిన 7.75 ఎకరాల మెట్ట భూవికి గత నెల 26న వేలం పాట జరిగింది. రైతు తలశిల శివశేఖర్ బాబు ఏడాదికి రూ.3.07 లక్షలు చెల్లించేలా మూడేళ్ల లీజుకు తీసుకున్నాడు. దీంట్లో అవకతవకలు జరిగాయని ఆంధ్రజ్యోతిలో శనివారం శఠగోపం శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై కమిషనర్ స్పందించి విచారణకు ఆదేశించారు. సోమవారం కూడా విచారణ జరగనుంది

బొండా ఉమాకు వ్యతిరేకంగా వైసీపీ నేతల నినాదాలు

● ప్రశ్నించిన డూండీ రాకేశ్‌పై కేసు నమోదు

విద్యాధరపురం, ఏప్రిల్ 7: అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో రసభస జరిగింది. ఆదివారం మొగల్రాజపురంలోని అమ్మ కల్యాణమండపంలో అర్బన్, జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. తొలుత ముఖ్య అతిథిగా వెలంపల్లి శ్రీనివాసరావు హాజరై కొద్దిసేపు మాట్లాడి వెళ్లిపోయారు. అరగంట తరువాత బొండా ఉమామహేశ్వరరావు హాజరై కల్యాణమండపంలోకి వస్తుండగా అక్కడే ఉన్న కొండపల్లి బుజ్జి ముగ్గురు అనుచరులు బొండా ఉమామహేశ్వరరావు గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఆయన పట్టించుకోకుండా స్టేజీ వద్దకు వెళ్లి ఆర్యవైశ్యులకు టీడీపీ అండగా ఉంటుందని చెప్పి స్టేజీ దిగి వెళ్లిపోతుండగా మరోసారి వారు నినాదాలు చేశారు. ఆయన వెళ్లిన కొద్దిసేపటికి టీడీపీ అనుబంధ సంస్థ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండీ రాకేష్ బొండా ఉమా హాజరైతే ఎందుకు వ్యతిరేక నినాదాలు చేశారని ప్రశ్నించారు. దీంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న వెలంపల్లి శ్రీనివాసరావు మాచవరం పోలీసులతో మాట్లాడి సుమారు 30 మంది పోలీసును వేదిక వద్దకు పంపించినట్టు సమాచారం. అక్కడకు వెళ్లిన మాచవరం సీఐ, ఇతర అధికారులు పూర్తి వివరాలు తెలుసుకోకుండా రాకేష్‌ను పలువురు కానిస్టేబుళ్లు కొట్టుకుంటూ రోడ్డుపైకి తీసుకు వచ్చి అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకుని వెళ్లారు. దీంతో ఆర్యవైశ్య నేతలు నూకల నాగేశ్వరరావు, దరిశి వాసు, వీవీకే నరసింహరావు, తుమ్మలపల్లి శ్రీను, అర్బన్, జిల్లా ఆర్యవైశ్య సంఘం నేతలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. వెలంపల్లి శ్రీనివాసరావు కావాలనే ఆర్యవైశ్యులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్టు పలువురు ఆర్యవైశ్య నేతలు ఆరోపిస్తున్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కేశినేని చిన్ని, సుజనా చౌదరి, ఫతావుల్లా, నాగుల్ మీరా, చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న సుజనా చౌదరి, కేశినేని శివనాథ్

నగరాభివృద్ధికి కృషి చేస్తాం

● మీట్ అండ్ గ్రీట్‌లో సుజనా, కేశినేని చిన్ని హామీ

వన్‌టౌన్, ఏప్రిల్ 7: నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పశ్చిమ నుంచి కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి), పార్లమెంట్ నియోజకవర్గ కూటమి బలపరచిన టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) హామీ ఇచ్చారు. ఆదివారం వన్‌టౌన్‌లోని టీడీపీ నేత, ప్రముఖ వ్యాపారవేత్త కొణిజేటి రమేష్ నివాసంలో ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్‌లో వారిద్దరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరాన్ని సర్వతోముఖాభివృద్ధికి తాము శాయశక్తులా కృషి చేస్తామన్నారు. కేంద్రంలో తనకున్న పరిచయాలతో నగరానికి ఏం కావాలో సాధిస్తామని సుజనా చౌదరి చెప్పారు. కేశినేని చిన్ని పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు తమ పూర్తి సహకారం అందిస్తామని, అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కొణిజేటి రమేష్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అభ్యర్థులు గెలుపు ఖాయమన్నారు. టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు రాజు సోలంకి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని స్పష్టం చేశారు. తొలుత సుజనా చౌదరి, కేశినేని చిన్నికి రమేష్ స్వగృహం వద్ద ఘన స్వాగతం లభించింది. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. నేతలు పిళ్లా సుదర్శనరావు, అమర గోపాలకృష్ణ, ఈది సాంబశివరావు, ఈది సూరిబాబు, బీజేపీ నేతలు అడ్డూరి శ్రీరామ్, పొట్టి శ్రీహరి, భోగవల్లి శ్రీధర్, శివకుమార్ పట్నాయక్, అవ్వారు బుల్లబ్బాయి, ఎం.ప్రభుకుమార్ పాల్గొన్నారు.

సర్వతోముఖంగా పశ్చిమ అభివృద్ధి: సుజనా

పశ్చిమను సర్వతోముఖంగా అభివృద్ధి చేస్తానని బీజేపీ పశ్చిమ నేతలు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో బీజేపీ పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. ఆదివారం సాయంత్రం భవానీపురంలోని శివాలయం సెంటర్‌లోని ఎన్నికల కార్యాలయంలో ఆదివారం జరిగిన పశ్చిమ నియోజకవర్గ బీజేపీ నేతలు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ముఖ్యమైన సమస్యలను గుర్తించినట్టు తెలిపారు. త్వరలో మానిఫెస్టో రూపొందించి విడుదల చేస్తామన్నారు. అయోధ్య రామాలయం తరహాలోనే ఇంద్రకీలాద్రిని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. తాను పుట్టింది కంచికచర్ల అని, నగరంలోనే అందుబాటులో ఉంటానని, తన సేవలను వినియోగించుకోవాలన్నారు. బీజేపీ ఏపీ ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ మాట్లాడుతూ ఢిల్లీలో ప్రధానిగా మోదీ, ఏపీలో సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తారని, అలాగే సుజనా చౌదరి రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరిన వందమందికి పసుపు కండువాలు కప్పి ఆహ్వానించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ రాజు, జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, అధికార ప్రతినిధి యామినీ శర్మ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు చిన్ని, సుజనా

స్థానిక పంజాసెంటర్‌లోని షా జహూర్ ముసాఫిర్ ఖానాలో ఆదివారం టీడీపీ నేత మహమ్మద్ ఫతావుల్లా ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), బీజేపీ పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి, టీడీపీ నేత నాగుల్ మీరా, బుద్దా వెంకన్న, ఎంఎస్ బేగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేకంగా అల్లా ఆశీస్సులు అందజేశారు. ముస్లిం మైనార్టీల మైత్రిని కోరుతున్నామని నేతలు ప్రకటించారు.

ఫిలడెల్ఫియా చర్చిలో సుజనా, శివనాథ్ ప్రార్థనలు

భవానీపురం: 45వ డివిజన్ సితార సెంటర్‌లోని ఏజీ ఫిలడెల్ఫియా చర్చిలో ఆదివారం బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి వైసుజనా చౌదరి, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మైనార్టీ నేతలు ఎస్‌కే నాగూల్ మీరా, మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, సీనియర్ నేతలు గంగవరపు మురళీ, ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకు ఓటే కీలకం: శివనాథ్

భారతీనగర్: ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి 30 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందని రాష్ట్రం అభివృద్ధిపరంగా పురోగమించాలంటే మార్పు అవసరమని, అది ఓటుతోనే సాధ్యపడుతుందని బీజేపీ, జనసేన బలపరిచిన టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడ క్లబ్‌లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా కేశినేని శివనాథ్, టీడీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, బీజేపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ వాకర్స్ సభ్యులతో పాటు క్లబ్‌లోని


వాకర్స్‌తో కేశినేని చిన్ని, సుజనా

నూతన ఓటర్లతో మాట్లాడుతూ చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, త్వరలో జరిగే ఎన్నికల్లో సైకిల్, కమలం గుర్తులపై ఓటు వేసి తనను, గద్దె రామ్మోహన్, సుజనా చౌదరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. విజయవాడ క్లబ్ వాకర్స్ అసోసియేషన్స్, టీడీపీ, జనసేన, బీజేపి నేతలు పాల్గొన్నారు.

వడదెబ్బకు ఇద్దరి మృతి



అవనిగడ్డ రూరల్/పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 7 : ఎండ వేడిమి, వడగాలులకు ఆదివారం ఇద్దరు మృతిచెందారు. కృష్ణాజిల్లా పులిగడ్డ గ్రామానికి చెందిన మండలి బాల సుబ్రహ్మణ్యం (75) వడదెబ్బతో మృతి చెందగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ నివాళులర్పించారు. ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలుకు చెందిన చంద్రకుంటి బొడ్డమ్మ (75) ఎండ దెబ్బకు దేవస్థాన ప్రాంగణంలో మృతి చెందింది. ఈమెకు కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

జగ్గయ్యపేట, ఏప్రిల్ 7 : అన్నవరం గ్రామంలో అధికార వైసీపీ నిర్వహించిన 'సిద్ధం' కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ చారుగుండ్ల కళావతిని సస్పెండ్ చేస్తూ జిల్లా డ్వామా పీడీ జె.సునీత ఆదేశాలు జారీచేశారు. ఈసీ నిబంధనలు ఉల్లంఘించి ప్రచారంలో పాల్గొన్నట్టు 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూచనలతో పై ఆదేశాలు ఇచ్చారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

పెనుగంచిప్రోలు: తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యం 129 బాటిళ్లను ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం అక్రమంగా ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న మండలంలోని నవాబు పేట గ్రామానికి చెందిన తోట సురేశ్, కాకాని కృష్ణలపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు నందిగామ ఎస్ఈబి స్టేషన్ టౌన్ ఆఫీసర్ కె.కోటేశ్వర్ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ వై.భాస్కర్‌జీ, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనం వేళల్లో మార్పులు

వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి వచ్చే వీఐపీలు, వృద్ధులు, దివ్యాంగులు, డిపార్ట్‌మెంట్ అధికారులు ఇకపై ఉదయం 11.30 గంటల్లోపు లేదా మధ్యాహ్నం 1.30 గంటల తరువాత రావాలని ఈవో కేఎస్ రామారావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఆదివారాన్ని పురస్కరించుకుని సర్వజన ఆయురారోగ్యాలను కాంక్షిస్తూ అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. అరుణ పారాయణతో పాటు సూర్య నారాయణ స్వామికి అర్చనలు నిర్వహించారు.

ఇద్దరు కానిస్టేబుల్స్ వీఆర్‌కు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

సత్యనారాయణపురం, ఏప్రిల్ 7: కాసులు కేసులు మూడో ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో మాయ అని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఇద్దరు కానిస్టేబుళ్లను వీఆర్‌కు పంపించారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై పోలీసు కమిషనర్ సుదీర్ఘ విచారణకు ఆదేశించారు. దీంతో వెస్ట్ ట్రాఫిక్ ఏసీపీ జనార్ధననాయుడు దర్యాప్తు ప్రారంభించి ఎన్ని వాహనాలకు కేసులు లేకుండా పంపించారో వివరాలు సేకరించారు. డ్రంకన్ డ్రైవ్‌కు ఉపయోగించే మిషన్ల పనితీరును పరిశీలించారు. వాహనాలు పంపడంలో ముగ్గురి పాత్ర ఉందని ప్రాథమికంగా అంచనాకి వచ్చారు. దర్యాప్తులో డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయకుండా వాహనాలు ఇచ్చినట్లు గుర్తించిన విషయాన్ని పోలీసు కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఏసీపీ దర్యాప్తులో మరో కానిస్టేబుల్ పైనా ఆరోపణలు వచ్చినా అవి తేలకపోవడంతో కానిస్టేబుల్ బ్రహ్మం, శేఖర్‌ను వీఆర్‌కు పంపించారు. ఇదంతా స్టేషన్ హౌస్ ఆఫీసర్ కనుసన్నల్లో జరిగినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కిందిస్థాయి సిబ్బంది పైనే వేటు వేయడం ఎంతవరకూ సబబని సిబ్బంది చర్చించుకుంటున్నారు. గతంలో, ప్రస్తుతం 3వ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో పని చేసిన సీఐల టైమ్‌లోను ఇలా జరిగిందని తేలడంతో వారి పాత్రపైనా పూర్తిస్థాయి దర్యాప్తునకు పోలీసు కమిషనర్ ఆదేశించినట్టు సమాచారం. మరోసారి డ్రంకన్‌డ్రైవ్ కేసుల విషయంలో పొరపాట్లు జరగకుండా ఉండేందుకు పోలీసు కమిషనర్ పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (కి.లో)



బ్రాయిలర్ బర్డ్	155, 164, 175
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

రేపటి నుంచి త్రిశక్తిపీఠంలో అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు

కృష్ణలంక, ఏప్రిల్ 7: వసంత నవరాత్రుల సందర్భంగా త్రిశక్తి పీఠంలోని మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఉగాది రోజు మంగళవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు ఉదయం 7.30 గంటల నుంచి అభిషేకం, పుష్పార్చన నిర్వహిస్తామని ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్‌కుమార్ ఆదివారం తెలిపారు. తొమ్మిదిరోజుల పాటు నిర్వహించే అభిషేకానికి రూ.1000, తొమ్మిది రోజుల పాటు నిర్వహించే పుష్పార్చనకు రూ.1000 చొప్పున రుసుం చెల్లించాలని ఆయన తెలిపారు. 17వ తేదీ శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పాయకాపురం చేపల మార్కెట్‌లో తనిఖీలు

● ఆరు కాటాలు సీజ్ చేసిన తూనికలు, కొలతలు శాఖ అధికారులు

పాయకాపురం, ఏప్రిల్ 7: చేపల మార్కెట్‌లో తూనికలు, కొలతలు శాఖ అధికారులు ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. తూనికల్లో కొందరు వ్యాపారులు భారీ మోసాలకు పాల్పడుతున్నట్లుగా గుర్తించారు. కేజీకి అరకేజీ లెక్కన తూనికల్లో మోసాలకు పాల్పడుతున్న ఆరుగురు వ్యాపారు లను గుర్తించారు. వారి కాటాలను సీజ్ చేశారు. వారిపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో తూని కలు కొలతలు శాఖ డిప్యూటీ కంట్రోలర్ ఎ.కృష్ణ చైతన్య, అసిస్టెంట్ కంట్రోలర్స్ భానుప్రసాద్, రాజేంద్రప్రసాద్, కుమారి, ఇన్‌స్పెక్టర్లు ఈశ్వరరావు, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

రేపు దాసాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

భారతీనగర్: ఉగాది పండుగ సందర్భంగా కరెన్సీనగర్ దాసాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ ఆది వారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఓటర్ల జాబితాల పరిశీలన

వన్‌టౌన్, ఏప్రిల్ 7: పశ్చిమ నియోజకవర్గం 52వ డివిజన్ పరిధి ఉప్పరవాగు కొండ, ఊటబావి కొండ ప్రాంతాల్లో ఆదివారం టీడీపీ 174, 177 బూత్ కన్వీనర్లు ఓటర్ల జాబితాల పరిశీలన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఆ ప్రాంతంలో 300 కుటుంబాల వారికి టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. 174 బూ త్ కన్వీనర్ గుర్రం వెంకటేశ్వరరావు, 177 బూత్ కన్వీనర్ గోలి నాగలక్ష్మికుమార్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోలి శ్రీనివాసరావు, గజ్జెల శ్రీనివాసరా వు, బెన్నాడ ప్రియ, నక్కా దుర్గారావు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

గవర్నర్‌పేట, ఏప్రిల్ 7: స్వచ్ఛంద సేవా సంస్థలు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని టీడీపీ-జనసేన-బీజేపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు సతీమణి సుజాత అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సం దర్భంగా గోర్తి సత్యవతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో ఆదివారం సూర్యారావుపేటలోని విక్రాంత్ పబ్లిషర్స్ ఆవరణలో పేదల కోసం నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను సినీనటి శాంతి ప్రియ, రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ ఎం. సతీష్ బాబుతో కలిసి ఆమె ప్రారంభించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం రోజున ఏటా క్యాంపులు నిర్వ హించి, పేదలకు వైద్యసేవలు అందిస్తున్నామని, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని ట్రస్ట్ వ్యవస్థాపకుడు గోర్తి శ్రీనివాస చక్రవర్తి తెలిపారు. 23వ డివిజన్ కార్పొరేటర్ నెలి బండ్ల బాలస్వామి, వైద్యులు ఫణీంద్ర, ప్రత్యూష, దుహిత, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు హరిత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు

భవానీపురం, ఏప్రిల్ 7: 41వ డివిజన్‌లోని హజ్రత్ సయ్యద్‌గాలీబ్ షహీద్ దర్గాలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న 436వ ఉరుసు వేడు కలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఎన్నికల ప్రచా రంలో ఉన్న వివిధ పార్టీల అభ్యర్థులు శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మహా త్ములను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనాచౌదరి పాల్గొన్నారు. పలు జిల్లాల నుంచి వచ్చిన ముస్లింలు బెల్లపు బూందీ, పట్టు వస్త్రాలను సయ్యద్‌కు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో రాత్రి చేశారు. ముస్తాక్ అహ్మద్, సత్తార్ పాల్గొన్నారు.

త్వరితగతిన అమరావతి నిర్మాణం

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ



ఏడో డివిజన్ ఉడ్‌పేటలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేశినేని వెంకట్



10వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న గద్దె అనురాధ

పటమట, ఏప్రిల్ 7: "అమరావతి రాజధాని నిర్వీర్యంతో కళకళలాడే విజయవాడ నగరం ప్రాభవాన్ని కోల్పోతోంది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే అమరావతి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తారు. ప్రజల ఆస్తులను పూర్తిగా తన చేతుల్లో పెట్టుకునేందుకు జగన్మోహన్‌రెడ్డి భూ రక్షణ చట్టం తెచ్చారు. కూటమి ప్రభుత్వ మొచ్చాక భూ రక్షణ చట్టం రద్దు చేస్తాం." అని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ తెలిపారు. ఆదివారం 10వ డివిజన్ కేపీ నగర్‌లో టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్(చిన్ని)లను గెలిపించాలని కోరుతూ ఆమె ప్రచారం చేశారు. జగన్ రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు వెళ్లగొట్టాడని, చంద్రబాబు తన చరిష్మాతో వందలాది పరిశ్రమలు తెచ్చి యువతకు ఉద్యోగాల కల్పన చేస్తారని, సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని ఓటర్లను అనురాధ కోరారు. దేవినేని అపర్ణ, వల్లభనేని మాధవి, గుత్తికొండ సుబ్బారావు, జి.నరేంద్ర, ఎం.శివరామకృష్ణ, డి.సాంబశివరావు, వి.హర్షచంద్రరావు, ఎం.శ్రీనివాసరావు, సీహెచ్ వాసు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం: కేశినేని వెంకట్

మొగల్రాజపురం: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ-జనసేన-బీజేపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) కుమారుడు కేశినేని వెంకట్ అన్నారు. ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఏడో డివిజన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఉడ్‌పేటలో ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు బొప్పన భవకుమార్, గుమ్మడి గురుప్రసాద్, పటమట సతీష్ చంద్ర, లక్ష్మణరావు, సంజయ్ వర్మ, షేక్ కరీముల్లా, జనసేన నాయకుడు అశోక్ పాల్గొన్నారు.

అల్లా ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి: గద్దె రామ్మోహన్

కృష్ణలంక: ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్నారని అల్లా ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి, అందరికీ మంచి జరగాలని టీడీపీ-జనసేన-బీజేపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి గద్దె రామ్మోహన్ ఆకాంక్షించారు. ఆదివారం సాయంత్రం కృష్ణలంక ఉమర్ ఫారూక్ మసీద్‌లో ఇఫ్తార్ విందు కార్యక్రమంలో గద్దె పాల్గొన్నారు. మత పెద్దలతో కలిసి నమాజులో పాల్గొని వారి ఆశీస్సులు తీసుకున్నారు. ముస్లింలతో కాసేపు ముచ్చటించారు. ఉమర్ అలీ, ఎండీ హాజీ, ఎస్.ఫిరోజ్, షేక్ షాబూ, ఎస్కే బబ్బు, ఎస్కే అన్వర్ బాషా(లడ్డూ), ఇబ్రహీం, టీడీపీ నేతలు వేములపల్లి రంగారావు, గొరిపర్తి నామేశ్వరరావు, కేశనం భావన్నారాయణ పాల్గొన్నారు.



కృష్ణలంక హైస్కూల్‌రోడ్డులోని మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న గద్దె రామ్మోహన్



20వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న జనసేన నేత అమ్మిశెట్టి వాసు

గద్దెను గెలిపించుకుందాం.. అవినాశ్ అరాచకాలను అడ్డుకుందాం

● 'తూర్పు' ఓటర్లకు జనసేన నేత అమ్మిశెట్టి వాసు పిలుపు

కృష్ణలంక, ఏప్రిల్ 7: "తూర్పు నియోజకవర్గ ప్రజలు ఎప్పుడూ ప్రశాంతతను కోరుకుంటారు. 2009 నుంచి నియోజకవర్గంలో ఒక్క రాజకీయ దాడి కూడా జరగలేదు. కానీ అవినాశ్ వైసీపీలో చేరిన నాటి నుంచి దాడులు, దౌర్జన్యాలు పెచ్చుమీరాయి. చెన్నుపాటి గాంధీ కన్నును అవినాశ్ పొడిపించారు. పెన్షన్ అడిగినందుకు రాణిగారితోటలోని ముస్లిం మహిళ ఇంటిపై దాడిచేయించి, వారి ఇంటిలో ఒకరి మరణానికి కారణమయ్యారు. తూర్పులో మరోసారి గద్దెను గెలిపించుకుందాం. అవినాశ్ అరాచకాలను అడ్డుకుందాం" అని నియోజకవర్గ ఓటర్లకు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మిశెట్టి వాసు పిలుపునిచ్చారు. ఆదివారం తూర్పు నియోజకవర్గం 20వ డివిజన్‌లో టీడీపీ-జనసేన-బీజేపీ తూర్పు అభ్యర్థి గద్దె రామ్మోహన్, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని)ను గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారాన్ని వాసు నిర్వహించారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్నా, గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉండాలన్నా సౌమ్యుడు, మంచి మనిషి గద్దె రామ్మోహన్‌ను మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని వాసు కోరారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కృష్ణానది రిటైనింగ్ వాల్ మొదటి దశ పనులను గద్దె రామ్మోహన్ పూర్తిచేయించి ఉండకపోతే రిటైనింగ్ వాల్ కరకట్ట వాసులకు కలగానే మిగిలిపోయేదన్నారు. జనసేన నాయకులు కొప్వూరు కిరణ్‌బాబు, జి. జయ, సీఎం శ్రీను, చల్లా గణేష్, బంద్రెడ్డి నాగరాజు, పోలాసి దుర్గారాణి, రంగిశెట్టి పార్వతి, నాని, వటాల హరిప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీకి ఓటేయండి: గద్దె క్రాంతి



మూడో డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న గద్దె క్రాంతి

భారతీనగర్: రాష్ట్ర భవిష్యత్ కోసం వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని గద్దె క్రాంతి అన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని మూడో డివిజన్ బాయన బాజ్జీ రోడ్డులో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కాలనీ పెద్దలతో కలిసి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్(చిన్ని)లకు ఓటేయాలని ఆయన ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. తాడి బాబురావు, గుత్తికొండ మోహనరావు, పేరేపి ఈశ్వర్, మురారి బాలాజీ ప్రసాద్, బండి కోమలి, మారుతీమోహన్ వేగే మౌలంకర్, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోండి

● ప్రజలకు కలెక్టర్ దిల్లీరావు సూచన

● అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశాలు

కృష్ణలంక, ఏప్రిల్ 7: పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నందున వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.దిల్లీరావు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. పంచాయతీరాజ్, మున్సిపల్, గ్రామీణ నీటిసరఫరా, వైద్యారోగ్య శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. చలివేంద్రాలు నిర్వహించాలని, అవసరమైతే అదనంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని, చిన్నారులు, గర్భిణులు, వయోవృద్ధుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు సమన్వయంతో పనిచేస్తూ ఆరోగ్య సేవలందేలా చూడాలని సూచించారు. నీరు, పళ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలని రోజులో కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువసార్లు తీసుకోవాలని సూచించారు. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ ధరించాలని కలెక్టర్ సూచించారు. తలనొప్పి, తలతిరగడం, తీవ్రమైన జ్వరం, మత్తునిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితి వంటివి వడదెబ్బ లక్షణాలని తెలిపారు. వడదెబ్బకు గురైతే ప్రాథమిక చికిత్సగా వ్యక్తిని నీడ ఉండే ప్రదేశానికి చేర్చి చల్లని గాలి తగిలేలా చూడాలని సూచించారు. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణాన్ని తాగించాలని, వడదెబ్బ తగిలి అపస్మారక పరిస్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదని వీలైనంత త్వరగా సమీప ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు.

ఉల్లాసంగా ఇంటర్ స్కూల్స్ తైక్వాండో టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 7: కానూరులోని స్కాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఇంటర్ స్కూల్స్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. పోటీలకు వివిధ స్కూల్స్ నుంచి 400 మంది తలపడ్డారు. ఈ పోటీల్లో స్కాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవగా, నెక్స్‌జెన్ స్కూల్ విద్యార్థులు ద్వితీయస్థానంలో, గ్రీన్ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. మెడల్స్ సాధించిన క్రీడాకారులకు రవీంద్రభారతి స్కూల్స్ చైర్మన్ వి.వంశీకృష్ణ, డైరెక్టర్ వి.శాంతి, సీఈవో హెచ్.జాహ్నవి, ప్రిన్సిపాల్ సీహెచ్ ప్రతిమ,శాప్ కోచ్ పి.గౌరీశంకర్‌లు అభినందించారు.

ఉత్సాహంగా చెస్ జిల్లా పోటీలు

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 7: గ్రీన్ స్కూల్ ఆవరణలో ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీకి విశేష స్పందన లభించింది. బాలుర విభాగంలో 33మంది, బాలికల విభాగంలో 20మంది బరిలో దిగారు. ఐదు రౌండ్ల పోరులో బాలుర విభాగంలో కె.సందీప్(ప్రథమ), ఎం.జితేష్ నాగ్(ద్వితీయ), బాలికల విభాగంలో ఎస్.జాయ్ ప్రశస్త (ప్రథమ), ఎస్.ప్రశస్త జోప్లిన్ (ద్వితీయ)స్థానాల్లో నిలిచారు. విజేతలు ఈ నెల 20, 21న గుడివాడలో జరిగే రాష్ట్ర అండర్-17 బాలబాలికల చాంప్‌నకు కృష్ణా జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ పి.రేణుక తెలిపారు. బహుమతుల ప్రదానోత్సవంలో గ్రీన్ స్కూల్ ప్రిన్సిపల్ జె.సాయి అపర్ణ, కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఎన్ఎం.ఫణికుమార్, చెస్ మేనేజర్, టోర్నీ చీఫ్ ఆర్బిటర్ ఎంఈ సుమన్ రాజు పాల్గొన్నారు.

ఓటర్లకు తాయిలాలు సరఫరా చేస్తే కఠిన చర్యలు

గుణదల, ఏప్రిల్ 7: రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తాయిలాలు సరఫరా చేస్తే చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని సెంట్రల్ జోన్ ఏసీపీ పి.భాస్కరరావు హెచ్చరించారు. పటమట పోలీస్ స్టేషన్ ఆవరణలో పార్శిల్ సర్వీస్ స్టాక్ పాయింట్ యజమానులు, పార్శిల్ సర్వీస్ ట్రక్ యజమానులతో ఆదివారం ఆయన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ పి.భాస్కరరావు మాట్లాడుతూ రాజకీయ నేతలు తమ చేతులకు మట్టి అంటకుండా పార్శిల్ సర్వీస్‌లు నిర్వహించే వారు, సరుకులు సరఫరా చేసే లారీ యజమానులకు డబ్బు ఎరజూపి భారీగా మద్యం, నగదును ఓటర్లకు పంపిణీ చేసేందుకు పలు ఆకర్షణీయమైన వస్తువులు గోడౌన్లకు తరలిస్తుంటారన్నారు. అలా ఎవరైనా తరలించేందుకు వారికి సహకరిస్తే వారిని కూడా ముద్దాయిలుగా చేరుస్తామని హెచ్చరించారు. ముందుగా పోలీసులకు సమాచారం ఇస్తే పేర్లను గోప్యంగా ఉంచి వ్యవహారానికి కారకులైన వారిపైనే చర్యలు తీసుకుంటామన్నారు. పార్శిల్ స్టాక్ పాయింట్లకు మీ ప్రమేయం లేకుండా సరుకు వచ్చినా ముందుగా గుర్తించి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. సాధారణ ఎన్నికలు స్వేచ్ఛా వాతావరణంలో జరపాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పటమట పోలీస్ స్టేషన్ సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐలు శాతకర్ణి, వల్లి పద్మ పాల్గొన్నారు.

పేదల ఇళ్ల పట్టాలపై జగన్ బొమ్మలు సరికాదు

● సీపీఎం నేత సీహెచ్ బాబూరావు



శాంతినగర్‌లో పర్యటిస్తున్న సీహెచ్ బాబూరావు

పాయకాపురం, ఏప్రిల్ 7: పేదల ఇళ్ల పట్టాలపై సీఎం జగన్ బొమ్మలతో నింపేయడం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. 61వ డివిజన్‌లోని శాంతినగర్‌లో ఆదివారం ఆయన పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ముందు పేదలకు ఉచితంగా ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేసి పట్టాలు ఇస్తామన్న హామీని వైసీపీ విస్మరించిందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు అధికంగా నివసిస్తున్న అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారన్నారు. డిస్నీల్యాండ్ స్థలంలో కబేళా ఏర్పాటు చర్యలు విరమించుకోవాలని లేని పక్షంలో భారీ ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

పది మూల్యాంకనం పరిశీలన

వన్‌టౌన్, ఏప్రిల్ 7: బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం తీరును ఆదివారం ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు డి.దేవానందరెడ్డి పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ వితరణగా అందించిన మజ్జిగను ఉపాధ్యాయులకు, సిబ్బందికి ఆయన పంపిణీ చేశారు. నిర్ణీత గడువులోగా ఫలితాలను ప్రకటించేందుకు అన్నీ సిద్ధం చేయాలని ఆయన సూచించారు. సోమవారంతో మూల్యాంకనం ముగియనుంది.

ఎన్నికల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

వన్‌టౌన్, ఏప్రిల్ 7: ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికలకు సంబంధించి ప్రతి ఫిర్యాదుపైనా ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన పరిష్కారం చూపడంలో జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ ఎస్.దిల్లీరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చి నప్పటి నుంచి ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 964 ఫిర్యాదులు వచ్చాయని, అందులో 949 పరిష్కరించా మని, మిగిలిన వాటి పరిష్కారంలోనూ పురోగతి ఉందని కలెక్టర్ తెలిపారు. ఓటర్ హెల్ప్‌లైన్ ద్వారా 124 ఫిర్యాదులు రాగా వాటన్నింటినీ పరిష్కరిం చామని పేర్కొన్నారు. ఎన్‌జీఎస్‌పీ ద్వారా 305 ఫిర్యాదులు రాగా 304, వాట్సాప్ 9154970454 ద్వారా 21 ఫిర్యాదులు రాగా 20, కాల్ సెంటర్ 0866-2570051 ద్వారా వచ్చిన 21 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా 42 ఫిర్యాదులు రాగా 39, సీఈవో మెయిల్స్ ద్వారా 13 ఫిర్యాదులు రాగా 9, సీ-విజిల్ యాప్ ద్వారా 389 ఫిర్యాదులు రాగా అన్నింటిని పరిష్కరించినట్లు తెలిపారు. తిరువూరు నియోజకవర్గానికి సంబంధించి సీ-విజిల్ ద్వారా 50 ఫిర్యాదులు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి 6, సెంట్రల్ నియోజక వర్గానివి 47, తూర్పు నియోజకవర్గానివి 70, మైలవరానివి 18, నందిగామవి 107, జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించి 87, ఇతర పోలింగ్ స్టేషన్‌ల పరిధి నుంచి 4 ఫిర్యాదులు వచ్చినట్లు వివరించారు.

రేపు దశావతారునికి మహా పుష్పయాగం



పెదకాకాని, ఏప్రిల్ 7: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల దశావ తార వేంకటేశ్వరస్వామి దివ్య క్షేత్రంలో ఉగాది పండుగ సందర్భంగా మంగళవా రం మహా పుష్పయాగాన్ని వైభవంగా నిర్వ హిస్తామని ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు తెలిపారు. మహా గణపతికి, మహాలక్ష్మి అమ్మవారికి, దశావతార వేంకటేశ్వరస్వామికి అంతరా లయం నుంచి గర్భాలయంలో మూల మూర్తి వరకు బెంగళూరు నుంచి తెప్పించిన ప్రత్యేక 14 రకాల పూలు ఆరు టన్నుల పుష్పాలతో యాగం చేస్తారని వారు పేర్కొన్నారు. ఏడు కొండలను ప్రత్యేకంగా అలంక రించి, ప్రతి కొండకు 14 రకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేయిస్తున్నా మని, మంగళవారం ఉదయం 5 గంటల నుంచి పుష్పయాగం ప్రారంభ మవుతుందని, 8 గంట లకు మహా మంగళ హారతి ఇస్తారని, సాయంత్రం 6:30 గంటలకు మంగిపూడి వేంకట శాస్త్రితో పంచాంగశ్రవణం నిర్వహిస్తారని, రాత్రి 9గంటల వరకు దేవాల యం తెరిచి ఉంటుందని, వారు పేర్కొన్నారు. పుష్పయాగ మహోత్స వంలో అందరూ పాల్గొని స్వామికి వివిధ రకాల పుష్పాలు 2కేజీల నుంచి 10 కేజీల వరకు సమర్పించవచ్చని వారు పేర్కొన్నారు.

దిక్సూచి DIKSUCHI

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఫోన్ ట్యాపింగ్

చట్టం ఏమి చెబుతోందంటే...



చట్టాలను రూపొందించేటప్పుడు, కొన్ని ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాటికి మినహాయింపులూ ఇస్తుండటం పరిపాటి. అయితే అలాంటి మినహాయింపులు ఆ చట్టానికి లొసుగులుగా పరిణమించినప్పుడు దిద్దుబాటు చర్యలు అనివార్యమవుతాయి. ఇటీవలికాలంలో వెలుగుచూస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలు ప్రధానంగా దిద్దుబాటు చర్యల ఆవసరాన్ని తెలుపుతున్నాయి.

చట్టాలను రూపొందించేటప్పుడు, కొన్ని ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాటికి మినహాయింపులూ ఇస్తుండటం పరిపాటి. అయితే అలాంటి మినహాయింపులు ఆ చట్టానికి లొసుగులుగా పరిణమించినప్పుడు దిద్దుబాటు చర్యలు అనివార్యమవుతాయి. ఇటీవలికాలంలో వెలుగుచూస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలు ప్రధానంగా దిద్దుబాటు చర్యల ఆవసరాన్ని తెలుపుతున్నాయి.

ఫోన్ ట్యాపింగ్ అంటే ఒక వ్యక్తికి తెలియకుండా వారి సంభాషణలను వినేవిధంగా ఎవరైనా ఆ ఫోన్‌ను సాంకేతికంగా తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం. అయితే ఫోన్‌లో సంభాషించేటప్పుడు వ్యక్తులు స్వేచ్ఛగా తమ భావాలను, వ్యక్తిగత విషయాలను, రహస్యాలను చర్చించే అవకాశం ఉంది. ఈ భావప్రకటన స్వేచ్ఛకు, గోప్యత హక్కుకు ఫోన్ ట్యాపింగ్ చర్యలు భంగం కలిగిస్తాయి. ఇది రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులైన ప్రకరణ 19(భావ ప్రకటన స్వేచ్ఛ), ప్రకరణ 21(జీవించే స్వేచ్ఛలో అంతర్భాగంగా ఉన్న గోప్యత హక్కు)లను ఉల్లంఘిస్తోంది.

ఇదే విషయాన్ని 'పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్' వర్సెస్ 'యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఉద్ఘాటించింది. టెలిఫోన్ సంభాషణలు గోప్యత హక్కుల కిందకు వస్తాయని అలాంటి హక్కును చట్టం నిర్ధారించిన పద్ధతిలో వినహా, ఇతరత్రా ఉల్లంఘించడం కిందికే వస్తుందని పేర్కొంది.

అయితే భారత రాజ్యాంగ ప్రకరణ 19(2)లో భావప్రకటన స్వేచ్ఛపై పరిమితులను పేర్కొన్నారు. ప్రజాసంక్షేమం, శాంతిభద్రతల దృష్ట్యా ఒక వ్యక్తి భావప్రకటన స్వేచ్ఛపై ప్రభుత్వం సహేతుక పరిమితులు విధించే సౌలభ్యాన్ని అందించింది. ఈ నిబంధనను అనుసరిస్తూ 'ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం 1885' సెక్షన్ 5(2) ప్రకారం ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో, ప్రజాభద్రత, భారతదేశ సార్వభౌమాధికారం, సమగ్రత, రాష్ట్రాల శాంతి భద్రతలు, విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలు దెబ్బతినే అవకాశాలున్నప్పుడు, నేరం చేయడానికి ప్రేరేపించడం వంటి వాటిని నిరోధించడానికి ఫోన్ ట్యాపింగ్ చేసే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దఖలుపడ్డాయి.

అయితే 'ఇండియన్ టెలిగ్రాఫ్(సవరణ) రూల్స్ 2007'లోని రూల్ 419ఏ ద్వారా ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతినిచ్చే అధికారిక హోదాల గురించి స్పష్టంగా పేర్కొంది. కేంద్ర, రాష్ట్రాల స్థాయుల్లో ఎవరెవరికి అధికారం ఉంటుందో చర్చించింది. రాష్ట్రస్థాయిల్లో ఆ రాష్ట్రాల్లో ఫోన్ ట్యాప్ చేసే అధికారం పోలీసులకు ఉంటుంది. రాష్ట్రప్రభుత్వ కార్యదర్శి(ఇన్‌చార్జ్ ఆఫ్ హోమ్ డిపార్ట్‌మెంట్) నుంచి ఉత్తర్వులు పొందాల్సి ఉంటుంది.

కేంద్రప్రభుత్వ స్థాయిలో ఫోన్ ట్యాపింగ్‌కు పది సంస్థలకు అనుమతి ఉంది.

1) ఇంటెలిజెన్స్ బ్యూరో
2) సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్
3) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
4) నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో
5) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్
6) డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్
7) నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ
8) రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్
9) డైరెక్టరేట్ ఆఫ్ సిగ్నల్
10) ఢిల్లీ పోలీస్ కమిషనర్.

కేంద్రప్రభుత్వ స్థాయిలో ఫోన్ ట్యాపింగ్‌కు ఉత్తర్వులు జారీచేసే అధికారం మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్‌కు చెందిన భారత ప్రభుత్వ కార్యదర్శికి ఉంటుంది. అయితే అత్యవసర పరిస్థితుల్లో, కేంద్రస్థాయిలో జాయింట్ సెక్రటరీ స్థాయి కంటే తక్కువ కానీ హోదా గల అధికారి (కేంద్ర హోం కార్యదర్శి ఆథరైజ్ చేసినవారు) ఉత్తర్వులు ఇవ్వవచ్చు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో అత్యవసర పరిస్థితుల్లో రాష్ట్ర హోం సెక్రెటరీ ఆథరైజ్ చేసిన అధికారి ఉత్తర్వులివ్వవచ్చు.

ఒక్కోసారి ముందస్తు ఆదేశాలు పొందడం సాధ్యం కాని పరిస్థితులు లేదా మారుమూల ప్రాంతాల్లో నిఘా పెట్టాల్సిన సందర్భాల్లో కేంద్ర స్థాయిలో అయితే ఫోన్ ట్యాపింగ్ అనుమతి గల పది అధీకృత సంస్థలకు చెందిన అధిపతులు లేదా వారి తరువాత గల రెండో అత్యంత సీనియర్ అధికారి ముందస్తు అనుమతితో ఫోన్ ట్యాప్ చేయవచ్చు. అదే రాష్ట్రస్థాయిలో అయితే ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు స్థాయి కంటే తక్కువ హోదా కాకుండా ఉన్న అధీకృత అధికారుల నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. అయితే ఈ అనుమతుల గురించి అత్యున్నత అధికారికి మూడురోజుల లోపు తెలియచేయాలి. ఏడు పని దినాల్లోగా సదరు అధికారి దానిని ఆమోదించ వచ్చు లేదా తిరస్కరించనూ వచ్చు. నిర్ణీత గడువు లోపు ఈ ఆమోదం పొందని పక్షంలో ఫోన్ ట్యాపింగ్ నిలిపివేయాలి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఈ టెలిఫోన్ ట్యాపింగ్ దుర్వినియోగం కాకుండా ఈ చట్టం కొన్ని పరిమితులను విధించింది.

1. సమాచారం పొందేందుకు వేరే మార్గం లేకుంటే మాత్రమే టెలిఫోన్ ట్యాపింగ్ ఉత్తర్వులివ్వాలి.
2. ట్యాపింగ్ ఆదేశాలు ముందుగా ఉపసంహరించుకోని పక్షంలో అరవై రోజులు అమలులో ఉంటాయి. వీటిని పునరుద్ధరించవచ్చు. అయితే మొత్తంగా 180 రోజులకు మించి ఇవి అమలుకావు.
3. అధీకృత అధికారి జారీచేసే ట్యాపింగ్ ఆదేశాలపై ట్యాపింగ్‌కు గల కారణాలను తప్పనిసరిగా పేర్కొనాలి. అదేవిధంగా ఏడు పని దినాల్లోగా ఒక కాపీని సమీక్ష కమిటీకి నివేదించాలి.
4. కేంద్రంలో కేబినెట్ సెక్రటరీ నేతృత్వంలో న్యాయ శాఖ, టెలికాం శాఖ కార్యదర్శులు సభ్యులుగా సమీక్ష కమిటీ ఏర్పడగా రాష్ట్రస్థాయిలో రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో లా, హోం సెక్రటరీలు సభ్యులుగా సమీక్ష కమిటీ పనిచేస్తుంది. టెలిఫోన్ ట్యాపింగ్ అభ్యర్థనలను సమీక్షించడానికి ఈ కమిటీలు కనీసం రెండు నెలలకు ఒక్కసారైనా సమావేశం కావాల్సి ఉంటుంది.
5. ఫోన్ ట్యాపింగ్ రికార్డులు ఏదైనా సాక్ష్యాధారాలకు అవసరం అయితే తప్ప ఆరు నెలలకుమించి నిలువ చేయరు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇలాంటి రికార్డులను ధ్వంసం చేస్తారు.
6. ట్యాపింగ్‌కు సాంకేతిక సహకారం అందించే టెలిఫోన్ సర్వీసు ప్రొవైడర్లు సైతం ఇలాంటి ట్యాపింగ్ వ్యవహారం ముగిసిన వెంటనే రెండు నెలల లోపు సదరు ట్యాపింగ్ రికార్డులను ధ్వంసం చేయాల్సి ఉంటుంది.
7. పత్రికాస్వేచ్ఛ రీత్యా పాత్రికేయుల ఫోన్ ట్యాపింగ్‌పై కఠిన ఆంక్షలున్నాయి.

అయితే చట్ట ప్రకారం ఇన్ని నియమ నిబంధనలు ఉన్నప్పటికీ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ రాజకీయ ఒత్తిడికి లోబడి అధీకృత సంస్థలు/ అధికారులు అక్రమంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడటం వంటి వ్యవహారాలు ఇటీవల వెలుగులోకి రావడంతో ఫోన్ ట్యాపింగ్‌పరంగా నియమ నిబంధనలు మరింత కఠినం చేస్తూ చట్టసవరణ చేయాల్సిన అవసరం గోచరిస్తోంది. అదేవిధంగా ప్రాథమిక హక్కులకు ముడిపడి ఉన్న అంశమైనందున ఫోన్ ట్యాపింగ్ అనుమతి, తదనంతర సమీక్ష నిర్వహించే యంత్రాంగాల్లో న్యాయవ్యవస్థ ఉనికి, ప్రమేయం వాంఛనీయమని, ఆ దిశగా చట్ట సవరణలు ఉండాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. అంతేకాక ఈ అధికారాలను అక్రమాలకు, అవినీతికి, రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకున్న వారికి కఠిన శిక్షలు ఉన్నప్పుడే అక్రమ ఫోన్ ట్యాపింగ్‌ను నియంత్రించవచ్చని కూడా వారు అభిప్రాయపడుతున్నారు.

కోడింగ్ - డీకోడింగ్


రీజనింగ్

పార్ట్-3

కోడింగ్ - డీ కోడింగ్ చాప్టర్‌లో ఇప్పటి వరకు ఒక పదంలోని అక్షరాలు, మరొక అక్షరాలుగా మారే విధానంలో పలు పద్ధతులను తెలుసుకున్నారు. ఇప్పుడు నెంబర్ కోడింగ్‌ని పరిశీలిద్దాం.

నెంబర్ కోడింగ్‌లో ఒక పదానికి కోడ్‌గా సంఖ్యను ఇస్తారు. పదంలోని అక్షరాలకు సవ్యదిశ లేదా అపసవ్యదిశలో సంఖ్యలను విడివిడిగా రాయడం, ఆ సంఖ్యలను కూడి మొత్తం విలువగా చూపడం, గుణించడం, రెట్టింపు చేయడం, వర్గంగా తెలపడం, తిప్పి రాయడం వంటి అంశాలను పరిశీలించాలి.

నెంబర్ కోడింగ్ ప్రశ్నలకు సంబంధించి ఆలోచించే విధానంపై అవగాహన కోసం కింద ఇచ్చిన సూర్యకిరణాల డయాగ్రామ్‌ను పరిశీలించండి.



గమనించండి: పై డయాగ్రమ్‌లో BAG అనే పదాన్ని 14 రకాలుగా కోడింగ్ చేశారు. దాని వివరణలను 1 నుంచి 14 వరకు ఇప్పుడు పరిశీలిద్దాం.

1. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం సంఖ్యలు 2, 1, 7
2. BAG అనే పదానికి అపసవ్య దిశ వర్ణమాల(రివర్స్ ఆర్డర్) ప్రకారం సంఖ్యలు 26, 25, 20.
3. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలకు ఒక్కొక్క దానికి 4 కూడగా వచ్చాయి.
(B అంటే 2+4=6, A అంటే 1+4=5, G అంటే 7+4=11 ఇక్కడ గమనించాల్సిన విషయం '4' అనే సంఖ్యనే కూడాలని ఏమిలేదు. ఏదో ఒక స్థిర సంఖ్యను పదంలోని అక్షరాలకు గల సంఖ్యలకు కూడవచ్చు)
4. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 1, 7ల వర్గాలు(స్క్వేర్స్) 4, 1, 49.
5. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 1, 7లను కూడగా 2+1+7=10.
6. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 1, 7 లను కూడగా 2+1+7=10 కి రెట్టింపు 20.
7. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 1, 7లను కూడగా 2+1+7=10 కి వర్గం 100.
8. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను గుణించగా అంటే లబ్ధం 2 x 1 x 7 = 14
9. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యల విడివిడి వర్గములను కూడగా అంటే $2^2+1^2+7^2=4+1+49=54$.
10. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 2+1+7=10 దీని నుంచి 3 తగ్గించగా 10-3=7, (ఇక్కడ మూడు తగ్గించడానికి కారణం ఆ పదంలో '3' అక్షరాలు ఉన్నాయి)
11. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 2+1+7=10. దీనికి 3 కూడగా 10+3=13 (ఇక్కడ మూడు కూడటానికి కారణం ఆ పదంలో '3' అక్షరాలు ఉన్నాయి).
12. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 2+1+7=10. దీనిని 3తో గుణించగా 10 x 3 = 30 (ఇక్కడ 3తో గుణించడానికి కారణం ఆ పదంలో '3' అక్షరాలు ఉన్నాయి).
13. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 2+1+7=10. దీనిని తిప్పి రాయగా 01.
14. BAG అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల అపసవ్య దిశ(రివర్స్ ఆర్డర్) ప్రకారం సంఖ్యలు 25, 26, 20 వీటిని కూడగా 25+26+20=71. ఈ విధంగా ఒక పదానికి ఎన్ని రకాలుగానైనా కోడ్ సంఖ్యలను తెలుపవచ్చు. అందువల్ల దీనిపై మీరు పట్టు సాధించాలంటే వర్ణమాల సవ్యదిశ, అపసవ్యదిశ అక్షరాలకు గల సంఖ్యలపై పూర్తి అవగాహన కచ్చితంగా ఉండి తీరాల్సిందే.

ఇప్పుడు కొన్ని ప్రశ్నలను పరిశీలిద్దాం.

1. ఒక కోడ్ భాషలో 'HUMAN'ను 82113114గా రాశారు. అదే కోడ్ భాషలో 'STAND' ను ఏ విధంగా రాస్తారు?
ఎ) 19201243 బి) 19201144 సి) 19211243 డి) ఏదీకాదు

సమాధానం (బి)

వివరణ: వర్ణమాల ప్రకారం H అంటే 8వ అక్షరం, U అంటే 21వ అక్షరం, M అంటే 13వ అక్షరం, A అంటే 1వ అక్షరం. N అంటే 14వ అక్షరం. ఈ సంఖ్యలను పక్కపక్క రాస్తే 82113114. ఇదే విధంగా పదం 'STAND' లో వర్ణమాల ప్రకారం S అంటే 19వ అక్షరం, T అంటే 20వ అక్షరం, A అంటే 1వ అక్షరం, N అంటే 14వ అక్షరం, D అంటే 4వ అక్షరం. ఈ సంఖ్యలను పక్కపక్క రాయాలి. కాబట్టి సమాధానం 19201144 అవుతుంది.

2. ఒక కోడ్ భాషలో HEART 4 ART=3 అయితే అదే కోడ్ భాషలో PHONE 4 ONEను ఏ విధంగా రాస్తారు?
ఎ) 8 బి) 12 సి) 10 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: గుర్తు '4' కు ఇరువైపుల గల ARTని తొలగిస్తే చేసిన H, E ఉంటాయి. వర్ణమాల ప్రకారం H అంటే 8వ అక్షరం వర్ణమాల ప్రకారం E అంటే 5వ అక్షరం ఇప్పుడు పెద్ద సంఖ్య నుంచి చిన్న సంఖ్య తీసివేస్తే 8-5=3 అవుతుంది. అదే విధంగా PHONE 4 ONEలో గుర్తు '4'కు ఇరువైపుల ONEని తొలగిస్తే P, H ఉంటాయి. వర్ణమాల ప్రకారం P అంటే 16వ అక్షరం, H 8వ అక్షరం. ఇప్పుడు పెద్ద సంఖ్య నుంచి చిన్న సంఖ్య తీసివేస్తే 16-8=8 సమాధానం అవుతుంది.



3.ఒక కోడ్ భాషలో RUNను $B_9C_7B_7$ గా రాశారు. అదే కోడ్ భాషలో NILను ఏ విధంగా రాస్తారు?
ఎ) $B_7C_3B_6$ బి) $B_6C_3B_7$
సి) $C_3B_6B_7$ డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: RUN అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 18, 21, 14. అతి తక్కువ ప్రధాన సంఖ్యను ప్రాధాన్యంలోకి తీసుకోవాలి. అంటే 18 అనేది అతి తక్కువ ప్రధాన సంఖ్య 2తో భాగించవచ్చు. అందుకని B అక్షరాన్ని తీసుకున్నాం. ఎన్ని రెండ్లు 18. 9 రెండ్లు కావున B_9. అదే విధంగా 21ని అతి తక్కువ ప్రధాన సంఖ్య 3తో భాగించవచ్చు. అందుకని 3వ అక్షరం C ని తీసుకున్నాం. 3 x 7 = 21 కావున 'C_7' అదే విధంగా N అంటే 14వ అక్షరం, అతి తక్కువ ప్రధాన సంఖ్య 2తో భాగించవచ్చు. అందువల్ల B అక్షరాన్ని తీసుకున్నాం. 2 x 7 = 14 అందువల్ల B_7 అంటే RUN - $B_9\ C_7\ B_7$ ఇదే విధంగా NIL అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 14, 9, 12. వీటిని వరుసగా అతి తక్కువ ప్రధాన సంఖ్యలైతే 2, 3, 2తో భాగించవచ్చు. కాబట్టి BCB అక్షరాలను తీసుకోవాలి. 2x7=14 కాబట్టి B_7. 3x3=9 కాబట్టి C_3, 2x6=12 కాబట్టి B_6. సమాధానం $B_7\ C_3\ B_6$



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్, సీనియర్ ఫ్యాకల్టీ



కైలాస వాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

కైలాస వాహనంపై శ్రీశైలేశుడి వైభవం

- మహాదుర్గగా దర్శనమిచ్చిన అమ్మవారు

శ్రీశైలం, ఏప్రిల్ 7: ఇల కైలాసంగా వెలుగొందుతున్న శ్రీశైలం క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు కైలాస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శమిచ్చాడు. మహాదుర్గ అలంకారంలో భ్రమరాంబికా దేవి అమ్మవారు దర్శనమిచ్చారు. ఉగాది మహోత్సవాల్లో మూడో రోజు సోమవారం మల్లన్న ప్రభోత్సవం వైభవంగా నిర్వహించ నున్నారు. రాత్రి స్వామిఅమ్మవార్లకు నంది వాహన సేవ జరపనున్నారు. మహా సరస్వతి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు.

బాబోయ్ ఎండలు..!



- 45 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రతలు
- కలిగిరి, చాగలమర్రిలో 45.8 డిగ్రీలు
- మరికొన్ని రోజులు వడగాడ్పుల తీవ్రత

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ పెరుగుతున్న ఎండలకు తోడు వడగాడ్పులు వీయడంతో రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారింది. దక్షిణాదిలో ఏపీ, తెలంగాణ, ఉత్తర కర్ణాటక, దానికి ఆనుకుని విదర్భ, మరట్వాడ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని అనేక ప్రాంతాలు అగ్ని గుండాన్ని తలపించాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నెలకొన్న ఎండ ప్రభావంతో రాత్రి వాతావరణం వేడిగా కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతల్లో కొత్తరికార్డులు నమోదయ్యాయి. ఆదివారం నంద్యాల జిల్లా చాగలమర్రి, నెల్లూరు జిల్లా కలిగిరిలో 45.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కడప జిల్లా ఖాజీపేట, సింహాద్రిపురంలో 45.6, బాపట్ల జిల్లా జే పంగులూరులో 45.5, కర్నూలు జిల్లా ఆలూరు, ప్రకాశం జిల్లా బొట్లగూడూరులో 45.4, పల్నాడు జిల్లా విజయపురిలో 45.2 డిగ్రీలు నమోదైనట్టు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్రంలోని 107 మండలాల్లో తీవ్ర గాడ్పులు, 235 మండలాల్లో వడగాడ్పులు వీచాయని, రానున్న రెండురోజులు కూడా వడగాడ్పులు కొనసాగుతాయని హెచ్చరించింది. ఒడిశా నుంచి ఛత్తీస్‌గఢ్, విదర్భ, కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు ద్రోణి విస్తరించిందని, దీని ప్రభావంతో సోమవారం కోస్తాలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

వైద్యుల రక్షణకు చట్టం రూపొందించాలి

- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయచంద్రనాయుడు

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 7: వైద్యులకు రక్షణ చట్టాన్ని తీసుకుని రావాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.జయచంద్రనాయుడు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయిలో రూపొందించిన హెల్త్ మేనిఫెస్టోను ఆదివారం సాయంత్రం కర్నూలు ఐఎంఏ భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. కేంద్ర రాష్ట్రాల్లో సగటున ఆరోగ్యానికి జీడీపీలో 1.1 నుంచి 1.6 శాతం బడ్జెట్‌ను పారిశుధ్యం, తాగు నీరు కలుపుకొని కేటాయిస్తున్నారన్నారు. ఈ బడ్జెట్‌లో ప్రత్యేకంగా వైద్య ఆరోగ్యానికి 2.5 శాతానికి పెంచాలని, మొత్తంగా 5.5 శాతానికి పెంచాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వైద్యులపై దాడులను నిరోధించే విధంగా సమగ్ర చట్టాన్ని చేసి వైద్యులను, ఆసుపత్రులను కాపాడాలని కోరారు.

ఉగాదికి ఉసూరు!

- నిరుడంతా కరువు, తుఫాన్ దెబ్బ
- అన్నదాతకు అందని విపత్తు సాయం
- పంటల బీమా సొమ్ము ఇప్పట్లో ఇవ్వరట
- కొత్త ప్రభుత్వంలోనే రైతుకు సొమ్ములు?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



నూతన సంవత్సరాది 'ఉగాది'కి రైతు కుటుంబాలు కళకళ లాడుతూ ఉంటాయి. ఖరీఫ్ దిగుబడులపై వచ్చిన సొమ్ముతో వేసిన రబీ పంటలు అమ్ముకుని, బాకీలు తీర్చుకుని, మిగిలిన డబ్బుతో శుభకార్యాలు వంటివి జరుపుకొంటారు. ఉగాది నాడు కొత్త పంచాంగం ప్రకారం మళ్లీ తొలకరిలో ఏ పంటలు సాగుకు అనుకూలమో పండితుల ద్వారా తెలుసుకుని, నైరుతి రుతుపవనాలు వచ్చాక ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతారు. కానీ, ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. అత్యధిక శాతం రైతులు-కూలీల కుటుంబాల్లో దైన్యం అలుముకుంది. ఉగాది నాడూ ఉసూరుమనే పరిస్థితి. కారణం.. నిరుడంతా కరువు, పైగా తుఫాన్ దెబ్బకు రాష్ట్ర రైతాంగం అన్ని విధాలా నష్టపోయింది. గత ఏడాదంతా తీవ్ర వర్షాభావం వెంటాడింది. లక్షలాది ఎకరాల్లో విత్తనమే వేయలేని పరిస్థితి. వేసిన పంటకు పెట్టుబడులు పెరిగాయి. ఖరీఫ్ పంట కోసి, రబీ సాగు మొదలైన తరుణంలో వచ్చిన విచౌంగ్ తుఫాన్ డిసెంబరులో రెండు పంటల్నీ దెబ్బతీసింది. కరువు, తుఫాన్ ఫలితంగా దిగుబడులు గణనీయంగా తగ్గాయి. గత ఖరీఫ్‌లో 90లక్షల ఎకరాలకుగాను 62.5 లక్షల ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలేశారు. 27.5 లక్షల ఎకరాల్లో విత్తనమే పడలేదు. రబీలో 57.5 లక్షల ఎకరాలకుగాను 42 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. 15.5 లక్షల ఎకరాలు బీడుగా మారాయి. రెండు సీజన్లలో 43 లక్షల ఎకరాలు వ్యవసాయ పంటలకు నోచుకోలేదు. ఫలితంగా వేల టన్నుల్లో పంట ఉత్పత్తులు తగ్గాయి. వేసిన పంటలకూ దిగుబడులు ఆశాజనకంగా రాలేదు. ఖరీఫ్‌లో 448 మండలాల్లో తీవ్ర వర్షాభావం ఏర్పడితే, జగన్ సర్కార్ తొలుత 103 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించింది. రబీ సీజన్ ముగిశాక.. గత నెల 16న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కొద్ది క్షణాల ముందు కంటితుడుపుగా మరో 87 కరువు మండలాలను ప్రకటించారు. కరువు, తుఫాన్ నష్టానికి రూ.1,294 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేస్తున్నట్లు చెప్పి, గత నెల ఆరో తేదీనే సీఎం జగన్ ఆర్భాటంగా బటన్ నొక్కారు. ఖజానాలో నిధులు లేకుండానే బటన్ నొక్కడంతో ఆ డబ్బులు ఖాతాల్లో ఎప్పుడు పడతాయా అని 11.59 లక్షల మంది రైతులు ఎదురు చూస్తున్నారు. ఫిబ్రవరిలో సీఎం జగన్ విడుదల చేసిన రైతుభరోసా, సున్నావడ్డీ రాయితీ సొమ్ము కూడా ఇప్పటకీ కొంత మంది ఖాతాల్లో జమ కాలేదని చెప్తున్నారు. నిరుడు కరువు, తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు పంటల బీమా పరిహారం ఈ ఏడాది జూన్‌లో వస్తుందని చెప్తున్నారు. వాస్తవంగా 2022-23 రబీ, 2023-24 ఖరీఫ్-రబీ సీజన్లకు కలిపి దాదాపు రూ.3వేల కోట్లకుపైగా పంటల బీమా సొమ్ము రైతులకు అందాల్సి ఉంది. కష్టనష్టాల్లో ఉన్న రైతులకు చాలీచాలకుండా ఇచ్చే ప్రభుత్వ సాయం కూడా సకాలంలో అందక వేలాది మంది రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ జూన్ 4 వరకు కొనసాగనుండగా, ఈలోపు రైతులకు సర్కార్ సాయం అందే పరిస్థితి కనిపించడం లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే చెల్లింపులు జరుగుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అప్పటి దాకా రైతులు ఎదురుచూడక తప్పదని ఆ వర్గాలు చెబుతున్నాయి.

ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలు

- ఇద్దరు మృతి, నలుగురికి తీవ్ర అస్వస్థత.. మరో ముగ్గురికి స్వల్ప గాయాలు

పరవాడ(అనకాపల్లి జిల్లా), ఏప్రిల్ 7: అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని విశాఖ ఫార్మాసిటీలో శనివారం అర్ధరాత్రి, ఆదివారం తెల్లవారుజామున వేర్వేరు ఫార్మా పరిశ్రమల్లో సంభవించిన ప్రమాదాల్లో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. నలుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆల్కలీ మెటల్స్ లిమిటెడ్ యూనిట్-3 పరిశ్రమలో ఆదివారం తెల్లవారుజామున నాలుగున్నర గంటల ప్రాంతంలో ప్రొడక్ట్ బ్లాక్‌లోని జీజీ-2 ట్యాంక్ పైపులైన్ వద్ద మిథైల్ నైట్రేట్ గ్యాస్ లీకైంది. ఈ ఘటనలో విధుల్లో ఉన్న సీహెచ్ రమణ (32) విపరీతంగా గ్యాస్ పీల్చి అక్కడే కుప్పకూలిపోయాడు. గ్యాస్ వాసన రావడంతో పై ఫ్లోర్‌లో పనిచేస్తున్న కార్మికులు కిందకు వచ్చి చూసేసరికి అపస్మారకస్థితిలో ఉన్న రమణను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కిందకు వచ్చిన నలుగురు కార్మికులు ఎ.శ్రీనివాసరావు, వై.గోపాల్, వి.అప్పారావు, బి.రవీంద్ర తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారికి అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖలోని మరో ఆస్పత్రికి తరలించారు. కాగా.. అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-6 పరిశ్రమలో శనివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. మరో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఇక్కడి వీటీడీ డ్రయర్ రూమ్‌లో ఫిట్టర్‌గా పనిచేస్తున్న ఆళ్ల గోవింద (32) డ్రయర్ రూమ్ బోల్టు బిగించే క్రమంలో ఒక్కసారిగా డోర్ తెరచుకుంది. దీంతో లోపల ఉన్న విథైల్ నైట్రేట్ గ్యాస్ బయటకు రావడంతో దానిని పీల్చి కుప్పకూలిపోయాడు. డ్రయర్ రూమ్ డోర్ ఓపెన్ అయినప్పుడు వచ్చిన శబ్దానికి సమీపంలో ఉన్న కిటికీ అద్దం పగిలి గాజు ముక్కలు అక్కడపనిచేస్తున్న సూపర్‌వైజర్ బి.నరేంద్ర కంటికి తగలడంతో గాయపడ్డాడు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.బాబ్జి, మరో ఫిట్టర్ బి.గోవింద స్వల్పగాయాలతో బయటపడ్డారు. గోవిందను తొలుత అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందాడు. కాగా ప్రమాదాలు సంభవించిన పరిశ్రమలను అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, పరిశ్రమల అధికారి చిన్నారావు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ శాంతిభూషణ్, సీఐ బాలసూర్యారావు పరిశీలించారు.

జగన్‌రెడ్డి నంబర్ వన్ మోసగాడు

- 3 రాజధానులు కావాలని దీక్ష చేసి మోస పోయాం
- అమరావతి రైతులకు అండగా ఉంటాం
- మంగళగిరి, తాడికొండలో టీడీపీకి లక్ష ఓట్ల మెజార్టీ తీసుకొస్తాం
- మూతేసిన మూడు రాజధానుల శిబిరం నిర్వాహకుడు గురునాథం



అమరావతి రైతులకు నమస్కరించి క్షమాపణ అడుగుతున్న గురునాథం

తుళ్లూరు, ఏప్రిల్ 7: సీఎం జగన్‌రెడ్డి మోసం చేయడంలో నంబర్ వన్ అని మూతేసిన మూడు రాజధానుల శిబిరం నిర్వాహకుడు, దళిత బహుజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం అన్నారు. ఆదివారం తుళ్లూరు వచ్చి రాజధాని అమరావతి రైతులను ఆయన క్షమాపణ కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'మూడు రాజధానులు కావాలని 35 గంటలు దీక్ష కూడా చేశా. అప్పట్లో టీడీపీకి మెజార్టీ ఉన్న శాసన మండలికి మూడు రాజధానుల బిల్లు పంపటంలో సీఎం జగన్‌రెడ్డి వంచనను తెలుసుకున్నాం. బయటకు రావడానికి ఇంత సమయం పట్టింది. ఎటువంటి పరిస్థితిల్లోనూ మూడు రాజధానులు ఉండవని, అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని అని ఇప్పుడు తెలుసుకున్నాం. దీక్షలు చేసి మేము మోసపోయాం. అమరావతికి భూములిచ్చి జగన్ ఆడుతున్న మూడు ముక్కలాటతో మీరు మోసపోయారు. అమరావతి రైతులకు ప్రతి క్షణం అండగా ఉంటాం. మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాలలో ఉమ్మడి టీడీపీ అభ్యర్థులకు లక్ష ఓట్ల మెజార్టీ తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం. లోకేశ్ అమరావతి రైతులను కలసి క్షమాపణ అడగమని చెప్పారు. వెంటనే మిమ్మల్ని కలవడానికి వచ్చా' అని గురునాథం వివరించారు.

టీడీపీ నాయకుడి ఎర్రచందనం చెట్ల నరికివేత



ముకుందనాయుడు తోటలో ఎర్రచందనం చెట్లను నరికేసిన దృశ్యం

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 7: శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, రైతు ముకుందనాయుడి తోటలో 50 ఎర్రచందనం చెట్లను గుర్తుతెలియని దుండగులు నరికేశారు. నాయుడు తన పొలంలో ఐదేళ్ల క్రితం 100 ఎర్రచందనం చెట్లు సాగు చేశాడు. దుండగులు అందులోని 50 చెట్లను నరికేశారు. రైతు ఆదివారం ఉదయం పొలానికెళ్లి చెట్లను నరికేసిన విషయాన్ని గుర్తించాడు. దీనిపై కనగానపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుండడంతో వైసీపీ నాయకులు కక్షపెంచుకున్నారని రైతు వాపోయాడు. తనను రాజకీయంగా, ఆర్థికంగా దెబ్బతీసేందుకు రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ప్రోద్బలంతో స్థానిక వైసీపీ నాయకులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు ఆరోపించారు. ఇలాంటి బెదిరింపులకు బెదిరేదే లేదనీ, చెట్లను నరికేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.

రాయలసీమను 'రాయల్'సీమగా చేశాం

- జగత్‌కంత్రీ... మహాకంత్రీ... ఈ సీఎం: ఎమ్మెల్యే బాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం, ఏప్రిల్ 7: 'ఒకప్పుడు రాయలసీమగా ఉన్న ప్రాంతాన్ని తెలుగుదేశం వచ్చాక రాయల్ సీమగా మార్చాం. వైసీపీ అధికారం చేపట్టాక రక్తపు మరకల సీమగా మార్చింది' అని సినీనటుడు, శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ 'రాయలసీమ ఒకప్పుడు ఫ్యాక్షన్‌కు పెట్టింది పేరు. అలాంటి ఫ్యాక్షన్‌ను రూపుమాపి, బీటలువారిన భూములను సస్యశ్యామలం చేసి ఈ ప్రాంత రైతులను రాయల్‌గా చేసిన ఘనత టీడీపీ అధినేత చంద్రబాబుదే. సీఎం జగన్ మడమ తిప్పనని చెప్పి ఏకంగా మెడలు వంచేశారు. మద్యం ఏరులై పారుతోంది. పరిపాలన అస్తవ్యస్తంగా మారి వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. ఈ దుర్మార్గపు పాలనను అంతమొందించాలి. సీఎం ఆడపిల్లల ఉసురు పోసుకుంటున్నారు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ... జగన్ అందరికీ ద్రోహం చేశారు. నా అక్క చెల్లెమ్మలంటూ సొంత చెల్లెలుకే మోసం చేసిన నీచుడు జగన్. ఇలాంటి ముఖ్యమంత్రి మరోసారి వస్తే రాష్ట్ర ప్రజలు ఉండాల్సిన పనిలేదు. ఈ రాక్షస పాలనకు త్వరలోనే చరమగీతం పాడేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. అనుభవం గల చంద్రబాబుకు దన్నుగా నిలవాలి' అని బాలకృష్ణ కోరారు.

విద్యార్థి ప్రాణం తీసిన క్రికెట్ బెట్టింగ్

- చదువుకోవాలని తల్లి మందలించడంతో ఆత్మహత్య

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 7: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ఓ విద్యార్థి ప్రాణాన్ని బలిగొంది. చదువుకోవాలని తల్లి మందలించడంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఒంగోలులోని కొత్తపట్నం ఫ్లైఓవర్ సమీపంలో జరిగింది. చీమకుర్తి మండలం పుట్టచెరువుపాలేనికి చెందిన సింగరాజు చిరంజీవి (24) ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే పరీక్షలు రాయకుండా ఇంటికి వచ్చి క్రికెట్ బెట్టింగ్‌లతో కాలక్షేపం చేస్తున్నాడు. ఈ క్రమంలో అతన్ని తల్లి మందలించింది. దీంతో శనివారం రాత్రి ఒంగోలు హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న తన పెద్దమ్మ ఇంటికి వెళుతున్నానని చెప్పి వెళ్లిన చిరంజీవి ఆదివారం తెల్లవారుజామున ఒంగోలు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

సీఎం ఓ స్కామ్‌స్టర్!

(మొదటి పేజీ తరువాయి)

అందరి కోరిక తీరాలని నూకాలమ్మ అమ్మవారిని కోరుతున్నానన్నారు. అనకాపల్లి తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని 2018లో సందర్శించానని, వైసీపీ అధికారంలోకి వచ్చాక తెరిపిస్తామని మాట ఇచ్చిన ఆపార్టీ నాయకులు రియల్ వ్యాపారికి రూ.300 కోట్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. మళ్లీ షుగర్ ఫ్యాక్టరీకి పూర్వవైభవం తేవాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం గురించి కొణతాల పోరాడారన్నారు. పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ స్థానం జనసేనకే కేటాయించినా బీజేపీ అభ్యర్థన మేరకు సీఎం రమేశ్‌ను కూటమి అభ్యర్థిగా రంగంలోకి దించామని, ఆయనను గెలిపించాలని పిలుపునిచ్చారు. జనసేన నుంచి నాదెండ్ల మనోహర్, కొణతాల రామకృష్ణ వంటి బలమైన నాయకులు అసెంబ్లీలో అడుగు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కోడిగుడ్డు మంత్రి, ఆ ప్రభుత్వం మళ్లీ కావాలా అనేది ప్రజలే ఆలోచించుకోవాలని పవన్ వ్యాఖ్యానించారు. ఒకప్పుడు అనకాపల్లి అనగానే బెల్లం గుర్తుకొచ్చేదని, ఇప్పుడు కోడిగుడ్డును వింటున్నామని పరోక్షంగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ఏడాదిలోగా సీపీఎస్‌కు పరిష్కారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీపీఎస్‌పై ఏం చేస్తారని ఉద్యోగులు అడుగుతున్నారని, అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా ఈ సమస్యకు పరిష్కారమార్గం చూపుతామన్నారు. ఒక ఉద్యోగి కొడుకుగా పెన్షన్ విలువ తెలిసిన వ్యక్తినని, సీపీఎస్ విషయంలో అందరూ కూర్చొని చర్చలు జరిపి ప్రతి ఉద్యోగికీ భద్రత కల్పించేలా చర్యలు చేపడతామని నూకాలమ్మ సాక్షిగా హామీ ఇస్తున్నానని పవన్ చెప్పారు. మీ భవిష్యత్తు కోసం నిలబడే నాయకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధి కోసం ఆలోచించే వ్యక్తులు జనసేన నుంచి 21 మంది పోటీలో ఉన్నారన్నారు.

ఆ పన్ను తొలగిస్తాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెత్తపై పన్నును తొలగించాలని చంద్రబాబుకు చెబుతానని పవన్ అన్నారు. అనకాపల్లి బెల్లానికి పేరుందని, పరిశోధన స్థానంలో ఎన్నో పరిశోధనలు జరుగుతున్నా మార్కెటింగ్ సదుపాయం లభించడం లేదన్నారు. అధికారంలోకి రాగానే బెల్లం రైతులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించి, మరింత మెరుగ్గా పరిశోధనలు జరిగేలా చర్యలు చేపడతామన్నారు. అనకాపల్లి నుంచి ఒకప్పుడు తిరుపతి వెంకన్న ఆలయానికి బెల్లం వెళ్లేదని, దానిని వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అనకాపల్లి బెల్లం తిరుపతి వెంకన్నకు అందేలా చర్యలు చేపడతామన్నారు. మాట ఇస్తే వెనక్కి తీసుకునే నైజం తనది కాదని, అందరూ కలిసి వస్తే, మీలో ఒకడిగా, కుటుంబ సభ్యుడిగా మీకోసం పోరాడతానని పవన్ కల్యాణ్ ప్రజలకు హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి రాగానే సహకార రంగం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మూతపడిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించే బాధ్యత తీసుకుంటామన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి చంద్రబాబు హయాంలో రూ.2 వేల కోట్లు మంజూరు చేస్తే, వైసీపీ ప్రభుత్వం దానిని ఇప్పటికీ పూర్తి చేయలేకపోయిందన్నారు.

ప్లాంట్‌ను పరిరక్షించుకోవాలి

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పవన్ వ్యాఖ్యానించారు. ఒక్కరే ఏమీ చేయలేమని, అందరూ కలిసి పోరాడితే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా మరింత విస్తరించవచ్చన్నారు. వైసీపీ ప్రభుత్వం, పోలీసుల సహకారం లేకుండా వైజాగ్ పోర్టుకు విదేశాల నుంచి రూ.25 వేల కోట్ల విలువైన డ్రగ్స్ వచ్చాయా? అని పవన్ ప్రశ్నించారు. కాగా, వారాహి విజయభేరి యాత్రకు ఆదివారం అనకాపల్లి వచ్చిన పవన్ కల్యాణ్‌కు బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, జనసేన అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మూడు పార్టీల నాయకులు ఘన స్వాగతం పలికారు. స్థానిక సుంకరమెట్ట కూడలి నుంచి అనకాపల్లి నెహ్రూచౌక్ కూడలి వరకు పవన్ ఓపెన్‌టాప్ వాహనంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ రోడ్డుషో నిర్వహించారు.

అది విచ్ఛిన్న ముఠా భాష!

జమ్మూకశ్మీరుకు దేశంతో సంబంధం లేదంటారా?.. మీ మాటలకు సిగ్గుపడుతున్నాను

- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేపై ప్రధాని ఫైర్
- అవినీతి నేతలను కాపాడుకోవడానికే

కేంద్ర ఏజెన్సీలపై టీఎంసీ దాడులు: మోదీ



నవాదా/జల్పాయ్‌గురి, ఏప్రిల్ 7: ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేపై ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జమ్మూకశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణ రద్దు ప్రస్తావన రాజస్థాన్‌లో ఎందుకని శనివారం ఆయన జైపూర్‌లో చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. జమ్మూకశ్మీరుకు మిగతా దేశంతో సంబంధం లేదా అని ధ్వజమెత్తారు. ఇది విచ్ఛిన్న ముఠా (టుకడే టుకడే గ్యాంగ్) భాషగా పేర్కొన్నారు. ఆదివారం ప్రధాని బిహార్‌లోని నవాదా, బెంగాల్లోని జల్పాయ్‌గురిలో జరిగిన ఎన్నికల సభల్లో ప్రసంగించారు. 'కాంగ్రెస్ అధ్యక్ష పదవి చిన్నది కాదు. ఆ పదవిలో ఉన్న ఖర్గే 370 రద్దు గురించి ఏం మాట్లాడారు? జమ్మూకశ్మీరు గురించి రాజస్థాన్ ప్రజలకు ఏం సంబంధమని అంటారా? అంటే జమ్మూకశ్మీరు మన దేశంలో అంతర్భాగం కాదా? ఆయన మాటలకు సిగ్గుపడుతున్నాను. మాతృభూమి కోసం బిహార్ యువత, ప్రజలు ఎంతో మంది త్యాగాలు చేశారు. జమ్మూకశ్మీరును పరిరక్షించే క్రమంలో ఎందరో యువకులు ప్రాణత్యాగం చేశారు. రాజస్థాన్‌లో కూడా ఇంతే. కానీ ఇప్పుడు కాంగ్రెస్ నేతలు దేశంలోని ఈ ప్రాంతంతో ఆ ప్రాంతానికి సంబంధం ఏమిటని అంటారా? వారి విభజన దృక్పథాన్ని ఇది చాటుతోంది. ఈ విచ్ఛిన్న ముఠాను క్షమిస్తారా' అని సభికులను ప్రశ్నించారు. అలాగే శనివారం రాత్రి టీఎంసీ నేతలను అరెస్టు చేయడానికి వెళ్లిన ఎన్ఐఏ అధికారులపై స్థానిక టీఎంసీ కార్యకర్తలు దాడి చేసి.. తిరిగి వారిపైనే కేసు పెట్టారని మోదీ అన్నారు. బెంగాల్లో టీఎంసీ సిండికేట్ రాజ్ నడుస్తోందని.. అవినీతి నేతలను కాపాడడమే మమత ప్రభుత్వ ఏకైక లక్ష్యమని ధ్వజమెత్తారు. 'రాష్ట్రంలో దోపిడీ, భయానక వాతావరణం, అవినీతి, హింసకు టీఎంసీ ఉచిత లైసెన్సు కోరుతోంది. దేశ రాజ్యాంగాన్ని, చట్టాన్ని తుంగలో తొక్కుతోంది. పేదల కోసం కేంద్రం తెచ్చిన సంక్షేమ పథకాలను మమత అమలు చేయడం లేదు. కేంద్ర నిధులు మొదట తమ ఖాతాలో పడాలని అనుకుంటున్నారు. రాష్ట్రంలో వివిధ అవినీతి కేసులకు సంబంధించి ఈడీ అవినీతి నేతలకు చెందిన రూ.3 వేల కోట్ల ఆస్తులను జప్తు చేసింది. నేను అవినీతిని నిర్మూలిస్తానంటుంటే ప్రతిపక్ష కూటమి అవినీతిపరులను రక్షిస్తామంటోంది. అవినీతిపరులను రక్షించేందుకే టీఎంసీ, లెఫ్ట్, కాంగ్రెస్ ఇండీ కూటమిని ఏర్పాటుచేశాయి' అని మోదీ అన్నారు. సందేశ్‌ఖాలీలో జరిగిన అత్యాచారాలను యావద్దేశం చూసిందని.. అఘాయిత్యాలకు పాల్పడినవారు జీవితాంతం జైల్లో మగ్గేలా చేస్తానని అన్నారు.

ప్రధాని కాళ్లు మొక్కిన నీతీశ్

- నాలుగు వేల మంది ఎంపీలతో మోదీ మళ్లీ గెలుస్తారని వ్యాఖ్య

పట్నా, ఏప్రిల్ 7: ప్రధాని మోదీ ఈసారి 4వేల మంది ఎంపీలతో తిరిగి అధికారంలోకి వస్తారని బిహార్ సీఎం నీతీశ్ కుమార్ చేసిన వ్యాఖ్య సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. బహిరంగ వేదికపైనే నీతీశ్ మోదీ కాళ్లను మొక్కడం కూడా చర్చకు దారి తీసింది. బిహార్‌లోని నవడాలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ఈ సంఘటన చోటు చేసుకుంది. 25 నిమిషాల పాటు చేసిన నీతీశ్ ప్రసంగం మోదీ సహా అందరికీ విసుగు తెప్పించింది. పలుమార్లు ఆయన తడబడ్డారు. ఒక సందర్భంలో ఆయన 'మోదీ చార్ సౌ (నాలుగు వందలు) అని అనబోయి.. చార్ హజార్ సే భీ జ్యాదా (4వేలకు పైగా) ఎంపీ స్థానాలతో తిరిగి అధికారంలోకి వస్తారని అన్నారు. లోక్‌సభలో మొత్తం సీట్లు 543 కాగా, 400 స్థానాల్లో గెలవాలని మోదీ లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే.. నీతీశ్ ప్రసంగంపై మోదీ సహా పలువురు అసంతృప్తి చెందారు. వేదికపై ఉన్న జేడీ(యూ) నేత విజయ్ కుమార్ పలుమార్లు ఆయనకు గడియారాన్ని చూపించారు. మోదీ కూడా చమత్కరిస్తూ "మీరు మంచి ఉపన్యాసం ఇచ్చారు. చెప్పడానికి నాకేమీ విగల్చలేదు" అన్నారు. ప్రసంగాన్ని ముగించిన నీతీశ్ నవ్వుతూ వంగి మోదీ కాళ్లను తాకారు.

అలెక్సాతో చిన్నారిని కాపాడిన బాలిక

- జాబ్ ఆఫర్ చేసిన ఆనంద్ మహీంద్రా



లఖ్‌నవూ, ఏప్రిల్ 7: ఉత్తరప్రదేశ్‌లోని బస్తీ జిల్లాకు చెందిన నిఖిత(13) 'అలెక్సా' సహాయంతో ఓ కోతి దాడి నుంచి తన అక్క కూతురిని రక్షించింది. కుటుంబ సభ్యులందరూ వేరే గదిలో ఉన్న సమయంలో ఆమె ఏడాది వయస్సు గల చిన్నారితో ఆడుకుంటుండగా ఓ కోతి ఆ ఇంట్లోకి దూరింది. పాపపై దాడిచేసేందుకు ప్రయత్నించగా.. నిఖిత సమయస్ఫూర్తితో వ్యవహరించి ఫ్రిడ్జ్ పైన ఉన్న అలెక్సాకు 'కుక్కలా మొరుగు' అంటూ ఆదేశాలిచ్చింది. అనంతరం అలెక్సా కుక్కలా మొరగడంతో ఆ అరుపులకు కోతి భయపడి పారిపోయింది. ఇలా కోతి బారి నుంచి తనతోపాటు తన అక్క కూతురిని కూడా ఆమె రక్షించుకుంది. ఈ విషయం తెలుసుకున్న మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా నిఖిత సమయస్ఫూర్తిని మెచ్చి ఆమెకు జాబ్ ఆఫర్ చేశారు. చదువు పూర్తయ్యాక నిఖిత కార్పొరేట్ ఉద్యోగం చేయాలనుకుంటే తాము ఇస్తానన్నారు.

విస్తారాలో సిబ్బంది కొరత..

10% విమానాల రద్దు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: పైలట్ల అనారోగ్యం, తగినంత మంది సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో 10 శాతం విమాన సర్వీసులను తగ్గిస్తున్నట్టు ఆదివారం టాటా గ్రూప్‌నకు చెందిన విస్తారా సంస్థ ప్రకటించింది. ఈ వేసవిలో ప్రతి రోజూ 300కుపైగా విమానాలను నడపాల్సి ఉండగా, సిబ్బంది కొరత కారణంగా 25-30 విమానాలను నిలిపివేయనున్నట్టు తెలిపింది. ఎక్కువగా డొమస్టిక్ విమానాలనే రద్దు చేశామని, తద్వారా విదేశాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూశామని పేర్కొంది. ఈ నెల తరువాత పరిస్థితులు సర్దుకుంటాయని తెలిపింది.

నడ్డాను ఎందుకు విచారించట్లేదు?



న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం పాలసీ కేసుకు సంబంధించి కేజ్రీవాల్‌తోపాటు ఆప్ నేతల్లో ఎవరి దగ్గరైనా ఒక్క రూపాయి దొరికిందా అని ఢిల్లీ మంత్రి అతిశీ ప్రశ్నించారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాలని మద్యం వ్యాపారి శరత్ చంద్రారెడ్డిపై ఒత్తిడి తెచ్చి చివరికి అప్రూవర్‌గా మార్చుకున్నారని ఆరోపించారు. బీజేపీకి విరాళం ఇచ్చిన తర్వాత శరత్ చంద్రారెడ్డికి బెయిల్ వచ్చిందని గుర్తు చేశారు. ఈ కేసులో శరత్ చంద్రారెడ్డి కీలక వ్యక్తి అని ఈడీ, సీబీఐ చెబుతోందని, అలాంటి వ్యక్తి బీజేపీకి విరాళం ఇవ్వడంపై దర్యాప్తు సంస్థలు ఎందుకు నోరు మెదపడంలేదని, బీజేపీ అధ్యక్షుడు నడ్డాను ఎందుకు అరెస్టు చేయడం లేదని నిలదీశారు. కాగా, కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆప్ ఆదివారం సామూహిక నిరాహార దీక్షలు చేపట్టింది. దేశవ్యాప్తంగా ఆప్‌తోపాటు ఇండియా కూటమి నేతలు ఈ దీక్షలు చేపట్టినట్టు పార్టీ తెలిపింది.

ఎన్ఐఏ అధికారులపై లైంగిక వేధింపుల కేసు

నమోదు చేసిన పశ్చిమ బెంగాల్ పోలీసులు



భూపతినగర్‌లో మహిళల వాగ్వాదం

- అరెస్టయిన నిందితుల కుటుంబసభ్యుల ఫిర్యాదే ఆధారం

కోల్‌కతా, ఏప్రిల్ 7: జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులపై పశ్చిమ బెంగాల్ పోలీసులు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. ఎన్ఐఏ అధికారులపై శనివారం తూర్పు మిద్నపూర్ జిల్లా భూపతినగర్‌లో రాళ్లదాడి జరిగిన కొన్ని గంటలకే ఎన్ఐఏ అధికారులపై పోలీసులు లైంగిక వేధింపుల కేసు నమోదు చేయడం గమనార్హం. 2022 డిసెంబరు 3న భూపతినగర్‌లోని ఓ ఇంట్లో పేలుడు సంభవించి ముగ్గురు మృతిచెందారు. ఆ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్ఐఏ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి భూపతినగర్‌లో సోదాలు జరిపి అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీ కార్యకర్తలు మనబ్రతో జన, బలాయి మైతీలను అరెస్టు చేశారు. ఆ ఇద్దరినీ తమ వాహనాల్లో కోల్‌కతాకు తీసుకెళ్తుండగా గ్రామస్థులు శనివారం ఎన్ఐఏ అధికారుల వాహనాలపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. అయితే, అరెస్టయిన మనబ్రతో జన కుటుంబంలోని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎన్ఐఏ అధికారులపైనే పోలీసులు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. అర్ధరాత్రి తమ ఇంటి తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన ఎన్ఐఏ అధికారులు తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని ఆ మహిళ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇది భారత రాజ్యాంగంపై దాడి: బీజేపీ

భూపతినగర్ ఘటనపై బీజేపీ, టీఎంసీ మధ్య మాటల యుద్ధం మొదలైంది. 'కేంద్ర సంస్థలపై దాడిచేయడమంటే భారత రాజ్యాంగంపై దాడి చేయడమే. తమ విధులు నిర్వర్తిస్తున్న ఎన్ఐఏ అధికారులపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేయడం అన్ని రాజ్యాంగ వ్యవస్థలూ కుప్పకూలడానికి ఒక సంకేతం' అని బీజేపీ ఎంపీ శామిక్ భట్టాచార్య విమర్శించారు. కాగా, తమ నాయకులు, కార్యకర్తలపై బీజేపీ దాడి ప్రారంభించిందని టీఎంసీ ఆరోపించింది. కాగా, రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి(సీఈవో) ఆరిజ్ ఆఫ్తాబ్ భూపతినగర్ ఘటనపై నివేదిక కోరారు.

వోల్టాస్ 20 లక్షల ఏసీ అమ్మకాల మైలురాయి

VOLTAS

న్యూఢిల్లీ: ఇళ్లలో వినియోగించే ఏసీల విభాగంలో అగ్రగామి అయిన వోల్టాస్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 20 లక్షల ఏసీలు విక్రయించి కొత్త రికార్డును నమోదు చేసింది. అమ్మకాలు 35 శాతం పెరిగినట్టు కంపెనీ వెల్లడించింది. దేశీయ మార్కెట్లో ఈ రికార్డును సాధించిన తొలి కంపెనీ తమదేనని పేర్కొంది. ఏసీలకు డిమాండు సంవత్సరం పొడవునా బలంగా ఉండడంతో పాటు విస్తృత ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ నెట్‌వర్క్, కొత్త ఏసీల విడుదల వంటివి ఈ రికార్డు నెలకొల్పడానికి దోహదపడిన అంశాలని ఎండీ, సీఈఓ ప్రదీప్ బక్షి తెలిపారు. ఈ అమ్మకాలతో గృహ వినియోగ ఏసీల విభాగంలో నంబర్ వన్ స్థానం సుస్థిరం చేసుకున్నామని బక్షి చెప్పారు. టర్కిష్ కంపెనీ ఆర్సెలిక్‌తో తమ జాయింట్ వెంచర్ వోల్టాస్ బెకో బ్రాండ్ హోమ్ అప్లయెన్సులు కూడా 20 లక్షల అమ్మకాల మైలురాయికి చేరువైనట్టు ఆయన తెలిపారు. మొత్తం మీద గత ఏడాది తాము 50 లక్షల గృహోపకరణాలు విక్రయించామని ఆయన వెల్లడించారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	375	విజయవాడ	390
చిత్తూరు	458	విశాఖపట్నం	405
గోదావరి	390	వరంగల్	377
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	156	గోదావరి	152
వరంగల్	156	విజయవాడ	152
కరీంనగర్	156	గుంటూరు	152
మహబూబ్‌నగర్	156	ఒంగోలు	152
కర్నూలు	156	చిత్తూరు	148
విశాఖపట్నం	134		

బిజినెస్

ఎగుమతులపై మారుతి ఫోకస్



2030 నాటికి 8 లక్షలు టార్గెట్

న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో రికార్డు ఎగుమతులు నమోదు చేసిన దేశీయ కార్ల దిగ్గజం ఆ జోరును కొనసాగించి కొత్త ఆర్థిక సంవత్సరంలో 3 లక్షల ఎగుమతుల మైలురాయిని చేరాలని భావిస్తోంది. అలాగే 2030 నాటికి 8 లక్షల కార్ల ఎగుమతుల లక్ష్యం నిర్దేశించుకుంది. 100 పైగా దేశాలకు మారుతి సుజుకీ కార్లు ఎగుమతులు చేస్తోంది. ఈ మార్కెట్లన్నింటిలోనూ రాబోయే కాలంలో మరిన్ని కొత్త కార్లు విడుదల చేయాలని కూడా మారుతి యాజమాన్యం నిర్ణయించింది. అలాగే పంపిణీ నెట్‌వర్క్ విస్తరించడంతో పాటు డీలర్‌షిప్‌ల వద్దనే బ్యాంక్ ఫైనాన్సింగ్, సర్వీసింగ్ సదుపాయాల పటిష్టతపై దృష్టి సారించాలని కూడా భావిస్తోంది. కొద్ది కాలం క్రితం వరకు తమ ఎగుమతులు 1 నుంచి 1.2 లక్షల పరిధిలోనే ఉండేవని, 2022-23లో 2.59 లక్షలు, 2023-24లో 2.83 లక్షల కార్లు ఎగుమతి చేయగలిగామని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాహుల్ భారతి తెలిపారు. ఇతర కంపెనీల ఎగుమతులు దిగజారిన సమయంలో సైతం తాము 9 శాతం వృద్ధిని సాధించగలగడం విశేషమని ఆయన చెప్పారు. ప్రస్తుత కార్లనే కాకుండా ఈ ఏడాదిలో ఉత్పత్తి ప్రారంభించనున్న విద్యుత్ కార్లను సైతం జపాన్, యూరప్ వంటి మార్కెట్లకు ఎగుమతి చేయాలని నిర్ణయించామన్నారు. 2030 నాటికి ఎగుమతులను 7.5 లక్షల నుంచి 8 లక్షలకు పెంచడం తమ లక్ష్యమని ఆయన చెప్పారు. ఈ ఏడాది 3 లక్షల ఎగుమతుల మైలురాయిని దాటగలమన్న విశ్వాసం ఆయన ప్రకటించారు. ప్రస్తుత తాము ఉత్పత్తి చేస్తున్న మోడళ్లన్నీ 100 మార్కెట్లలోనూ అందుబాటులో లేవని, ఈ కారణంగా మరిన్ని దేశాల్లో మరిన్ని మోడళ్లను ప్రవేశపెట్టనున్నామని రాహుల్ వెల్లడించారు. దీనికి తోడు భారతదేశంలో తాము అనుసరిస్తున్న ఉత్తమ మార్కెటింగ్ వ్యూహాలన్నీ ప్రవేశపెట్టడం వల్ల ఆయా దేశాల కస్టమర్లలో విశ్వాసం పెరుగుతుందని భావిస్తున్నట్టు చెప్పారు. ఇటీవలే ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో తాము 2,83,067 కార్లు ఎగుమతి చేసినట్లు ఆయన తెలిపారు. విదేశాలకు తాము భారీగా ఎగుమతి చేస్తున్న మోడళ్లలో బాలెనో, డిజైర్, స్విఫ్ట్, ఎస్‌ప్రెసో, గ్రాండ్ విటారా, జిమ్నీ, సెలీరియో, ఎర్టిగా ఉన్నాయని చెప్పారు.

పునరుత్పాదక ఇంధనంపై రూ.2.30 లక్షల కోట్లు



ఖవ్డా/అహ్మదాబాద్ (గుజరాత్): పునరుత్పాదక ఇంధన వనరులపై అదానీ గ్రూప్ పెద్ద ఎత్తున దృష్టి పెట్టింది. సౌర, పవన విద్యుత్ కేంద్రాలతో పాటు, అందుకు అవసరమైన సోలార్ మాడ్యూల్స్, పవన్ విద్యుత్ జనరేటర్ల తయారీపై 2030 నాటికి రూ.2.30 లక్షల కోట్లు ఖర్చు చేయనుంది. ఇందులో రూ.2 లక్షల కోట్లు అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఏజీఈఎల్) ద్వారా ఖర్చు చేయనుంది. ఈ మొత్తంలో రూ.1.5 లక్షల కోట్లు గుజరాత్‌లోని ఖవ్డా వద్ద ఏర్పాటు చేస్తున్న సౌర, పవన్ విద్యుత్ పార్కు కోసం ఖర్చు చేస్తారు. ఈ పెట్టుబడితో 2030 నాటికి ఈ పార్కులో 30,000 మెగావాట్ల సౌర, పవన్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని భావిస్తోంది. మిగతా రూ.50,000 కోట్లతో రాజస్థాన్, తమిళనాడుల్లో 6,000-7,000 మెగావాట్ల సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులు చేపడతారు. మరో రూ.30,000 కోట్లు అదానీ న్యూ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఏఎన్ఐఎల్) ద్వారా గుజరాత్‌లోని ముంద్రా వద్ద ఏర్పాటు చేసే ప్లాంట్లలో సోలార్ సెల్స్, విండ్ టర్బైన్ల తయారీ కోసం ఖర్చు చేస్తారు.

45,000 మెగావాట్ల లక్ష్యం: అదానీ గ్రీన్ ఎనర్జీ ఇప్పటికే 10,934 మెగావాట్ల పునరుత్పాదక ఇంధనం ఉత్పత్తి చేస్తోంది. 2030 నాటికి 45,000 మెగావాట్ల లక్ష్యం చేరుకోవాలని భావిస్తోంది. ఇందులో 30,000 మెగావాట్లు కేవలం గుజరాత్‌లోని ఖవ్డా వద్ద ఏర్పాటు చేసే సోలార్, పవన విద్యుత్ పార్క్ ద్వారా లభించనుంది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద పునరుత్పాదక ఇంధన పార్కు. ప్రస్తుతం ఈ పార్కు నుంచి 2,000 మెగావాట్ల విద్యుత్ మాత్రమే ఉత్పత్తి అవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం మరో 4,000 మెగావాట్లు అందుబాటులోకి వస్తుంది.

రిలయన్స్ కాపిటల్ కథ మళ్లీ మొదటికి!

న్యూఢిల్లీ: దివాలా ప్రక్రియలో ఉన్న రిలయన్స్ కాపిటల్ కథ ఇప్పట్లో తేలేలా లేదు. రూ.9,650 కోట్లతో ఈ కంపెనీని టేకోవర్ చేసేందుకు హిందుజా గ్రూప్ సంస్థ ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ లిమిటెడ్ (ఐఐహెచ్ఎల్) ఈ ఏడాది ఫిబ్రవరిలో వేసిన బిడ్‌కు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపింది. అయితే రిలయన్స్ కాపిటల్ నిర్వహణలోని నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థకు అవసరమైన మూల ధనం, రుణాలను ఐఐహెచ్ఎల్ ఎలా సేకరిస్తోందో తెలపాలని బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ కోరింది. దీంతో రిలయన్స్ కాపిటల్ దివాలా పరిష్కార కథ మళ్లీ మొదటికొచ్చినట్టయింది.

22600 పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్‌గా ప్రారంభమై 22500 వద్ద రియాక్షన్‌కు గురైనప్పటికీ తిరిగి కోలుకుంది. చివరికి ముందు వారంతో పోల్చితే 185 పాయింట్ల లాభంతో 22500 సమీపంలో క్లోజయింది. గత నాలుగు వారాలుగా నిఫ్టీ ఇక్కడ పరీక్ష ఎదుర్కొంటూనే ఉంది. ఈ విడత కూడా మైనర్ రియాక్షన్ అనంతరం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవడం తక్షణ ముప్పు లేదనేందుకు సంకేతం. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్వల్పకాలిక నిరోధాన్ని బ్రేక్ చేయడం అవసరం. గత వారం మిడ్‌క్యాప్ 100 సూచీ 1950 పాయింట్లు లాభపడి చారిత్రక గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. స్మాల్‌క్యాప్ 100 సూచీ కూడా 1100 పాయింట్లు లాభపడి చారిత్రక గరిష్ఠ స్థాయి వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. ప్రస్తుతం మార్కెట్ ఐదో సారి చారిత్రక గరిష్ఠ స్థాయి 22550 వద్ద పరీక్షకు గురవుతోంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ధోరణిలో ట్రేడయినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం గత శుక్రవారం తాకిన ప్రధాన నిరోధం 22600 కన్నా నిలదొక్కుకోవాలి. ఆ పైన మానసిక అవధులు 22800, 23000.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినా సానుకూలత కోసం 22500 వద్ద నిలదొక్కుకుని తీరాలి. అంత కన్నా దిగజారితే మైనర్ బలహీనతలో పడుతుంది. మరో మద్దతు స్థాయి 22300. ప్రధాన మద్దతు స్థాయిలు 22150, 21950.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం మంచి ర్యాలీ సాధించి 1370 పాయింట్ల లాభంతో 48,500 వద్ద క్లోజయింది. పాజిటివ్ ధోరణిలో ట్రేడయినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 48650 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన మానసిక అవధి 49000. దిగువన మద్దతు స్థాయి 48000 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది.

పాటర్న్: సానుకూలత కోసం 22600 వద్ద "అడ్డంగా ఏర్పడిన ట్రెండ్‌లైన్"ను బ్రేక్ చేయాలి. 22300 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22600, 22640
మద్దతు	22460, 22400

www.sundartrends.in

ఫార్మా, ఎనర్జీ షేర్లపై కన్నేయండి

అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు వస్తే ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సరికొత్త జీవిత కాల గరిష్ఠాలను నమోదు చేసే అవకాశం కనిపిస్తోంది. ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడంతో మదుపరుల్లో నెలకొన్న గందరగోళం తొలగింది. ఈ వారం నిఫ్టీ 22,700 పాయింట్లను అధిగమిస్తే 22,900 పాయింట్ల వరకు పెరిగే అవకాశం ఉంది. బ్యాంకు నిఫ్టీ 48,900 పాయింట్ల స్థాయిని అధిగమిస్తే 49,600 పాయింట్ల వరకు ఎగబాకే అవకాశం కనిపిస్తోంది. ఈ వారం ఫార్మా, ఎనర్జీ కంపెనీల షేర్లు లైమ్‌లైట్‌లో ఉండవచ్చు.

ఈ వారం స్టాక్ రికమండేషన్లు...

బజాజ్ ఫిన్‌సర్వ్: ఈ ఏడాది ఆరంభం నుంచి స్వల్పకాలిక దిద్దుబాటులో ఉన్న బజాజ్ ఫిన్‌సర్వ్ కంపెనీ షేర్లకు రూ.1,520 వద్ద కీలక మద్దతు లభించింది. ప్రస్తుతం ఈ కౌంటర్ క్రాస్ ట్రెండ్‌లైన్‌ను బ్రేక్ చేసి మార్చి మూడో వారం నుంచి అదరగొడుతోంది. డెలివరీ వాల్యూమ్స్ కూడా పెరుగుతున్నాయి. కొత్త రుణాల్లో నాలుగు శాతం వృద్ధి నమోదు కావడం మరో కలిసొచ్చే అంశం. గత వారం రూ.1,677 వద్ద ముగిసిన ఈ షేర్లలో మదుపరులు రూ.1,725/1,775 టార్గెట్‌తో రూ.1,650 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.1,615ను స్ట్రిక్ట్ స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ కార్డ్స్: రెండేళ్లుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కంపెనీ షేర్లకు రూ.680 వద్ద మరోసారి మద్దతు లభించింది. ఈ మధ్య డివిడెండ్ ఇవ్వడం, త్వరలో నాలుగో త్రైమాసిక ఫలితాలు ప్రకటించనుండడంతో షేర్ల ధరలో మూమెంటమ్ కనిపిస్తోంది. గత వారం ఎస్‌బీఐ కార్డ్స్ షేర్లు నెల రోజుల గరిష్ఠ స్థాయిని అధిగమించాయి. నిఫ్టీతో పోలిస్తే మెరుగైన పనితీరు కనబరుస్తోంది. శుక్రవారం భారీ వాల్యూమ్స్‌తో పాటు ఐదు శాతం లాభంతో రూ.730 వద్ద క్లోజయ్యాయి. రూ.785/915 టార్గెట్‌తో మదుపరులు రూ.700/720 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.690ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎన్‌బీసీసీ: రెండు నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కౌంటర్‌లో ప్రస్తుతం టర్న్ అరౌండ్ కనిపిస్తోంది. రూ.104 వద్ద మద్దతు తీసుకుని క్రమంగా పెరుగుతోంది. గత వారం ఏకంగా 9.28 శాతం లాభంతో రూ.138 వద్ద ముగిసింది. అప్పర్ బొలింజర్ బ్యాండ్ బ్రేకవడం, డెలివరీ వాల్యూమ్స్ పెరగడం ఈ కౌంటర్‌కు ఉన్న సానుకూల అంశాలు. మదుపరులు రూ.145/160 టార్గెట్‌తో రూ.132 పైన పొజిషన్లు తీసుకోవచ్చు. కాకపోతే రూ.130ని స్ట్రిక్ట్ స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐసీఐసీఐ లొంబార్డ్: చక్కటి అప్‌ట్రెండ్ తర్వాత ఈ కౌంటర్‌లో అక్యుములేషన్ పెరిగింది. ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు 52 వారాల గరిష్ఠ స్థాయిలో కోట్ అవుతున్నాయి. ట్రేడింగ్ వాల్యూమ్స్ సైతం పెరుగుతున్నాయి. బ్రోకరేజి సంస్థలు బై రేటింగ్ ఇవ్వడం ఈ కౌంటర్‌కు మరో సానుకూల అంశం. త్వరలో క్యూ4 ఆర్థిక ఫలితాలు ప్రకటించబోతోంది. దీంతో ఈ కౌంటర్‌లో మరింత మూమెంటమ్ కనిపిస్తోంది. గత వారం 4.85 శాతం లాభంతో రూ.1,717 వద్ద ముగిసింది. రూ.1,770/1,850 టార్గెట్‌తో మదుపరులు రూ.1,700 వద్ద ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. కాకపోతే రూ.1,660ని స్ట్రిక్ట్ స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎన్‌సీసీ: ఇంజనీరింగ్, నిర్మాణ సంస్థ ఎన్‌సీసీ షేర్లలో బలం కనిపిస్తోంది. మల్టీ ఇయర్ బ్రేకవుట్‌తో ఈ కౌంటర్ మంచి జోరు మీద ఉంది. సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయిని తాకేందుకు పరుగులు పెడుతోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్స్ గణనీయంగా పెరుగుతున్నాయి. గత వారం ఎన్‌సీసీ షేర్లు 6.90 శాతం లాభంతో రూ.272.70 వద్ద ముగిశాయి. రూ.290/310 టార్గెట్‌తో మదుపరులు రూ.260 వద్ద ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.240ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



\- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

ఆమె కృషి

అడవినే సృష్టించింది

రోజుకో చెట్టు... ఇదీ కొల్లక్కయిల్ దేవకీ అమ్మ చేపట్టిన యజ్ఞం. నలభై ఏళ్ల నుంచి ఆమె సాగిస్తున్న కృషి ఒక అడవినే సృష్టించింది. అది అరుదైన మొక్కలకు, వలస పక్షులకు నిలయంగా మారింది. తొంభయ్యేళ్ళ వయసులోనూ పర్యావరణ సంరక్షణకు, జీవవైవిధ్యానికీ పాటుపడుతూ... అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న ఒక సామాన్యురాలి కథ ఇది.



"నేను పుట్టిన ఏడాది తెలుసు. తేదీ సరిగ్గా గుర్తులేదు. కానీ ఏ మొక్కను ఎప్పుడు నాటానో మాత్రం కచ్చితంగా గుర్తుంటుంది. ఎందుకంటే అవి నా పిల్లల్లాంటివి" అంటారు కొల్లక్కయిల్ దేవకీ అమ్మ. గత నెలాఖర్లోనే ఆత్మీయుల మధ్య తొంభయ్యో పుట్టిన రోజు జరుపుకొన్న ఆమె నలభయ్యేళ్ళుగా మొక్కలు నాటే యజ్ఞాన్ని నిష్ఠగా నిర్వహిస్తున్నారు. 1934లో కేరళలోని ముత్తుకులమ్ గ్రామంలో జన్మించిన ఆమెది వ్యవసాయ కుటుంబం. ఇంగ్లీష్ టీచర్ గోపాలకృష్ణ పిళ్ళైతో వివాహం అయ్యాక కూడా... అత్తింటి వారి పొలంలో వ్యవసాయ బాధ్యతలను ఆమె తీసుకున్నారు. జీవితం సంతోషంగా సాగుతున్న సమయంలో ఆమె కారు ప్రమాదానికి గురయ్యారు. కాళ్ళు బాగా దెబ్బతినడంతో కొన్ని నెలల పాటు మంచం మీదే ఉండాల్సి వచ్చింది. ఆ తరువాత పూర్వంలా కష్టమైన పనులు చేయకూడదని వైద్యులు హెచ్చరించారు. "మొక్కలన్నా, పచ్చదనమన్నా నాకు ఎంతో ఇష్టం. 'వ్యవసాయం వద్దంటే మరేం చెయ్యాలి?' అని మధనపడుతున్నప్పుడు... "మొక్కలు నాటి, వాటిని పెంచు" అని నా భర్త సూచించారు. మా పెరట్లోనే దానికి శ్రీకారం చుట్టాను. నా భర్త ఎక్కడికి వెళ్ళినా కొత్త రకం మొక్కలను, విత్తనాలను తీసుకువచ్చేవారు. వాటిని నాటడం, సంరక్షించడం ఎంతో సంతోషంగా అనిపించేది. దాంతో దాదాపు నాలుగు దశాబ్దాలుగా కొనసాగిస్తున్నాను" అని చెబుతారు దేవకి. తమ అయిదు ఎకరాల స్థలంలో... రోజుకు కనీసం ఒక్క మొక్కయినా ఆమె నాటుతున్నారు. మామిడి, చింత, వేప, మద్ది లాంటి 200కు పైగా రకాల మొక్కలు, చెట్లు దాదాపు అయిదు వేల వరకూ ఆమె పెంపకంలో సేదతీరుతున్నాయి. కనీసం వెయ్యి మొక్కలు, చెట్లు పండ్లను, కూరగాయలను, పూలను అందిస్తున్నాయి.

▸▸ అరుదైన అతిథుల కోసం...

దేవకీ అమ్మలో అభినందనీయమైన మరో అంశం... పర్యావరణ స్పృహ. "నా చిన్నప్పుడు ఎక్కడ చూసినా పచ్చదనం ఉండేది. నీటి కరువు మాట వినిపించేది కాదు. మార్కెట్లో కాయగూరలు కొనడం చాలా తక్కువ. ఇప్పుడు పరిస్థితులన్నీ మారిపోయాయి. రసాయన ఎరువులు, పురుగుల మందులు వినియోగించి పండించే పంటల్లో నాణ్యత లేదు. అందుకే కొత్త కొత్త రోగాలు పుట్టుకొస్తున్నాయి" అంటారామె. తన తోటలో పూర్తిగా పర్యావరణ అనుకూలమైన పద్ధతుల్నే ఆమె పాటిస్తారు. చెట్ల కోసం సేంద్రియమైన ఎరువుల్నే ఉపయోగిస్తారు. ఆమె వనాన్ని పలు పక్షులు తమ నివాసంగా చేసుకున్నాయి. వాటిలో దేశీయమైనవే కాదు... వలస పక్షులు కూడా ప్రతి సీజన్లో అక్కడికి వచ్చి విడిది చేస్తాయి. వాటి కోసం ఆమె గూళ్ళను ఏర్పాటు చేశారు. మంచి నీరు అందుబాటులో ఉంచారు. "అవి నా తోటకు వచ్చే అరుదైన అతిథులు. వాటిలో అంతరించిపోయే ప్రమాదం ఉన్న జాతులు కూడా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. వాటి బాగోగులు చూసుకోవడం నా విధి కదా!" అని అంటారు దేవకి. వర్షపు నీటి సంరక్షణ కోసం కూడా ఆమె పలు చర్యలు చేపట్టారు. "దేవకీ అమ్మ తన తోటను ఒక అభయారణ్యంగా తీర్చిదిద్దారు. ఏక వ్యక్తి సైన్యంలా ఆమె సాగించిన పర్యావరణ పరిరక్షణ ఈ ప్రాంతంలో జీవవైవిధ్యానికి దోహదం చేస్తోంది" అని స్థానిక అధికారులు ప్రశంసిస్తున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులను, పరిశోధకులను, సోషల్ ఫారెస్ట్రీ గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్న పర్యాటకులను దేవకీ ఉద్యానవనం ఆకర్షిస్తోంది. ప్రకృతి ప్రేమికులు, వృక్ష, పక్షి శాస్త్రవేత్తలు తరచూ దాన్ని సందర్శిస్తూ ఉంటారు.

▸▸ బాధ్యతే కాదు... ఉత్సవం కూడా...



ఇప్పటికీ ప్రతిరోజూ కొంతసేపైనా తను పెంచిన అడవిలాంటి తోటలో గడుపుతారు దేవకి. "కొన్నేళ్ళ క్రితం వరకూ నా భర్త, నేను ఎక్కువ సమయం తోటలోనే ఉండేవాళ్ళం. ఆయన మరణించాక నా కుటుంబ సభ్యులు, స్నేహితుల సాయంతో పనులు నడిపించే దాన్ని. వయసు మీద పడడంతో నాకు ఓపిక తగ్గింది. నా మనుమలు, మునిమనుమలు ఆ బాధ్యతలు చూస్తున్నారు. కానీ ఇప్పటికీ రోజుకు ఒక మొక్కయినా నాటడం మాత్రం మానలేదు" అని చెబుతున్నారు దేవకి. "మా అమ్మ ప్రారంభించిన ప్రయాణాన్ని... ఆమెతో సహా నాలుగు తరాలవాళ్ళం కొనసాగిస్తున్నాం. బడికి సెలవులు ఇచ్చినప్పుడల్లా... మేము, మా పిల్లలు, ఇప్పుడు వాళ్ళ పిల్లలు అమ్మ దగ్గరకు రావడం, పాత మొక్కలు ఎలా ఎదుగుతున్నాయో చూడడం, కొత్తవి నాటడం ఆనవాయితీ అయిపోయింది. అమ్మ దాన్ని మా జీవితంలో ఒక భాగం చేశారు. మొక్కల పెంపకం మాకు అభిరుచి, బాధ్యత మాత్రమే కాదు... ఒక పెద్ద ఉత్సవం కూడా" అంటారు దేవకీ అమ్మ కుమార్తె ప్రొఫెసర్ తంగమణి. దేవకీ చేసిన కృషికి కేంద్ర ప్రభుత్వం నుంచి 'నారీ శక్తి' అవార్డు, కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ నుంచి 'ఇందిరా ప్రియదర్శిని విశ్వమిత్ర' అవార్డుతో సహా పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలు లభించాయి. దేవకీ అమ్మ పర్యావరణ శాస్త్రవేత్త కాదు, ఉద్యమకారిణి కాదు. ఒక మామూలు మనిషి. కానీ నేల తల్లి పచ్చగా ఉండాలని కలలు కన్నారు. దాని కోసం చేయగలిగింది చేస్తున్నారు. అడవులు చాలా వేగంగా కనుమరుగవుతున్న కాలంలో... ప్రకృతిని కాపాడుకోడానికి తమ వంతు ప్రయత్నం చేయాలనే స్ఫూర్తిని తన కథ కొందరిలోనయినా కలిగించాలనేది ఆమె ఆకాంక్ష.

కళ

స్వరాలు... ఆమె గొంతులో అద్భుత గానమవుతాయి. వయొలిన్ తీగలు... ఆమె చేతిలో కమ్మగా శృతి చేసుకొంటాయి. సంగీతంతో అయిదు పదులు దాటిన ప్రయాణం. మంగళంపల్లి వంటి ఉద్దండుల మార్గదర్శనం. డెబ్బై ఏళ్లు పైబడిన వయసులోనూ... తరగని స్వర నీరాజనం. **తాడేపల్లి సుబ్బలక్ష్మి...** ప్రముఖులెందరితోనో కలిసి వేదిక పంచుకున్న ఆమె... తన అనుభవాలను 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.



సంగీతమే ప్రపంచం

"అప్పుడు నాకు ఐదేళ్లు ఉంటాయనుకుంటా. ప్రముఖ గాయకుడు మాధవపెద్ది సత్యం గారి వదిన మీనాక్షి... విజయవాడ సత్యనారాయణపురంలోని మా ఇంటి దగ్గర ఉండేవారు. ఆవిడ నాకు సంగీతం నేర్పించేవారు. మా అక్కయ్యవాళ్లతో కలిసి వెళ్లేదాన్ని. చదువు మీద ఏ మాత్రం ఆసక్తి ఉండేది కాదు. సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారిది మా వెనక వీధే. మా నాన్నకు ఆయన బాగా పరిచయం. ఒక రోజు నన్ను ఆయన దగ్గరు తీసుకువెళ్లి... 'మా అమ్మాయి బడికి వెళ్లడంలేదు. ఎప్పుడు చూసినా సంగీతమే అంటోంది. ఏం చేయమంటారు' అని నాన్న అడిగారు. అప్పుడే విజయవాడలో సంగీత కళాశాల ప్రారంభించారు. ఆ కళాశాల నెలకొల్పడంలో బాలమురళీ గారి కృషి ప్రముఖమైనది. ఆయన సూచనతో నాన్న నన్ను సంగీత కళాశాలలో చేర్పించారు. అది కూడా గాత్రంలో కాదు... వయొలిన్‌లో. వయొలిన్‌లో చేర్చమని చెప్పింది బాలమురళీ గారేనట. ఎందుకంటే 'ఆమె గొంతు బాగుంది. వయొలిన్ నేర్చుకొంటే వోకల్ కూడా బాగా వస్తుంది. సంగీత ధర్మాలు తెలుస్తాయి' అని అన్నారట. అలా మా గురువు ఆకెళ్ల మల్లికార్జునశర్మ గారి శిష్యరికంలో వయొలిన్ అభ్యాసం మొదలుపెట్టా. ఇదంతా 1956-57ల్లో సంగతి. చిన్న వయసు కావడంతో వయొలిన్‌పై వేళ్లు కూడా సరిగ్గా అందేవి కాదు. అలాంటిది ఏడాది తిరక్కుండానే కళాశాలలో అందరి కంటే ముందుండేదాన్ని. ఎప్పుడూ బహుమతులు తెచ్చుకొనేదాన్ని. తరువాత కోటిపల్లి ప్రకాశరావు, నేదునూరి కృష్ణమూర్తి, ఎంవీ రమణమూర్తి గార్ల వద్ద కర్ణాటక సంగీతంలో సూక్ష్మ మెలకువలు, బేధాలు నేర్చుకున్నాను. వారందరి ప్రోత్సాహంతో ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి గాత్రం, వయొలిన్ డిప్లమోలు అందుకున్నాను.



రాష్ట్రపతి నుంచి సత్కారం...

వివిధ వేదికలతో పాటు రాజ్‌భవన్‌లో కూడా నేను చాలా సార్లు పాడాను. కేఆర్ నారాయణ్ గారు రాష్ట్రపతిగా ఉన్నప్పుడు రాజ్‌భవన్‌లో ఆయన ఎదుట కచేరీ ఇచ్చాను. అనంతరం ఆయన నన్ను ప్రత్యేకంగా సత్కరించారు. అలాగే రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ సి.రంగరాజన్ గారు తదితర ప్రముఖుల నుంచి ఎన్నో సత్కారాలు, సన్మానాలు అందుకున్నాను. అవన్నీ నాకు కాదు... నాలోని కళాకారిణికి దక్కిన గౌరవాలు. మన సంప్రదాయ సంగీతానికి ముగ్ధులై ఆహుతులు కొట్టే కరతాళ ధ్వనులు నాకు ఎంతో ప్రేరణనిస్తాయి. ఎంతో గొప్పగా అనిపిస్తాయి. ఈ ప్రయాణంలో శోభానాయుడు, అలేఖ్య పుంజల, ఉమారమ, వనజ ఉదయ్ తదితర ప్రముఖ నర్తకీమణులతో నాకు మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. వారి నాట్య ప్రదర్శనలకు గాత్రం అందించే భాగ్యం నాకు కలిగింది. వాళ్లతో దాదాపు అన్ని దేశాలూ తిరిగాను.

▸▸ బాలభవన్‌తో మొదలు...

చిన్న వయసులోనే వయొలిన్, గాత్ర సంగీతంలో కచేరీలు ఇవ్వడం మొదలుపెట్టాను. విజయవాడలో ఉన్నప్పుడే చాలా కచేరీలు చేశాను. తరువాత మా నివాసం హైదరాబాద్‌కు మారింది. 1985 నుంచి 92 వరకు ఇక్కడి 'జవహర్ బాలభవన్'లో వయొలిన్ ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేశాను. అదే నా తొలి ఉద్యోగం. ఒక పక్క గాత్ర సంగీతం, వయొలిన్ కచేరీలతో పాటు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలకు గాత్ర సాయం చేసేదాన్ని. అలా గాత్రసాయం చేసేవారిని 'గాయక్ అసిస్టెంట్' అంటారు. మొదట్లో నేను, రేడియో ఆర్టిస్ట్ మల్లిక్ గారు కలిసి పాడేవాళ్లం. అదే సమయంలో కోఠి సంగీత కళాశాలలో గాయక్ అసిస్టెంట్ పోస్టు ఖాళీ అయింది. అందులో చేరిన కొన్నేళ్లకు వయొలిన్ లెక్చరర్‌గా ప్రమోషన్ వచ్చింది.

▸▸ దేశవిదేశాల్లో కచేరీలు...

ఒక పక్క ఉద్యోగం చేస్తూనే కచేరీలు కూడా ఇచ్చేదాన్ని. ముఖ్యంగా హైదరాబాద్‌కు నివాసం మారిన తరువాత కార్యక్రమాలు అధికమయ్యాయి. 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్' తరఫున అమెరికా, లెబనాన్, టర్కీ, సిరియా, దక్షిణాఫ్రికా, జాంబియా, జింబాబ్వే, శ్రీలంక, గ్రీస్, సింగపూర్ తదితర దేశాల్లో పర్యటించే అవకాశం దక్కింది. విదేశీ గడ్డపై నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొని... మన సంప్రదాయ సంగీత మధురిమను వారికి పరిచయం చేయడం నిజంగా మధురానుభూతి. ప్రపంచ తెలుగు మహాసభలతో పాటు కాళిదాస్ సమారోహ్, కోణార్క్, సూర్య ఫెస్టివల్స్‌లో, తిరుమల, బెజవాడ కనకదుర్గ తదితర ప్రముఖ ఆలయాల్లో ప్రదర్శనలు ఇచ్చే అదృష్టం నాకు కలిగింది. సాంస్కృతిక శాఖ నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నాను. సి.నారాయణరెడ్డి గారు అయితే నన్ను చూసినప్పుడల్లా... 'అమ్మా... సుబ్బలక్ష్మి గారు... ఇంకా వయొలిన్ వాయిస్తున్నారా' అనేవారు. నా చదువు మెట్రిక్యులేషన్‌తోనే ఆగిపోయినా... సంగీతం నన్ను ఎంతో ఉన్నతంగా నిలబెట్టింది. కొన్ని వందల కార్యక్రమాల్లో స్వర నీరాజనం చేసే అదృష్టం నాకు కలిగింది.

▸▸ సంగీత విద్యాలయం...

నేను 2008లో పదవీ విరమణ పొందిన తరువాత 'బిట్స్ పిలానీ'లో నాలుగైదేళ్లు పని చేశాను. నాలాగా మరింతమందిని శాస్త్రీయ సంగీతం వైపు ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో 2009లో నేను, మావారు ఉమాశంకర్ కలిసి 'వాగ్దేవి సంగీత విద్యాలయం' ప్రారంభించాం... మా ఇంట్లోనే! మావారు కూడా కళాకారుడే. చక్కగా పాడతారు. వయొలిన్ వాయిస్తారు. ఉద్యోగం చేస్తూనే సంగీతం కొనసాగించారు. మేమిద్దరం కలిసి చాలా కచేరీలు ఇచ్చాం. కొన్ని భక్తి గీతాల ఆల్బమ్స్‌కు సంగీతం అందించాం. మా ఇద్దరి మార్గం ఒకటే కావడంతో సంగీత విద్యాలయం నెలకొల్పాం. దీని ద్వారా ఇప్పటివరకు వందల మందికి శిక్షణ ఇచ్చాం. ప్రస్తుతం యాభై మంది మా దగ్గర సంగీత సాధన చేస్తున్నారు. భద్రాచలం, తిరుమల, యాదగిరిగుట్ట తదితర ప్రసిద్ధ ఆలయాల్లో నిర్వహించే 'నాద నీరాజనం'లో మా విద్యార్థులతో కలిసి వేదిక పంచుకున్నాను. అది వారి భవిష్యత్తుకు మంచి పునాదిగా మారుతుందనే ఉద్దేశం. కొందరు విద్యార్థులైతే సొంతంగా అకాడమీలు పెట్టుకున్నారు.

ఎన్టీఆర్ అద్భుతమైన డ్యాన్సర్...

చిన్నప్పుడు జూనియర్ ఎన్టీఆర్ ఎన్నో నాట్య ప్రదర్శనలు ఇచ్చాడు. అతని నాట్యానికి నేను గాత్రం అందించేదాన్ని. అతను ఎంతో అద్భుతంగా డ్యాన్స్ చేసేవాడు. ప్రతి కార్యక్రమానికీ వెంట వాళ్ల అమ్మ షాలిని గారు వచ్చేవారు. జూనియర్ ఎన్టీఆర్ చివరి నాట్య ప్రదర్శనకు కూడా నేనే పాడాను. మద్రాసు తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిందా కార్యక్రమం. కొన్నిట్లోనైతే వయొలిన్, గాత్రం రెండూ నేనే. అతను చాలా మంచి పిల్లవాడు. పెద్దలను గౌరవించేవాడు. కానీ తెగ అల్లరి చేసేవాడు. నన్ను 'సుబ్బలక్ష్మి గారూ' అనేవాడు. అప్పట్లో నల్లకుంట శంకరమఠం వెనకాల వాళ్ల ఇల్లు. రిహార్సల్స్ కోసం వాళ్లింటికి వెళ్లేదాన్ని. తిరిగి వచ్చేటప్పుడు 'నేనూ వస్తా ఉండండి' అంటూ నా వయొలిన్ పట్టుకుని, ఆటో మాట్లాడి మరీ నన్ను పంపించేవాడు. వాళ్లమ్మగారు చాలా మంచి వ్యక్తి. నేనే కాదు, మా పిల్లలందరూ వాళ్లకు బాగా తెలుసు. తరువాత మెహదీపట్నంలో ఇల్లు కొనుక్కొని వెళ్లిపోయారు. అయితే అతను హీరో అయ్యాక మళ్లీ కలవలేదు. జూనియర్ ఎన్టీఆర్ ఎంత అల్లరి చేసినా... డ్యాన్స్ దగ్గరకు వచ్చేసరికి దున్నేసేవాడు. వాళ్ల తాతయ్య ఎన్టీ రామారావు గారి సినిమాలో మయసభ సన్నివేశం డైలాగులు గుక్క తిప్పుకోకుండా చెప్పేవాడు.



బాలమురళీ గారి పక్కన...

ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో మధుర జ్ఞాపకాలు. అన్నిటికంటే తీపి జ్ఞాపకం... మంగళంపల్లి బాలమురళీ గారి కచేరీకి నేను వయొలిన్ వాయించడం. నాకు పదకొండేళ్లు వచ్చేసరికి ఆయన మద్రాసు వెళ్లిపోయారు. ఆ తరువాత ఎన్నో ఏళ్లకు ఆయన సమక్షంలో నా విద్య ప్రదర్శించే అవకాశం లభించింది. అదీ అనూహ్యంగా. సింగపూర్‌లో తెలుగు మహాసభలకు వనజ గారితో గాయక్ అసిస్టెంట్‌గా వెళ్లాను. అయితే బాలమురళీ గారు తన కచేరీకి మాట్లాడుకున్న వయొలిన్ కళాకారుడు రాలేదు. 'హైదరాబాద్ నుంచి ఒకావిడ వచ్చారండి. ఆవిడ వయొలినిస్ట్' అని నిర్వాహకులు ఆయనకు చెప్పారు. బాలమురళీ గారు 'ఆవిడను వెంటనే రమ్మనండి' అన్నారు. వెళితే... 'నా పక్కన వయొలిన్ వాయించమ్మా' అన్నారు. నాకు కంగారు పుట్టింది. 'మీ పక్కన కూర్చొని వయొలిన్ వాయించగలనా? నేను చిన్నప్పుడు మీ విద్యార్థిని' అని గుర్తు చేశాను. 'మీ నాన్న, పెదనాన్న అందరూ తెలుసులే. నువ్వేం భయపడక్కర్లేదు' అని ధైర్యం చెప్పారు. ఆ ధైర్యంతో తడబాటు లేకుండా వాయించి ఆయన ప్రశంసలు అందుకున్నాను.

▸▸ త్యాగరాజ ఆరాధనోత్సవాలు...

మా విద్యాలయానికి వచ్చేవారిలో డబ్బు ఇవ్వగలిగినవారి నుంచే ఫీజు తీసుకొంటాను. సంగీతాభిరుచి కలిగి, డబ్బు ఇవ్వలేనివారికి ఉచితంగానే నేర్పిస్తున్నాను. అలాగే ఏటా మా సొంత ఖర్చులతో 'త్యాగరాజ ఆరాధనోత్సవాలు' నిర్వహిస్తున్నాం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి కళాకారులు పంచరత్నాలు పాడతారు. అలాగే 'థిల్లానా' పేరుతో యూట్యూబ్ చానల్ ప్రారంభించి, దాని ద్వారా సంగీతం నేర్పే ప్రయత్నం చేస్తున్నాను. అరవై ఏళ్లకు పైగా సంగీతంతోనే కలిసి, సంగీతమే ప్రపంచంగా ప్రయాణిస్తున్నాను. ఇది నాకు కలిగిన అదృష్టంగా భావిస్తున్నాను."


● హనుమా

నవ్య | చిత్రజ్యోతి



మరోసారి 'మా' అధ్యక్షుడిగా

మా (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) అధ్యక్ష పదవిలో మంచు విష్ణు తాత్కాలికంగా మరి కొంతకాలం కొనసాగనున్నారు. ఈ మేరకు ఆదివారంనాడు జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఒక నిర్ణయం తీసుకున్నామని 'మా' ఉపాధ్యక్షులు మాదాల రవి తెలియజేశారు. 'మా' అసోసియేషన్ ఫండ్ రైజింగ్ కోసం జూలైలో మలేసియాలో ఒక ఈవెంట్ నిర్వహిస్తున్నామని, అదేవిధంగా 'మా' కోసం ప్రత్యేక భవంతిని నిర్మించడానికి సన్నాహాలు ప్రారంభించామని, అప్పటి వరకు మంచు విష్ణుని అధ్యక్షుడుగా ప్రస్తుతం ఉన్న కార్యవర్గం సహా కొనసాగాలని జనరల్ బాడీ తీర్మానించిందని ఆయన తెలియజేశారు. 2021 అక్టోబర్‌లో జరిగిన 'మా' ఎన్నికల్లో ప్రకాశ్‌రాజ్‌పై విష్ణు గెలుపొందారు. రెండేళ్లకోసారి 'మా' ఎన్నికలు నిర్వహిస్తారు. ఆ ప్రకారం గతేడాది సెప్టెంబర్‌లోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కానీ ఈ ఏడాది మే నెలకు కమిటీ ఎన్నికలను వాయిదా వేశారు. ఇంకో నెలలో ఎన్నికలకు సిద్ధమవ్వాల్సిన తరుణంలో 'మా' జనరల్ బాడీ ఈ నిర్ణయం తీసుకుంది.



సేనాపతి రాకకు సిద్ధం

కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') చిత్రం సంచలన విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. వీరిద్దరి కలయికలో ఆ చిత్రానికి సీక్వెల్‌గా 'ఇండియన్ 2' రూపొందుతోంది. సుభాస్కరన్ నిర్మాత. ఈ చిత్రాన్ని జూన్‌లో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో సేనాపతిగా కమల్‌హాసన్ సీరియస్ లుక్‌లో కనిపించారు. 'తప్పును అస్సలు భరించలేను' అని పోస్టర్‌పై రాసి ఉన్న వాక్యం సినిమాపై అంచనాలు మరింత పెంచింది. ఈ చిత్రంలో సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, ప్రియా భవానీ శంకర్, ఎస్.జే సూర్య కీలకపాత్రలు పోషిస్తున్నారు. అనిరుద్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రవివర్మన్



నేడు జాతీయ ఉత్తమ నటుడు అల్లు అర్జున్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'పుష్ప 2: ది రూల్' చిత్రం నుంచి స్పెషల్ లుక్‌ను ఆదివారం యూనిట్ విడుదల చేసింది. అలాగే ఈ రోజు 'పుష్ప 2' టీజర్‌ను విడుదల చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ తెలిపాయి.

రాధిక తరహాలో జానకి



అశ్విని శ్రీ ప్రధాన పాత్ర పోషిస్తున్న లేడీ ఓరియంటెడ్ చిత్రం 'మిస్ జానకి'. ఇటీవలే పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తం షాట్‌కు నిర్మాత సీ కల్యాణ్ క్లాప్ ఇచ్చారు. సతీశ్ కుమార్ దర్శకత్వంలో నాగరాజు నెక్కంటి నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ 'ఈ నెల 20 నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తాం. రెండు షెడ్యూల్స్‌లో చిత్రీకరణ పూర్తిచేస్తాం' అన్నారు. 'ఈ చిత్రంతో హీరోయిన్‌కు మంచి పేరు వస్తుంది. 'డీజే టిల్లు' చిత్రంలో రాధిక తరహాలో అశ్విని శ్రీ పాత్ర కూడా ప్రేక్షకులను అలరిస్తుంది' అని దర్శకుడు చెప్పారు. అలీ, తనికెళ్ల భరణి, చిత్రం శ్రీను కీలకపాత్రలు పోషిస్తున్నారు. శ్రీ వసంత్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: లక్ష్మీ కుమార్

దసరాకు వస్తున్న వేటగాడు



రజనీకాంత్ కథానాయకుడిగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'వేట్టయాన్'. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. అమితాబ్‌బచ్చన్, ఫహాద్ ఫాజిల్, రానా కీలకపాత్రలు పోషిస్తున్నారు. మేకర్స్ ఈ చిత్రం రిలీజ్ డేట్ అప్డేట్‌ను ఇచ్చారు. దసరా సందర్భంగా అక్టోబర్‌లో 'వేట్టయాన్' చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రివాల్వర్ గురిపెట్టిన రజనీకాంత్ స్టిల్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్

శబరి రాక అప్పుడే



వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'శబరి'. అనిల్ కాట్జ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మహేంద్రనాథ్ కూండ్ల నిర్మాత. 'శబరి' విడుదల తేదీ ఖరారైంది. మే 3న ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ సహా పలు భారతీయ భాషల్లో విడుదల చేస్తున్నట్లు ఆదివారం మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "శబరి' కథ, కథనం కొత్తగా ఉంటాయి. ఎమోషనల్ థ్రిల్లర్. వరలక్ష్మీ శరత్‌కుమార్ గత చిత్రాలకు భిన్నంగా ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే చిత్రమిది' అన్నారు. సునయన, వైవా హర్ష, భద్రం కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: గోపీసుందర్, సినిమాటోగ్రఫీ: రాహుల్ శ్రీవాత్సవ

నెగెటివ్ ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు



విజయ్‌దేవరకొండ హీరోగా నటించిన 'ఫ్యామిలీ స్టార్' సినిమా ఇటీవలే విడుదలై మంచి టాక్‌తో దూసుకుపోతోంది. కాగా, ఈ సినిమా ఏమాత్రం బాలేదని కొందరు సోషల్ మీడియాలో నెగెటివ్ ప్రచారం చేస్తున్నారు. ఈ సినిమాపై ఇలా దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విజయ్‌దేవరకొండ పర్సనల్ మేనేజర్ అనురాగ్ పర్వతనేని, ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నిశాంత్‌కుమార్ కలసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొందరు కావాలనే ఇలా నెగెటివ్ ప్రచారం చేయడం వల్ల సినిమా వసూళ్లపై ప్రభావం పడుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసుని విచారించి నిందితులని పట్టుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారు.



టీడీపీ ఆఫీస్‌ని తగలబెట్టే యత్నం

- పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరులో పేట్రేగిన వైసీపీ మూక
- కార్యాలయానికి ముందు ఏర్పాటు చేసిన తాటాకు పందిరికి నిప్పు
- భారీ మంటలతో దహమైన పందిరి.. ఫైర్ ఇంజన్ల రాకతో ఆఫీస్ సేఫ్

పెదకూరపాడు, ఏప్రిల్ 7: పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం పరిధిలోని క్రోసూరులో ఉన్న టీడీపీ కార్యాలయాన్ని తగల బెట్టేందుకు అధికార పార్టీ వైసీపీ కార్యకర్తలు ప్రయత్నించారు. కార్యాలయం ముందు భాగంలో ఏర్పాటు చేసిన తాటాకు పందిరికి ఆదివారం రాత్రి 11:30 గంటల సమయంలో నిప్పు పెట్టారు. దీంతో భారీ ఎత్తున మంటలు ఎగిసి పడి పందిరిపూర్తిగా కాలిపోయింది. అయితే.. ఈ మంటలు కార్యాలయానికి అంటుకునే లోగా ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చి.. మంటలను అదుపు చేశారు. దీంతో కార్యాలయానికి మంటలు వ్యాపించినా భారీ ప్రమాదం తప్పింది.

ఏం జరిగిందంటే..

శనివారం సాయంత్రం క్రోసూరులో జరిగిన ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు స్థానిక వైసీపీ ఎమ్మెల్యే శంకర్రావుపై విమర్శలు చేశారు. అయితే.. ఈ విమర్శలను ఖండిస్తూ ఎమ్మెల్యే శంకర్రావు ఆదివారం చంద్రబాబును విమర్శించారు. ఇక, టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ శంకర్రావు విమర్శలను ఖండిస్తూ మీడియా సమావేశం పెట్టారు. దీంతో పెదకూరపాడులో ఇరు పక్షాల మధ్య రాజకీయం వేడెక్కింది. భాష్యం వ్యాఖ్యలకు నిరసనగా వైసీపీ కార్యకర్తలు అర్ధరాత్రి వేళ క్రోసూరులోని టీడీపీ కార్యాలయాన్ని తగల బెట్టేందుకు ప్రయత్నించారు. ముందున్న పందిరికి నిప్పంటించారు. దీంతో మంటలు రాజుకుని పందిరిపూర్తిగా తగలబడిపోయింది. ఇంతలో సమాచారం తెలుసుకున్న భాష్యం ప్రవీణ్, టీడీపీ కార్యకర్తలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంతలో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో టీడీపీ కార్యాలయానికి పెను ప్రమాదం తప్పింది. వైసీపీ కార్యకర్తల దుర్మార్గాన్ని ఖండిస్తూ క్రోసూరు నాలుగురోడ్ల కూడలిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు.

కేరళ విద్యార్థి మృతి కేసులో సీబీఐ దర్యాప్తు షురూ..

- 29 గంటల పాటు సిద్ధార్థన్‌కు సీనియర్లు, సహ విద్యార్థుల చిత్రహింసలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: కేరళలో సంచలనం రేపిన వెటర్నరీ విద్యార్థి మృతి కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) దర్యాప్తు ప్రారంభించింది. వయనాడ్‌లోని వెటర్నరీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న జేఎస్ సిద్ధార్థన్ ఈ ఏడాది ఫిబ్రవరి 18న హాస్టల్ బాత్రూంలో శవమై కనిపించాడు. అధికార పార్టీ సీపీఎంకు చెందిన స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) కార్యకర్తలు, ఇతర విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో సిద్ధార్థన్‌ను హింసించడంతోనే ఆత్మహత్య చేసుకున్నాడంటూ అతడి కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఒక్కసారిగా రాజకీయ దుమారం చెలరేగింది. తొలుత అసహజ మరణంగా కేసు నమోదు చేసిన వైతిరి పోలీసులు.. ఆ తర్వాత సిద్ధార్థన్ ఆత్మహత్యకు 20 మంది విద్యార్థులు కారణమంటూ వారిపై కేసులు నమోదు చేశారు. ఈ కేసులో పలువురిని ఇప్పటికే అరెస్టు చేశారు. ఆత్మహత్యకు ముందు సిద్ధార్థన్‌ను సీనియర్లు, సహ విద్యార్థులు దారుణంగా హింసించారని.. దాదాపు 29 గంటల పాటు మానసికంగా, శారీరకంగా చిత్రహింసలకు గురి చేశారని కేసు ఫైల్‌లో పేర్కొన్నట్లు తాజాగా బయటికొచ్చింది. మరోవైపు, అసలు దోషులను అధికార పార్టీ సీపీఎం కాపాడుతోందని సిద్ధార్థన్ తండ్రి ఆవేదన వ్యక్తం చేస్తూ.. కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలంటూ కేరళ హైకోర్టును ఆశ్రయించారు. కేసును సీబీఐకి అప్పగిస్తామని సీఎం పినరయి విజయన్ కూడా హామీనిచ్చారు. అయితే కేసు ఫైళ్లను సీబీఐకి అప్పగించకపోవడంపై.. కావాలనే కాలయాపన చేస్తున్నారంటూ ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ మండిపడ్డాయి. ఈ నేపథ్యంలోనే శుక్రవారం విచారణ సందర్భంగా.. కేసు విచారణను తక్షణమే సీబీఐకి అప్పగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేయాలంటూ హైకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. దీంతో శుక్రవారం రాత్రే సీబీఐ మళ్లీ ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. దర్యాప్తును మొదలుపెట్టింది.

ఠాణాలో దాచిన గంజాయి ఎలుకలు తినేశాయి

ధన్‌బాద్, ఏప్రిల్ 7: ఝార్ఖండ్ ధన్‌బాద్ జిల్లాలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో భద్రపరచిన 9 కేజీల గంజాయి, 10 కేజీల భంగును ఎలుకలు తినేశాయి. ఆరేళ్ల క్రితం నాటి ఓ కేసులో పట్టుబడిన గంజాయి, భంగును శనివారం కోర్టులో ప్రవేశపెట్టవలసి ఉండగా సదరు అధికారి జడ్జికి ఈ విషయం చెప్పారు. వివరాల్లోకి వెళ్తే... 2018, డిసెంబర్ 14న రాజ్‌గంజ్ పోలీసులు శంభుప్రసాద్ అగర్వాల్ అనే వ్యక్తిని, అతని కొడుకుని నార్కొటిక్స్ కేసులో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 10 కేజీల భంగు, 9 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అయితే విచారణలో భాగంగా సీజ్ చేసిన సరుకును ఏప్రిల్ 6న కోర్టులో ప్రవేశపెట్టవలసి ఉంది. దర్యాప్తు అధికారి మాత్రం స్టోర్ రూంలో భద్రపరిచిన గంజాయి, భాంగ్‌ను ఎలుకలు తినేసినట్లు తెలిపారు.

సువిధ పోర్టల్‌కు 73,379 దరఖాస్తులు

- 44,626 అప్లికేషన్లకు అనుమతి
- ఏపీ నుంచి 1,153, తెలంగాణలో 836 దరఖాస్తులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిన సువిధ పోర్టల్‌కు పెద్దఎత్తున దరఖాస్తులు వస్తున్నాయి. లోక్‌సభ, శాసనసభ బరిలో నిలిచే అభ్యర్థులు అన్నిరకాల అనుమతుల కోసం సువిధలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఎన్నికల సమావేశాల నిర్వహణ, ర్యాలీలు, ప్రదర్శనలు, వాహనాల అనుమతులు, తాత్కాలిక ఎన్నికల కార్యాలయం, లౌడ్ స్పీకర్లు, హెలికాప్టర్లు, హెలిప్యాడ్ల వినియోగం వంటి వాటికి సువిధలోనే దరఖాస్తు సమర్పించవచ్చు. దేశవ్యాప్తంగా ఆదివారం వరకు సువిధ కు 34 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కలిపి 73,379 దరఖాస్తులు వచ్చినట్టు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ నుంచి 1,153, తెలంగాణ నుంచి 836 దరఖాస్తులు వచ్చాయని పేర్కొంది. దేశంలోని ఏ మారుమూల ప్రాంతం నుంచైనా సువిధ ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపింది.

ప్రయివేటు సంస్థకు బీబీసీ బాధ్యతలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: ఐటీ దాడులు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనల్లో సవరణలు జరిగిన దృష్ట్యా ప్రముఖ వార్తా సంస్థ 'బీబీసీ' తన నిర్వహణ విధానంలో భారీగా మార్పులు తీసుకొచ్చింది. భారత్‌లో వార్తల ప్రచురణ నిమిత్తం తనకు లభించిన పబ్లిషింగ్ లైసెన్సును విడిచిపెట్టుకొంది. దానిని భారతీయ ఉద్యోగులు నిర్వహిస్తున్న ప్రయివేటు లిమిటెడ్ కంపెనీకి అప్పగించింది. బీబీసీ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఇదే ప్రథమం. ఈ నూతన విధానం వచ్చే వారం నుంచి అమల్లోకి రానుంది. గతంలో బీబీసీలో పని చేసిన నలుగురు మాజీ ఉద్యోగులు నెలకొల్పిన 'కలెక్టివ్ న్యూస్‌రూం' సంస్థకు తన పబ్లిషింగ్ లైసెన్సింగ్‌ను అప్పగించింది. ఆ సంస్థే బీబీసీ తెలుగు సహా 7 భాషల్లో అందించే భారతదేశ వార్తలకు బాధ్యత తీసుకోనుంది.

సోరెన్ కేసులో సాక్ష్యాలుగా ఫ్రిజ్, టీవీ బిల్లులు

రాంచీ, ఏప్రిల్ 7: ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ మనీ లాండరింగ్ కేసులో ఓ స్మార్ట్‌టీవీ, ఫ్రిజ్ బిల్లులే ఇప్పుడు కీలక సాక్ష్యాలుగా మారాయి. ఈ నెల 4న రాంచీలోని పీఎంఎల్ఏ స్పెషల్ కోర్టుకు సమర్పించిన 191 పేజీల చార్జ్‌షీట్‌లో ఈడీ ఆ వివరాలను అందజేసింది. రాంచీలోని 8.86 ఎకరాల భూమిని హేమంత్ సోరెన్ అక్రమంగా సంపాదించారని ఈడీ అభియోగాలు మోపిన విషయం తెలిసిందే. అయితే.. సోరెన్ మాత్రం ఆ భూమితో తనకు ఎలాంటి సంబంధాల్లేవని వాదించారు. రాజ్‌కుమార్ పహాన్ అనే వ్యక్తి పేరిట ఆ భూమి ఉన్నట్లు వివరించారు. అయితే, ఆ భూమి సోరెన్ కుటుంబ సభ్యుడు సంతోష్ ఆధీనంలోనే ఉందని నిరూపించే ఆధారాలను ఈడీ సేకరించింది. 2017 ఫిబ్రవరిలో కొనుగోలు చేసిన ఓ రిఫ్రిజిరేటర్, 2022 నవంబరులో కొన్న ఓ స్మార్ట్‌టీవీ ఇన్వాయిస్‌ల ద్వారా ఆ భూమి సోరెన్‌దేనని నిరూపించేలా ఆధారాలను తాజా చార్జ్‌షీట్‌తో జత చేసింది.

ఉన్నత విద్యకు ఉరి!



ఒకే పోస్టుకు రెండుసార్లు నోటిఫికేషన్లు, జీవోలివ్వడం.. తర్వాత పోస్టుల భర్తీని మర్చిపోవడమనే విధానం జగన్ ప్రభుత్వానికి అలవాటుగా మారింది!. 2021 జూన్ 14... ఆ రోజున జగన్ ప్రభుత్వం ఏకైకంగా ఒకే ఒక్క జాబ్ క్యాలెండర్ విడుదల చేసింది. 10,143 పోస్టులతో విడుదల చేసిన ఆ జాబ్ క్యాలెండర్‌లో 2వేల అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులున్నాయి. 2023 అక్టోబరు 11.. రాష్ట్రంలో 18 వర్సిటీల్లో పోస్టుల భర్తీకి అనుమతిస్తూ ఉన్నత విద్యాశాఖ జీవోలు జారీచేసింది. అనంతరం వర్సిటీలు అందుకు అనుగుణంగా నోటిఫికేషన్లు జారీచేశాయి. ఇందులో 2వేలు అసిస్టెంట్ ప్రొఫెసర్, 1280 ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులున్నాయి. అదేంటి 2021 జాబ్ క్యాలెండర్‌లోనే భర్తీచేసిన పోస్టులకు 2023లో మళ్లీ నోటిఫికేషన్లు ఎలా ఇచ్చారనే సందేహం కలుగుతోందా? జగన్ ప్రభుత్వంలో అంతే!! ఆ తర్వాత జాబ్ క్యాలెండర్‌లోని పోస్టులు ఏమయ్యాయో ఎవరికీ తెలియదు. మళ్లీ కొన్నాళ్లకు అవే పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేస్తారు. చివరికి అవీ భర్తీ కావు. ఇదీ జగన్ ప్రభుత్వంలో పోస్టుల భర్తీ విధానం!!

- పోస్టుల భర్తీపై మాట తప్పిన జగన్
- నాలుగేళ్లు చోద్యం చూసి చివర్లో నోటిఫికేషన్లు
- ఆగిపోయిన మొత్తం భర్తీ ప్రక్రియ
- వర్సిటీల్లో ఉన్న బోధనా సిబ్బంది 20శాతమే
- 2021 జాబ్ క్యాలెండర్‌లో పెట్టినా భర్తీ చేయలేదు
- ఆచార్యుల్లేకుండానే సా.. గుతున్న బోధన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రైవేటు కాలేజీలు, యూనివర్సిటీల్లో చదవలేని విద్యార్థులకు ప్రభుత్వ యూనివర్సిటీలు, యూనివర్సిటీ కాలేజీలే పెద్దదిక్కులా ఉంటాయి. అందులోనూ యూనివర్సిటీ కాలేజీలంటే నిపుణులైన బోధనా సిబ్బంది ఉంటారని, మెరుగైన సౌకర్యాలుంటాయని ఒక అంచనా ఉంటుంది. అలాంటి యూనివర్సిటీలను బోధనా సిబ్బంది లేకుండా జగన్ ప్రభుత్వం భ్రష్టుపట్టించింది. 4,230 బోధనా సిబ్బంది పోస్టుల్లో 3,300 పోస్టులు ఖాళీగా ఉంచి ఉన్నత విద్యా కోర్సుల బోధన చేయిస్తోంది. ఆర్జీయూకేటీలతో సహా మొత్తం రాష్ట్రంలో ఉన్న 18 యూనివర్సిటీల్లో 4230 పోస్టులున్నాయి. అందులో ప్రొఫెసర్ 598, అసోసియేట్ ప్రొఫెసర్ 1080, అసిస్టెంట్ ప్రొఫెసర్ 2224 పోస్టులున్నాయి. అందులో పనిచేస్తున్నవారి వివరాలు చూస్తే ప్రొఫెసర్ 316, అసోసియేట్ ప్రొఫెసర్ 199, అసిస్టెంట్ ప్రొఫెసర్ 533 మంది మాత్రమే. 3వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంటే సుమారు 80శాతం పోస్టులు ఖాళీగా ఉంటే, 20శాతం పోస్టుల్లేనే బోధనా సిబ్బంది పనిచేస్తున్నారు.

న్యాయ వివాదాలు పరిష్కారమైనా..

యూనివర్సిటీల్లో పోస్టుల భర్తీకి గతంలో న్యాయ వివాదాలుండేవి. ఆ వివాదాలు ఈ ప్రభుత్వంలో పరిష్కారమయ్యాయి. వెంటనే ఆ పోస్టులు మొత్తం భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. హడావుడిగా 2021లో విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌లో 2వేల అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను చూపించింది. ఆ తర్వాత ఉన్నత విద్యామండలి నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. చివరికి రేషనలైజేషన్ పూర్తిచేసి 2023 చివర్లో నోటిఫికేషన్లు జారీ చేసింది. అయితే అప్పటివరకూ ఉన్న న్యాయ వివాదాలను ఉన్నత విద్యామండలి తిరిగి తెచ్చిపెట్టింది. మొత్తం నిబంధనలను తుంగలో తొక్కి సొంత రోస్టర్ విధానాన్ని అమలుచేసి, మళ్లీ న్యాయ వివాదాలతో ప్రక్రియ ఆగిపోయేలా చేసింది. ఒకే వర్సిటీలో రెండు రకాల రిజర్వేషన్ విధానం ప్రవేశపెట్టడంపై అధ్యాపకులు కోర్టును ఆశ్రయించడంతో భర్తీ ఆదిలోనే ఆగిపోయింది.

ఇష్టంలేకే వివాదాలు

అయితే ప్రభుత్వ ఆదేశాలతోనే రోస్టర్‌ను ఉన్నత విద్యామండలి గందరగోళం చేసిందనే అనుమానాలు, విమర్శలు వస్తున్నాయి. యూనివర్సిటీలను రాజకీయ కేంద్రాలుగా మార్చిన జగన్ ప్రభుత్వానికి తొలినుంచీ పోస్టుల భర్తీపై ఆసక్తి లేదు. అందుకే ఒకే పోస్టుకు మళ్లీ మళ్లీ నోటిఫికేషన్లు జారీచేయించినా ప్రక్రియ మాత్రం చేపట్టలేదు. అందులోనూ ఉన్నత విద్యామండలిలో కీలక స్థానాల్లో ఉన్న వారితోనే రేషనలైజేషన్ కమిటీలు వేసినా రోస్టర్‌ను ఇష్టమొచ్చినట్లు మార్చడంతో ప్రభుత్వ డైరెక్షన్‌తోనే ఇలా నిబంధనలకు విరుద్ధంగా చేశారన్న అనుమానాలు బలపడుతున్నాయి.

యూనివర్సిటీల్లో సీట్లు ఖాళీ

యూనివర్సిటీల కాలేజీల్లో ఒకప్పుడు సీట్లు హాట్ కేకుల్లా భర్తీ అయ్యేవి. కానీ బోధనా సిబ్బంది కొరతతో కొన్నేళ్లుగా వర్సిటీల కాలేజీల్లోనూ సీట్లు మొత్తం భర్తీకావడంలేదు.. 2023-24 విద్యా సంవత్సరంలో యూనివర్సిటీల కాలేజీల్లో 7455 ఇంజనీరింగ్ సీట్లు ఉంటే 5813 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. అదే రాష్ట్రంలోని ప్రైవేటు యూనివర్సిటీల్లో కన్వీనర్ కోటా కింద 4103 ఇంజనీరింగ్ సీట్లు ఉంటే, 3811 సీట్లు తొలి విడతలోనే నిండాయి. ఇక మేనేజ్‌మెంట్ కోటా సీట్లయితే ఒక్కటి కూడా మిగలడం లేదు. ఇలా ప్రైవేటు యూనివర్సిటీల్లో సీట్లు మొత్తం భర్తీ అయిపోతుంటే, ప్రభుత్వ యూనివర్సిటీల్లో సీట్లు భారీగా మిగిలిపోతున్నాయి.

పీజీ కోర్సులదీ అదే దారి!

యూనివర్సిటీల్లో పీజీ కోర్సులు కూడా దారుణంగా పడిపోయాయి. గత ప్రభుత్వంలో ఇతరత్రా కోర్సులతో పాటు పీజీ కోర్సులకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించింది. జగన్ ప్రభుత్వంలో అక్రమాలంటూ పీజీ కోర్సులకు రీయింబర్స్‌మెంట్ ఆపేశారు. కేవలం ప్రభుత్వ యూనివర్సిటీ కాలేజీలకే రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తున్నారు. ప్రైవేటుకు రీయింబర్స్‌మెంట్ రద్దుచేసినా విద్యార్థులు యూనివర్సిటీల్లో చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. అంటే బోధనా సిబ్బంది సరిపడిన స్థాయిలో లేకపోవడమే అని అర్థమవుతోంది.



పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు, పట్టుబడిన నగదు

రైలులో రూ.4 కోట్లు స్వాధీనం

- బీజేపీ నేత హోటల్ నుంచి తరలించినట్టు గుర్తింపు, ముగ్గురి అరెస్టు

చెన్నై, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఎగ్మూరు నుంచి తిరునల్వేలి వెళ్తున్న నెల్లై ఎక్స్‌ప్రెస్‌లో రూ.4 కోట్ల నల్లధనం పట్టుబడింది. దీనిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసిన పోలీసులు.. ఈ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు జరుపుతున్నారు. కాగా బీజేపీ ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్‌కు చెందిన హోటల్ నుంచే ఈ నగదు తరలించినట్టు పోలీసులు గుర్తించారు. అయితే ఆ డబ్బుతో తనకెలాంటి సంబంధం లేదని నయినార్ నాగేంద్రన్ పేర్కొన్నారు. శనివారం రాత్రి 8.10 గంటలకు ఎగ్మూర్ నుంచి తిరునల్వేలికి బయలుదేరిన నెల్లై ఎక్స్‌ప్రెస్‌లో భారీగా నగదు తరలిస్తున్నారని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సెంథిల్ పాల్ మణి, డిప్యూటీ కమిషనర్ పవన్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని బృందం తాంబరం రైల్వేస్టేషన్‌లో కాపుకాసింది. 8.40 గంటలకు రైలు చేరుకోగానే పోలీసులు రైలు మొత్తాన్ని జల్లెడపట్టారు. ఎస్7 బోగీలో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు చెందిన ఆరు బ్యాగులను తనిఖీ చేయగా, అందులో నుంచి భారీగా రూ.500 నోట్ల కట్టలు బయల్పడ్డాయి. దీంతో ఆ ముగ్గురినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు.. నగదును తాంబరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఆ మొత్తాన్ని లెక్కించగా సుమారు రూ.4 కోట్లు ఉన్నట్లు తేలింది. ఆ ముగ్గురినీ సతీష్, నవీన్, పెరుమాళ్‌గా గుర్తించిన పోలీసులు.. వారిని విచారించారు.

నామక్కల్ జిల్లాలో 10 కిలోల బంగారం స్వాధీనం

చెన్నై, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా రాశిపురంలో మల్లూరు వద్ద ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ 10 కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుంది. ఈ నగలకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగలను రాశిపురం తహశీల్దారు కార్యాలయంలో అప్పగించారు. శనివారం రాత్రి సేలం-మదురై మార్గంలో అధికారులు తనిఖీ చేయగా, ఓ కారులో ఈ నగలు పట్టుబడ్డాయి. వీటితో కొన్ని వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాల విలువ రూ.7.86 కోట్లు ఉంటుందని వారు వివరించారు.



స్వాధీనం చేసుకున్న డబ్బు, బంగారం, వెండి ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ రంజిత్‌కుమార్ భండారి

బళ్లారిలో భారీగా నగదు, బంగారం, వెండి స్వాధీనం

- హవాలా దందా నడుపుతున్న వ్యాపారి ఇంట్లో పోలీసుల సోదాలు
- 5.60 కోట్ల నగదు, 3 కిలోల బంగారం, 130 కిలోల వెండి పట్టివేత

బళ్లారిరూరల్, ఏప్రిల్ 7: కర్ణాటక రాష్ట్రం బళ్లారి నగరంలోని పూల మార్కెట్ సమీపంలో ఉన్న బంగారం దుకాణం యజమాని ఇంట్లో పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించి, భారీగా నగదు, బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నారు. బళ్లారి డీఎస్పీ చంద్రకాంత్‌నందరెడ్డి, సీఐ సిందూర్ నేతృత్వంలో పూలమార్కెట్ వద్ద ఉన్న హేమా జ్యువెలర్స్ యజమాని నరేష్ సోనీ ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.5.60 కోట్ల నగదు, మూడు కిలోల బంగారం బిస్కెట్లు, 130 కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బళ్లారి ఎస్పీ రంజిత్‌కుమార్ భండారి మీడియాతో మాట్లాడుతూ.. నరేష్ సోనీ హవాలా దందా నడుపుతున్నట్టు సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించామని తెలిపారు.

40 మంది మహిళలకు లైంగిక వేధింపులు



- ట్యాపింగ్‌లో ఘరానా కానిస్టేబుల్ నిర్వాకం
- కొందరి డేటా సేకరించి వ్యక్తిగత అంశాల్లోకి చొరబాటు
- నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులో వార్ రూం
- మిల్లర్లు, స్మగ్లర్స్, పేకాటరాయుళ్ల నుంచి భారీ వసూళ్లు
- ఓ పోలీస్ అధికారి 9 ఎకరాల విక్రయంలో సాయం
- మునుగోడు ఉప ఎన్నిక సమయంలోనూ ప్రమేయం
- రూ.కోట్లలో అక్రమార్జన
- విచారణలో బయటకు?
- టాస్క్‌లు, ఆపరేషన్ల గుట్టువిప్పుతున్న రాధాకిషన్‌రావు
- కస్టడీ మరో 3 రోజులు.. నాయకుల చుట్టూ ఉచ్చు

కానిస్టేబుల్.. పోలీస్ శాఖలో కిందిస్థాయి ఉద్యోగి. కానీ, ఇతడు మాత్రం ఘరానా కానిస్టేబుల్..! బెదిరింపులు.. వసూళ్లు.. సెటిల్‌మెంట్లు.. దందాలు.. అన్నింట్లోనూ పాత్ర..! ఓ దశలో జిల్లా ఎస్పీకి అతడు ఎంత చెబితే అంత! ఆడిందే ఆట పాడిందే పాటగా పెత్తనం సాగిస్తూ డీఎస్పీలు, సీఐలకే హడల్ పుట్టించాడు. ఇదే క్రమంలో 'ఫోన్ ట్యాపింగ్' టీంలోకీ అతడిని తీసుకున్నారు. దీని మాటున చెలరేగిపోయాడు. మహిళల వ్యక్తిగత విషయాలు సేకరించి వారి జీవితాలతో ఆడుకున్నాడు. 40 మందిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు.

నల్లగొండ, హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇటీవల నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లను వెస్ట్‌జోన్ పోలీసులు అదుపులోకి తీసుకొని హైదరాబాద్ తీసుకొచ్చారు. వీరిలో ఒకరు రౌడీ షీటర్లతో కలిసి సెటిల్‌మెంట్స్, గంజాయి కేసు నిందితులు, పేకాట స్థావరాలు నిర్వహించేవారు, ఇతర నేరస్థులను టార్గెట్ చేసి రూ.కోట్లలో వసూళ్లకు పాల్పడినట్లు విచారణలో తేలింది. ఏడాదిన్నర కిందట అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన మునుగోడు ఉప ఎన్నిక సమయంలో ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లుగానూ గుర్తించారు. ఇంకా అనేక ఆరోపణలున్న నేపథ్యంలో అవి నిజమని తేలితే అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. నల్లగొండ కేంద్రంగా సాగిన ఈ తంతుపై వెలుగులోకి వస్తున్న సమాచారం పోలీసు శాఖ, రాజకీయ వర్గాల్లో కలకలం సృష్టిస్తోంది. ట్యాపింగ్ కేసులో నల్లగొండ జిల్లాలో పనిచేస్తున్న ఒక సీఐని విచారించడంతో మొత్తం వ్యవహారం బయటపడింది. ట్యాపింగ్ కోసం నల్లగొండలోని హైదరాబాద్ రోడ్‌లోవార్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు నిర్ధారణ అయింది. దీంతో ఆ భవనంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. వార్ రూమ్‌లో పనిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని కూడా గుర్తించారు. వారినుంచి వివరాలు సేకరించే ప్రక్రియ సాగుతోంది. నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలను యూనిట్‌గా ఏర్పాటు చేసుకుని నల్లగొండలోనే ట్యాపింగ్ సెంటర్ నిర్వహించారని, రెండు జిల్లాల ప్రతిపక్ష నాయకులు, వారి సన్నిహితుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాగా, ట్యాపింగ్‌లో కీలక నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు నల్లగొండ ఎస్పీగా పనిచేశారు. అప్పుడు ఏఎస్పీగా ఉన్న అధికారి తర్వాత ఎస్పీ అయ్యారు. ఆ పరిచయాలతో వివాదాస్పద కానిస్టేబుల్‌ను ట్యాపింగ్ టీమ్‌లో చేర్చుకున్నట్లు సమాచారం. టాస్క్‌ఫోర్స్, సీసీఎస్‌లలో పనిచేసిన ఇతడికి ట్యాపింగ్‌లో కీలక బాధ్యతలివ్వడంతో అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడ్డాడని చర్చ సాగుతోంది.

వివాదాస్పద కానిస్టేబుల్ మొత్తం తొమ్మిది సిమ్‌కార్డులను వినియోగించినట్లు సమాచారం. ఓవైపు రాజకీయ నేతలకు అవసరమైన ఫోన్లతో పాటు, మరోవైపు సొంత వ్యవహారాలకు కూడా ట్యాపింగ్‌ను అడ్డుపెట్టుకున్నట్లు తెలుస్తోంది. మహిళల ఫోన్లను ట్యాప్ చేసి వ్యక్తిగత సంభాషణలు విని లోబర్చుకునేవాడని సమాచారం. తాను కన్నేసిన మహిళలు, ఉద్యోగినులను వేధించాడని చెబుతున్నారు. నల్లగొండ జిల్లాలోని ఓ ఛోటా నాయకుడు అక్రమ వ్యవహారంలో పట్టుబడితే, దానిని అడ్డుపెట్టుకుని ఆయన భార్యను సైతం బ్లాక్‌మెయిల్ చేశాడు. కాగా, ఇతడి బాధితుల్లో కొందరు త్వరలో బయటకు వచ్చి తమ గోడు వెళ్లబోసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. రియల్ వ్యాపారులను టార్గెట్ చేసి భారీగా వసూళ్లకు దిగడంలో వివాదాస్పద కానిస్టేబుల్‌ది కీలక పాత్రగా చెబుతున్నారు. అక్రమ దందాలు చేసే రైస్ మిల్లర్ల నుంచి నెలవారీ మామూళ్లు, పేకాట శిబిరాల నిర్వాహకుల నుంచి వసూళ్లు చేసేవాడనే ఆరోపణలున్నాయి. గుర్రంపోడ్ వద్ద మాజీ పోలీస్ బాస్ బినామీలకు దాదాపు తొమ్మిది ఎకరాల తోటను ఇప్పించడంలో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. కొంతమంది అధికారులనూ భయపెట్టినట్లు సమాచారం.

నాయకుల చుట్టూ బిగుస్తున్న ఉచ్చు!

ట్యాపింగ్ కేసులో అరెస్టయి కస్టడీలో విచారణ ఎదుర్కొంటున్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ (ఓఎస్డీ) రాధాకిషన్‌రావు వెస్ట్ జోన్ పోలీసులకు పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ పెద్దల గుట్టును విప్పుతున్నట్లు సమాచారం. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు, ఇతర ఉన్నతాధికారులు చెప్పినట్లే చేశామని ఆయన ఒప్పుకోవడంతో కేసులో విస్తుపోయే అంశా లు బయటకొస్తున్నాయి. రాధాకిషన్‌రావు పోలీస్ కస్టడీ మరో 3 రోజులు మిగిలి ఉంది. ఆ తర్వాత కేసుతో ప్రమేయం ఉన్న పలువురు రాజకీయ నాయకుల చుట్టూ ఉచ్చు బిగుసుకోనున్నట్లు తెలిసింది. ఎవరెవరు ఎలాంటి పనులు చేయించారు..? దాని వల్ల ఎవరు లబ్ధి పొందారు..? తమ టీమ్‌కు ఇచ్చిన టాస్క్‌లు ఏంటి? సేకరించిన డేటాతో చేయించిన ఆపరేషన్స్ ఏమిటి? అందుకోసం ఎలాంటి కసరత్తు చేశారు..? వాటిని పూర్తి చేయడానికి ఎంతమంది పని చేశారు? ఇలా అనేక అంశాలపై పూర్తి సమాచారాన్ని రాధాకిషన్‌రావు వెల్లడిస్తున్నట్లు చెబుతున్నారు. వీటిని రికార్డు చేస్తున్న విచారణాధికారులు ఆయన చెప్పిన అధికారులు, నాయకుల పేర్లను లిస్టవుట్ చేస్తున్నట్లు సమాచారం. విషయం పలువురు నాయకుల దృష్టికి వెళ్లడంతో.. విచారణను ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. రాధాకిషన్‌రావును అదుపులోకి తీసుకున్నప్పుడు ట్యాపింగ్‌పై ఆయన కూలకషంగా వెల్లడించిన వివరాలను రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్లతో పాటు నల్లగొండ జిల్లాకు ఒకొక్కరు నాయకత్వం వహించి పని పూర్తి చేశారని తెలిపారు. ఇందులోభాగంగానే గత ప్రభుత్వ పెద్దలు ఒకే సామాజికివర్గానికి చెందిన ప్రభాకర్‌రావు, వేణుగోపాల్‌రావు, భుజంగరావు, ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావుతో పాటు.. తిరుపతన్న, ఇంకొందరు ఇన్‌స్పెక్టర్లను ఇంటెలిజెన్స్, ఎస్ఐబీలోకి తెచ్చినట్లు తేలింది.

కిరాతక భర్త

- భార్యను 200 ముక్కలుగా నరికిన యూకే వ్యక్తి
- వారం రోజులు కిచెన్‌లో దాచి.. నదిలో పారవేత
- అంతకుముందు భార్యకు తీవ్రస్థాయి వేధింపులు
- ఆమె పెంపుడు ఎలుకలను చంపి మిక్సీ, ఓవెన్‌లోకి
- వివాహమైన కొన్ని నెలలకే సంసారంలో విభేదాలు
- విడిపోదాం అని అనుకుంటుండగా ఘాతుకానికి..
- ఏడాది సాగిన విచారణ.. నిందితుడికి జీవిత ఖైదు

లండన్, ఏప్రిల్ 7: సరిగ్గా రెండేళ్ల కిందట ఢిల్లీలో వెలుగుచూసిన శ్రద్ధావాకర్ హత్య కేసు గుర్తుందా..? నమ్మి వచ్చిన ఆమెను ప్రేమికుడు అఫ్తాబ్ పూనావాలా అత్యంత కిరాతకంగా హతమార్చి.. శరీరాన్ని ముక్కలుగా చేసి.. ఆ భాగాలను కొన్ని రోజులు ఫ్రిజ్‌లో ఉంచి అనంతరం వివిధచోట్ల పారవేశాడు. దాదాపు ఇలాంటి ఘటనే.. అంతకుమించిన మలుపులతో యూకేలో చోటుచేసుకుంది. లింకన్‌షైర్‌కు చెందిన నికొలస్ మెట్సన్ (28) అనే వ్యక్తి 2022 చివర్లో హోలీ బ్రామ్లీ (26)ని వివాహమాడాడు. అయితే, కొద్ది రోజులకే ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. అవి అంతకంతకూ తీవ్రమయ్యాయి. నిరుడు మార్చిలో మెట్సన్ బెడ్‌రూమ్‌లో బ్రామ్లీని పలు సార్లు పొడిచి చంపాడు. శవాన్ని బాత్ రూంలోకి తీసుకెళ్లి ముక్కలుగా చేశాడు. వాటిని ప్లాస్టిక్ బ్యాగ్‌లో చుట్టి కిచెన్‌లో వారం పాటు ఉంచాడు. తర్వాత స్నేహితుడిని పిలిచి విథమ్ నదిలో పడేశాడు. అయితే, మరునాడు వాకింగ్‌కు వెళ్లిన ఓ వ్యక్తికి నదిలో ప్లాస్టిక్ బ్యాగులు తేలుతూ కనిపించడంతో ఈ దారుణం వెంటనే బయటపడింది. ఈతగాళ్లు నదిలోకి బ్యాగులను తీసి చూడగా మొత్తం 224 శరీర భాగాలు కనిపించాయి. ఇంకా కొన్ని లభించనే లేదు.

భార్య పెంపుడు జంతువులపైనా పైశాచికం

మెట్సన్-బ్రామ్లీ సంసారం సాగింది 16 నెలలే. ఈ వ్యవధిలోనే మెట్సన్ పైశాచికత్వం ఏస్థాయిలో ఉండేదో తెలిపేలా కొన్ని ఘటనలు జరిగాయి. బ్రామ్లీ తన తల్లిని కలిసేందుకు కూడా మెట్సన్ ఒప్పుకోకపోయేవాడు. కాగా, బ్రామ్లీ పెంచుకునే జంతువులపైనా మెట్సన్ తన ఉన్మాదం చూపాడు. ఆమె సాదుకునే ఎలుకలను చంపి ఫుడ్ బ్లెండర్‌లో వేసి అనంతరం ఓవెన్‌లో పెట్టాడు. కొత్తగా కొన్న కుక్క పిల్లను తీసుకెళ్లి వాషింగ్ మెషిన్లో వేశాడు. దీంతో అది మెషీన్‌లోనే ముక్కలైపోయింది. ఈ వేధింపులు భరించలేక బ్రామ్లీ ఓసారి పెంపుడు కుందేళ్లతో కలిసి పారిపోయి పోలీసులను ఆశ్రయించింది. మెట్సన్ నుంచి విడిపోయేందుకు నిర్ణయించుకుంది. ఇంతలోనే మెట్సన్ ఆమెను చంపేశాడు. కాగా, ఆ తర్వాత అతడు.. "నా భార్య చనిపోతే నాకు ఎలాంటి ప్రయోజనాలు దక్కుతాయి..?", "ఆమెను చనిపోయాక అనుమానంతో నన్నెవరైనా పట్టుకుంటారా?" అంటూ ఇంటర్నెట్‌లో వెదకడం గమనార్హం. కాగా, బ్రామ్లీ శరీర భాగాలను పారవేసేందుకు మెట్సన్ ఓ స్నేహితుడి సాయం తీసుకున్నాడు. అతడికి 50 పౌండ్లు చెల్లించాడు. మరోవైపు హత్యకు ముందు లింకన్‌షైర్ పోలీసులు.. బ్రామ్లీ ఫిర్యాదు మేరకు ఓసారి వారి ఇంటికి వెళ్లగా.. తలుపు కూడా తీయకుండా, తానే గృహ హింస బాధితుడినని చేతిపై కొరికిన గాయాన్ని చూపి విషయాన్ని దారిమళ్లించాడు. హత్య తర్వాత వెళ్లిన పోలీసులతోనూ.. "ఆమె మంచం కింద దాక్కుంది చూడండి" అంటూ వెటకారమాడాడు. మహిళా సంఘాల వారితో కలిసి వెళ్లిపోయిందని మరోసారి చెప్పాడు. చివరకు ఏడాది పాటు సాగిన కేసు విచారణలో మెట్సన్ గత శుక్రవారం నేరాన్ని కోర్టు ముందు ఒప్పుకొన్నాడు. న్యాయస్థానం సోమవారం తీర్పు వెలువరించనుంది. అక్కడి చట్టాల ప్రకారం నిందితుడికి జీవితఖైదు విధించేందుకు అవకాశం ఉంది. కాగా, మెట్సన్ తన భార్యను ఎలా చంపాడో కూడా తెలియనంతగా ముక్కలు చేశాడు. కానీ, ఎందుకు, ఎలా చంపినదీ వెల్లడించలేదు. అతడి న్యాయవాది మాత్రం మెట్సన్ ఆటిజం బాధితుడని కోర్టుకు తెలిపాడు.

'అగ్నికుల్' మూడోసారి వాయిదా!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: చెన్నైకి చెందిన ప్రైవేటు స్టార్టప్ కంపెనీ అగ్నికుల్ కాస్మోస్ తొలిసారి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టదలచిన అగ్నిబాన్ సబ్ ఆర్బిటాల్ టెక్నాలజీ డిమానిస్ట్రేటర్ (సార్టెడ్) రాకెట్ ప్రయోగం మూడోసారీ నిలిచిపోయింది. మరో 92 సెకన్లలో కౌంట్‌డౌన్ ముగుస్తుందనగా కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా ప్రయోగాన్ని నిలిపివేసినట్టు ఆ సంస్థ వెల్లడించింది. ఈ ఏడాది మార్చి 22 నుంచి ఈ ప్రయోగం కోసం కసరత్తు చేస్తున్న ఈ స్టార్టప్ కంపెనీ ఆదివారం మూడో ప్రయత్నంలోనూ విఫలమైనట్టయింది. గత నెల 22న తొలిసారి, ఈ నెల 6న రాకెట్‌ను ప్రయోగించడానికి ప్రయత్నించారు.

హ్యాట్రిక్‌తో మెరిశారు

లఖ్‌నవూ ఘనవిజయం


బ్యాటింగ్‌లో తడబడిన లఖ్‌నవూ చేసిందే 163 పరుగులు. అయినా ఆ జట్టు బౌలర్లు చూపిన తెగువ వహ్వా.. అనిపించకమానదు. పేసర్ యష్ ఠాకూర్, స్పిన్నర్ క్రునాల్ పాండ్యా పరుగులను కట్టడి చేయడమే కాదు.. కీలక వికెట్లతో గుజరాత్‌ను దెబ్బతీశారు. దీంతో 54/0 నుంచి 80/5కు పడిపోయిన ఆ జట్టు మరిక కోలుకోలేకపోయింది. అటు జెయింట్స్ హ్యాట్రిక్ విజయంతో సంబరాలు చేసుకుంది.

- పేసర్ యశ్‌కు ఐదు వికెట్లు
- కట్టడి చేసిన స్పిన్నర్ క్రునాల్
- గుజరాత్ చిత్తు

లఖ్‌నవూ: ఐపీఎల్‌లో ఇప్పటిదాకా గుజరాత్ టైటాన్స్‌పై గెలవని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఆ కొరత తీర్చేసుకుంది. పేసర్ యశ్ ఠాకూర్ (5/30), స్పిన్నర్ క్రునాల్ పాండ్యా (3/11) తమ మ్యాజిక్ బంతులతో టైటాన్స్‌కు అనూహ్య షాక్‌ను ఇచ్చారు. దీంతో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో లఖ్‌నవూ 33 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. రాహుల్ సేనకిది హ్యాట్రిక్ విజయం కాగా.. పట్టికలోనూ మూడో స్థానానికి చేరింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 5 వికెట్లకు 163 పరుగులు చేసింది. స్టొయినిస్ (43 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 58), రాహుల్ (33), పూరన్ (22 బంతుల్లో 3 సిక్సర్లతో 32 నాటౌట్) రాణించారు. నల్కండే, ఉమేశ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ 18.5 ఓవర్లలో 130 పరుగులకే కుప్పకూలింది. సాయి సుదర్శన్ (23 బంతుల్లో 4 ఫోర్లతో 31), తెవాటియా (25 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులతో 30) మాత్రమే ఆకట్టుకున్నారు. లఖ్‌నవూ స్పీడ్‌గన్ మయాంక్ యాదవ్ ఒక్క ఓవర్ వేసి పక్కటెముకల నొప్పితో వైదొలిగాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా యశ్ నిలిచాడు.

వణికించిన యశ్, క్రునాల్: ఓ మాదిరి ఛేదనను సులువుగా పూర్తి చేస్తుందనుకున్న గుజరాత్ జెయింట్స్ అనూహ్యంగా తడబడింది. లఖ్‌నవూ బౌలర్లు కట్టుదిట్టమైన బంతులతో పాటు వరుస విరామాల్లో వికెట్లు నేలకూలుస్తూ మ్యాచ్‌ను లాగేశారు. స్పిన్నర్ క్రునాల్, పేసర్ యశ్ ఠాకూర్ కీలక వికెట్లతో దెబ్బతీశారు. ఓపెనర్లు సాయిసుదర్శన్, గిల్ తొలి వికెట్‌కు అందించిన 54 పరుగుల భాగస్వామ్యం తప్ప టైటాన్స్ ఇన్నింగ్స్‌లో చెప్పుకోవడానికేమీ లేకపోయింది. నాలుగో ఓవర్‌లో సాయి రెండు ఫోర్లు, గిల్ ఓ ఫోర్‌తో 13 పరుగులు వచ్చాయి. దీంతో పవర్‌ప్లేలో 54 పరుగులతో పటిష్ఠంగానే కనిపించినా గిల్ వికెట్‌ను యష్ తీశాడు. ఇక ఆ తర్వాత గుజరాత్‌ను లఖ్‌నవూ బౌలర్లు అల్లాడించారు. విలియమ్సన్ (1)ను స్పిన్నర్ బిష్ణోయ్ ఒంటిచేత్తో అందుకున్న రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ బాట పట్టించగా.. తొమ్మిదో ఓవర్‌లో సాయి, శరత్ (2)లను క్రునాల్ పాండ్యా దెబ్బతీశాడు. దీనికి తోడు 7-11 ఓవర్ల మధ్య కనీసం ఓ ఫోర్ కూడా రాబట్టలేకపోయింది. విజయ్ శంకర్ (17), నల్కండే (12)లను స్పిన్నర్లు తెగ ఇబ్బందిపెట్టారు. 12వ ఓవర్‌లో సిక్సర్ బాదిన నల్కండేను క్రునాల్.. కాసేపటికే విజయ్, రషీద్ (0)లను యశ్ మెయిడిన్ డబుల్ వికెట్‌గా అవుట్ చేయడంతో టైటాన్స్ 93 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి విజయంపై ఆశలు వదులుకుంది. అప్పటికీ ఛేదన మరీ కష్టంగా లేకున్నా చేతిలో వికెట్లు లేకపోవడం దెబ్బతీసింది. చివర్లో తెవాటియా మెరుపులు ఓటమి తేడాను తగ్గించాయి. 19వ ఓవర్‌లో తెవాటియా, నూర్ (4)ల వికెట్లను తీసిన యశ్ మ్యాచ్‌ను ముగించాడు.

సాదాసీదాగా..: టాస్ గెలవగానే లఖ్‌నవూ కెప్టెన్ రాహుల్ బ్యాటింగ్‌కు మొగ్గు చూపినా.. బరిలోకి దిగాక బ్యాటర్లు పరుగుల కోసం తెగ కష్టపడ్డారు. చివర్లో పూరన్, బదోని (20) కాస్త బ్యాట్ ఝుళిపించడంతో స్కోరు 160 దాటగలిగింది. అంతకుముందు తొలి ఓవర్‌లోనే జట్టుకు షాక్ తగిలింది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ డికాక్ (6) నాలుగో బంతికే వెనుదిరగ్గా.. దేవ్‌దత్ పడిక్కళ్ (7) తన పేలవ ఫామ్‌ను వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ కొనసాగించాడు. ఈ ఇద్దరినీ పేసర్ ఉమేశ్ యాదవ్ పెవిలియన్‌కు చేర్చాడు. ఈ దశలో మరో ఓపెనర్ రాహుల్, స్టొయినిస్ క్రీజులో నిలిచి జట్టును ఆదుకున్నారు. కానీ వీరు ఆచితూచి ఆడడం జట్టు భారీ స్కోరుపై ప్రభావం పడింది. నాలుగో ఓవర్‌లో రాహుల్ రెండు ఫోర్లు, స్టొయినిస్ ఫోర్‌తో 13 పరుగులు రావడంతో.. పవర్‌ప్లేలో 47/2 స్కోరుతో పర్వాలేదనిపించింది. అనంతరం స్పిన్నర్లు నూర్ అహ్మద్, రషీద్ ఖాన్ మెరుగ్గా బౌలింగ్ వేయడంతో ఈ జోడీ భారీ షాట్లు ఆడలేకపోయింది. అయితే వికెట్‌ను కాపాడుకుంటూ చక్కగా కుదురుకున్న ఈ ఇద్దరినీ పేసర్ నల్కండే దెబ్బతీసి జట్టుకు రిలీఫ్‌నిచ్చాడు. ముందుగా 13వ ఓవర్‌లో రాహుల్‌ను అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 73 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. తన తర్వాతి ఓవర్‌లో స్టొయినిస్ రెండు సిక్సర్లు బాది అర్ధసెంచరీ పూర్తి చేసినా ఐదో బంతికి క్యాచ్ అవుటయ్యాడు. అటు ఈ దశలో క్రీజులో పూరన్ ఉన్నా బ్యాట్ ఝుళిపించలేకపోవడంతో 17 ఓవర్లలో స్కోరు 126/4గానే ఉంది. అయితే 18వ ఓవర్‌లో పూరన్ సిక్సర్, బదోని రెండు ఫోర్లతో 17 రన్స్ రాబట్టి లఖ్‌నవూ శిబిరంలో కాస్త జోష్ తెచ్చారు. కానీ ఈ సంతోషాన్ని ఆవిరి చేస్తూ బదోనిని రషీద్ అవుట్ చేయగా, చివరి ఓవర్‌లో పేసర్ జాన్సన్ 8 పరుగులే ఇచ్చి కట్టడి చేశాడు.



యశ్ ఠాకూర్ (5/30)

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	చాహల్ (రాజస్థాన్)
316 పరుగులు	8 వికెట్లు




నేటి మ్యాచ్

చెన్నై x కోల్‌కతా

వేదిక: చెన్నై-రా.7.30 గం.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: డికాక్ (సి) నూర్ (బి) ఉమేశ్ 6, రాహుల్ (సి) తెవాటియా (బి) నల్కండే 33, పడిక్కళ్(సి) విజయ్ శంకర్ (బి) ఉమేశ్ 7, స్టొయినిస్ (సి) శరత్ (బి) నల్కండే 58, పూరన్ (నాటౌట్) 32, బదోనీ (సి) ఉమేశ్ (బి) రషీద్ 20, క్రునాల్ (నాటౌట్) 2 : **ఎక్స్‌ట్రాలు : 5 : మొత్తం (20 ఓవర్లలో) 163/5 ; వికెట్లపతనం :** 1/6, 2-18, 3-91, 4-112, 5-143 ; **బౌలింగ్ :** ఉమేశ్ 3-0-22-2, స్పెన్సర్ జాన్సన్ 4-0-32-0, రషీద్ 4-0-28-1, మోహిత్ 3-0-34-0, నూర్ అహ్మద్ 4-0-22-0, దర్శన్ నల్కండే 2-0-21-2

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) బిష్ణోయ్ (బి) క్రునాల్ 31, గిల్ (బి) యశ్ ఠాకూర్ 19, విలియమ్సన్ (సి) అండ్ (బి) బిష్ణోయ్ 1, శరత్ (సి) బదోనీ (బి) క్రునాల్ 2, విజయ్ శంకర్ (సి) రాహుల్ (బి) యశ్ ఠాకూర్ 17, నల్కండే (సి) యశ్ ఠాకూర్ (బి) క్రునాల్ 12, తెవాటియా (సి) పూరన్ (బి) యశ్ ఠాకూర్ 30, రషీద్ (సి) సబ్ హుడా (బి) యశ్ ఠాకూర్ 0, ఉమేశ్ (సి) డికాక్ (బి) నవీన్ 2, జాన్సన్ (నాటౌట్) 0, నూర్ (సి) డికాక్ (బి) యశ్ ఠాకూర్ 4 : **ఎక్స్‌ట్రాలు : 12 : (మొత్తం 18.5 ఓవర్లలో) 130 ఆలౌట్ ; వికెట్లపతనం :** 1-54, 2-56, 3-58, 4-61, 5-80, 6-93, 7-93, 8-102, 9-126 **బౌలింగ్:** మణిమారన్ సిద్ధార్థ్ 4-0-29-0, నవీన్ ఉల్ హక్ 4-0-37-1, మయాంక్ యాదవ్ 1-0-13-0, యశ్ ఠాకూర్ 3.5-1-30-5, క్రునాల్ 4-0-11-3, బిష్ణోయ్ 2-0-8-1.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	4	4	0	0	8	1.120
కోల్‌కతా	3	3	0	0	6	2.518
లఖ్‌నవూ	4	3	1	0	6	0.775
చెన్నై	4	2	2	0	4	0.517
హైదరాబాద్	4	2	2	0	4	0.409
పంజాబ్	4	2	2	0	4	-0.220
గుజరాత్	5	2	3	0	4	-0.797
ముంబై	4	1	3	0	2	-0.704
బెంగళూరు	5	1	4	0	2	-0.843
ఢిల్లీ	5	1	4	0	2	-1.370

గమనిక: ఆ: ఆడినవి; గె: గెలిచినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ముంబై గెలిచిందోచ్!

అదరగొట్టిన రోహిత్, షెఫర్డ్, డేవిడ్

- 29 పరుగులతో ఓడిన ఢిల్లీ
- కొట్జీకి 4 వికెట్లు ● స్టబ్స్, షా పోరాటం వృథా



షెఫర్డ్ (10 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులతో 39 నాటౌట్)

ముంబై: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ముంబై హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో ఎట్టకేలకు బోణీ కొట్టింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' రొమారియో షెఫర్డ్ (10 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులతో 39 నాటౌట్) ఊచకోతతో.. ఐపీఎల్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 29 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. ఢిల్లీ కూడా తుదికంటా పోరాడినా.. షెఫర్డ్ చివరి ఓవర్ విధ్వంసమే రెండు జట్ల మధ్య తేడా చూపించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 234 పరుగులు చేసింది. వాంఖడేలో ముంబైకిదే అత్యధిక స్కోరు. రోహిత్ శర్మ (27 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సులతో 49), టిమ్ డేవిడ్ (21 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సులతో 45 నాటౌట్), ఇషాన్ కిషన్ (23 బంతుల్లో 42), హార్దిక్ (39) రాణించారు. అక్షర్ పటేల్, నోకియా రెండేసి వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఢిల్లీ ఓవర్లన్నీ ఆడి 205/8 స్కోరు మాత్రమే చేసింది. స్టబ్స్ (25 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సులతో 71 నాటౌట్), పృథ్వీ షా (40 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సులతో 66), అభిషేక్ పోరెల్ (41) పోరాటాలు వృథా అయ్యాయి. కొట్జీ 4, బుమ్రా 2 వికెట్లు పడగొట్టారు. వరుసగా మూడు మ్యాచ్‌ల ఓటమి తర్వాత ముంబైకిది తొలి గెలుపుకాగా.. ఆడిన 5 మ్యాచ్‌ల్లో నాలుగు ఓడిన ఢిల్లీ పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానానికి దిగజారింది.

జోరు తగ్గిన పవర్‌ప్లే..: భారీ లక్ష్యం కోసం బరిలోకి దిగిన ఢిల్లీ.. పవర్‌ప్లేలో ఆశించినంత వేగంగా పరుగులు చేయలేకపోవడం ఒకరకంగా ఓటమికి కారణమైంది. ఓపెనర్ వార్నర్ (10) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా.. మరో ఓపెనర్ షా, అభిషేక్ రెండో వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశాడు. 10 ఓవర్లు ముగిసే సరికి ఢిల్లీ 94/1తో పోటీ ఇచ్చేలా కనిపించింది. కానీ, షాను బుమ్రా బౌల్డ్ చేసి బ్రేక్ ఇచ్చాడు. ఈ దశలో పోరెల్‌తో కలసి మూడో వికెట్‌కు 34 పరుగులు జోడించిన స్టబ్స్.. తుది వరకూ ఒంటరి పోరాటాన్ని కొనసాగించాడు. అభిషేక్‌ను బుమ్రా.. పంత్ (1)ను కొట్జీ అవుట్ చేయడంతో ఢిల్లీ ఆశలు వదిలేసుకొంది. 19వ ఓవర్‌లో అక్షర్ పటేల్ (8) రనౌట్ అయినా.. స్టబ్స్ మూడు సిక్సులు బాదడంతో ఢిల్లీ 201/5తో నిలిచింది. చివరి ఓవర్‌లో క్యాపిటల్స్ విజయానికి 35 పరుగులు కావాల్సి ఉండగా.. లలిత్ (3), కుశాగ్ర (0), రిచర్డ్‌సన్ (2)ను అవుట్ చేసిన కొట్జీ.. 4 రన్స్ మాత్రమే ఇచ్చాడు.

దుమ్మురేపిన రోహిత్..: ఆరంభంలో రోహిత్ శర్మ.. ఆఖర్లో షెఫర్డ్ వీరహారంతో ముంబై భారీ స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి ఓపెనర్లు ఇషాన్, రోహిత్ అదిరే ఆరంభాన్నిచ్చారు. అయితే, రోహిత్‌ను బౌల్డ్ చేసిన అక్షర్.. 80 పరుగుల భాగస్వామ్యాన్ని బ్రేక్ చేశాడు. ఈ సీజన్‌లో తొలిసారి బరిలోకి దిగిన సూర్యకుమార్ (0)ను నోకియా డకౌట్ చేశాడు. 11వ ఓవర్లో ఇషాన్‌ను అక్షర్ అవుట్ చేయగా.. తిలక్ వర్మ (6) ఎక్కువసేపు క్రీజులో నిలవలేక పోయాడు.

6 బంతులు, 32 పరుగులు

సీజన్‌లో రెండో మ్యాచ్ ఆడుతున్న ముంబై బ్యాటర్ రొమారియో షెఫర్డ్ విధ్వంసమే సృష్టించాడు. ముంబై ఇన్నింగ్స్‌లో చివరి 13 బంతులు మిగిలి ఉన్నప్పుడు క్రీజులోకి అడుగు పెట్టిన తను ఆఖరి ఓవర్‌లో ఢిల్లీకి పట్టపగలే చుక్కలు చూపించాడు. పేసర్ నోకియా వేసిన ఈ ఓవర్‌లో అతను వరుసగా 4,6,6,6,4,6తో ఏకంగా 32 పరుగులు రాబట్టి స్కోరును 234కి చేర్చాడు. గతేడాది లఖ్‌నవూ నుంచి ట్రేడింగ్ ద్వారా ముంబై ఈ విండీస్ ఆల్‌రౌండర్‌ను తీసుకుంది.

ఎగతాళిని 'కట్టడి' చేశారు!

తొలి మూడు మ్యాచ్‌ల్లో కెప్టెన్ హార్దిక్‌కు ముంబై అభిమానుల నుంచి ఎదురైన ఎగతాళి, హేళన ఈసారి అంతగా కనిపించలేదు. వ్యతిరేకతను తగ్గించేందుకు ముంబై ఫ్రాంచైజీ ఆదివారం నాటి మ్యాచ్‌కు ఏకంగా 18 వేల టిక్కెట్లను పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసింది. 'అందరికీ విద్య, క్రీడల దినోత్సవం'లో భాగంగా రిలయన్స్ ఫౌండేషన్ వీరిని రప్పించింది. మరోవైపు టాస్ సమయంలోనూ హార్దిక్‌ను గేలి చేస్తున్నట్టుగా టీవీల్లో ఎలాంటి శబ్దం వినిపించలేదు. దీంతో కావాలనే సౌండ్‌ను బ్లాక్ చేశారని ఫ్యాన్స్ ఆరోపిస్తున్నారు.

స్కోరుబోర్డు

ముంబై: రోహిత్ (బి) అక్షర్ 49, ఇషాన్ (సి అండ్ బి) అక్షర్ 42, సూర్యకుమార్ (సి/సబ్) ఫ్రేజర్ (బి) నోకియా 0, హార్దిక్ (సి/సబ్) ఫ్రేజర్ (బి) నోకియా 39, తిలక్ (సి) అక్షర్ (బి) ఖలీల్ 6, డేవిడ్ (నాటౌట్) 45, షెఫర్డ్ (నాటౌట్) 39; **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 20 ఓవర్లలో 234/5; వికెట్ల పతనం:** 1-80, 2-81, 3-111, 4-121, 5-181; **బౌలింగ్:** ఖలీల్ 4-0-39-1, ఇషాంత్ 3-0-40-0, రిచర్డ్‌సన్ 4-0-40-0, అక్షర్ 4-0-35-2, లలిత్ 1-0-15-0, నోకియా 4-0-65-2.

ఢిల్లీ: పృథ్వీ షా (బి) బుమ్రా 66, వార్నర్ (సి) హార్దిక్ (బి)షెఫర్డ్ 10, అభిషేక్ (సి) డేవిడ్ (బి) బుమ్రా 41, స్టబ్స్ (నాటౌట్) 71, పంత్ (సి) హార్దిక్ (బి) కొట్జీ 1, అక్షర్ (రనౌట్) 8, లలిత్ (సి) ఇషాన్ (బి) కొట్జీ 3, కుశాగ్ర (సి) తిలక్ (బి) కొట్జీ 0, రిచర్డ్‌సన్ (సి) రోహిత్ (బి) కొట్జీ 2; **ఎక్స్‌టాలు: 3; మొత్తం: 20 ఓవర్లలో 205/8; వికెట్ల పతనం:** 1-22, 2-110, 3-144, 4-153, 5-194, 6-203, 7-203, 8-205; **బౌలింగ్:** కొట్జీ 4-0-34-4, బుమ్రా 4-0-22-2, ఆకాశ్ 4-0-45-0, షెఫర్డ్ 4-0-54-1, నబీ 2-0-17-0, చావ్లా 2-0-32-0.

అర్జున్ కెరీర్ బెస్ట్ ర్యాంక్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): యువ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ వరల్డ్ చెస్ క్లాసిక్ ర్యాంకింగ్స్‌లో కెరీర్ అత్యుత్తమ ఐదోర్యాంక్‌కు చేరుకున్నాడు. స్పెయిన్‌లో జరుగుతున్న మెనోర్కా ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్‌లో అర్జున్ ఈ ఘనత సాధించాడు. ఈ టోర్నీలో అర్జున్ 7.5 పాయింట్లతో విజేతగా నిలవగా, అలెక్సింకో (రష్యా) రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. ఈనెల 2వ తేదీ నుంచి జరుగుతున్న ఈ పోటీ లు ఆదివారం ముగిశాయి. రష్యా జీఎం ఫెడోసివ్‌తో జరిగిన ఆఖరి రౌండ్‌ను అర్జున్ డ్రాగా ముగించాడు.

మోంటెకార్లో మెయిన్ డ్రాకు నగాల్

న్యూఢిల్లీ: సుమిత్ నగాల్ అరుదైన ఘనత సాధించాడు. 42 ఏళ్ల తర్వాత మోంటెకార్లో మాస్టర్స్ టెన్నిస్ టోర్నీ మెయిన్ డ్రాకు అర్హత సాధించిన తొలి భారత ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఆదివారం జరిగిన టోర్నమెంట్ చివరి రౌండ్ క్వాలిఫికేషన్ మ్యాచ్‌లో నగాల్ 7-5, 2-6, 6-2తో ప్రపంచ 55వ ర్యాంకర్ డియాజ్ అకోస్టా (అర్జెంటీనా)ను చిత్తు చేశాడు. మెయిన్ డ్రాకు అర్హత సాధించడంతో..తొలి రౌండ్ ఆడనున్న దరిమిలా 91వ ర్యాంకర్ నగాల్‌కు కనీసం రూ. 21 లక్షలు ప్రైజ్‌మనీ లభించనుంది.

అందుకే.. శ్రీశాంత్ తప్పించుకోగలిగాడు !



న్యూఢిల్లీ: భారత క్రీడా రంగంలో అవినీతి నిరోధానికి సంబంధించి సరైన చట్టాలు లేకపోవడంవల్లే స్పాట్ ఫిక్సింగ్ కేసులో పేసర్ శ్రీశాంత్ కఠినమైన శిక్ష పడకుండా తప్పించుకున్నాడని ఢిల్లీ మాజీ పోలీసు కమిషనర్ నీరజ్ కుమార్ తెలిపారు. 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణంలో శ్రీశాంత్, అతడి రాజస్థాన్ రాయల్స్ సహచరులు అంకిత్ చవాన్, అజిత్ చండీలాను అప్పటి ఢిల్లీ పోలీసు కమిషనర్ నీరజ్ కుమార్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఆ కేసులో శ్రీశాంత్‌పై బీసీసీఐ జీవితకాల నిషేధం విధించింది. అయితే..శ్రీశాంత్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం ఉన్నా..అతడిపై విధించిన జీవితకాల నిషేధాన్ని ఎత్తివేసే విషయాన్ని పరిశీలించాలని 2019లో సుప్రీంకోర్టు బీసీసీఐకి సూచించింది. దరిమిలా శ్రీశాంత్‌పై నిషేధాన్ని ఏడు సంవత్సరాలకు బోర్డు కుదించింది. ఆ నిషేధం సెప్టెంబరు 2020లో ముగిసింది. 'దురదృష్టవశాత్తు భారత క్రీడా రంగంలో లేదా క్రికెట్‌లో అవినీతిని అరికట్టేందుకు సరైన చట్టాలు లేవు. అందువల్లే..శ్రీశాంత్‌కు వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాలున్నా అతడు తప్పించుకోగలిగాడు' అని నీరజ్ కుమార్ పేర్కొన్నారు.

వాళ్లిద్దరూ పెద్ద మురికిగాళ్లు!



రోహిత్ శర్మ



న్యూఢిల్లీ: శిఖర్ ధవన్, రిషభ్ పంత్‌లతో హోటల్ గదిని పంచుకోవాలంటే ఎవరైనా భయపడతారని భారత కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. కమెడియన్ కపిల్ శర్మ కార్యక్రమంలో పాల్గొన్న తను ఈ విషయం చెప్పాడు. 'రూమ్ షేర్ చేసుకోవాల్సివస్తే ఎవరితో ఉంటారు?' అని అడిగిన ప్రశ్నకు రోహిత్ సమాధానమిస్తూ.. 'ప్రస్తుతం ప్రతీ ఆటగాడికి ఒక్కో గదిని కేటాయిస్తున్నారు. అయితే రూం పంచుకోవాల్సి వస్తే నేను శిఖర్ ధవన్, రిషభ్ పంత్‌లతో కలిసి మాత్రం ఉండలేను. వాళ్లిద్దరూ పెద్ద మురికిగాళ్లు. తమ గదులను శుభ్రంగా ఉంచుకోరు. ప్రాక్టీస్ అయ్యాక మంచంపైనే దుస్తులను పడేస్తుంటారు. అలాగే ఒంటిగంటదాకా నిద్ర లేవరు. పొద్దున్నే రూమ్ క్లీనింగ్ వాళ్లు వస్తారని తలుపులకు డోన్ట్ డిస్టర్బ్ బోర్డును వేలాడదీస్తుంటారు. నేనే కాదు ఎవరూ వారితో ఉండేందుకు ఇష్టపడరు' అని తెలిపాడు. అలాగే వన్డే వరల్డ్‌కప్ ముగిశాక భారత అభిమానులు తమతో స్నేహపూర్వకంగానే వ్యవహరించారని, ఇది తమనెంతో ఆశ్చర్యానికి గురి చేసిందన్నాడు. ఫైనల్లో ఓడినందుకు జట్టుపై ఆగ్రహం చూపిస్తారని అనుకున్నా. కానీ ఎంతో బాగా ఆడారని ప్రశంసించారని రోహిత్ గుర్తుచేసుకున్నాడు.

జాతీయ బాక్సింగ్‌లో అహ్మద్‌కు స్వర్ణం

హైదరాబాద్ : బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎఫ్ఐ), ఖేలో ఇండియా సంయుక్తంగా నిర్వహించిన జాతీయ బాక్సింగ్ పోటీల్లో హైదరాబాద్ బాక్సర్ అహ్మద్ హష్మి స్వర్ణం సాధించాడు. గుర్గావ్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో జూనియర్ కేటగిరీ 33-35 కిలోల విభాగంలో అహ్మద్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో అహ్మద్ 5-0 మెక్కాడెస్ (తమిళనాడు)ను చిత్తు చేశాడు.

హంపి హ్యాట్రిక్ డ్రా



టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో కోనేరు హంపికి వరుసగా మూడో డ్రా ఎదురైంది. మూడో రౌండ్‌లో టాన్ జోంగి (చైనా) తలపడిన హంపి 24 ఎత్తుల తర్వాత డ్రా చేసుకుంది. యువ జీఎం ప్రజ్ఞానంద 45వ ఎత్తులో సీనియర్ జీఎం విదిత్ గుజరాతిని ఓడించాడు. రష్యా జీఎం నెపోమ్నియాతో ఆడిన గుకేష్ 40వ ఎత్తు తర్వాత డ్రా చేసుకున్నాడు. సాలిమోవా (బల్గేరియా)తో తలపడిన వైశాలి (తమిళనాడు) 33వ ఎత్తులో విజయం సాధించింది. మొత్తంగా 3 రౌండ్లు ముగిసేసరికి మహిళల్లో హంపి 3వ, వైశాలి 4వ స్థానంలో నిలవగా, పురుషుల్లో ఫాబియానో టాప్‌లో, గుకేష్, విదిత్, ప్రజ్ఞానంద 3 నుంచి 5 స్థానాల్లో కొనసాగుతున్నారు.

భవిష్యత్ కోసం ఓటేయాలి



- తొలిసారి ఓటేసే యువతకు నీలాయపాలెం సూచన

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఎన్నికల్లో మొదటి సారి ఓటు వేసే యువత ఆలోచించి ఓటేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ కోరారు. ఎవరికి ఓటు వేస్తే.. యువత భవిష్యత్, రాష్ట్ర భవిష్యత్ బాగుపడుతుందో ఆలోచించాలని సూచించారు. ఆదివారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'తల్లిదండ్రుల కలలను నిజం చేసేలా యువత ఉద్యోగాలు చేయాలి. జాబు రావాలంటే బాబు రావాల్సిందే. విభజన తర్వాత ఏపీలో టీడీపీ హయాంలో అభివృద్ధి ఎలా సాగిందో, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం ఎలా నాశనమయ్యిందో చూశారు. చంద్రబాబు సంపద సృష్టించే పరిశ్రమలు తెచ్చారు. ఐదేళ్లలో 100కుపైగా ప్రముఖ పరిశ్రమలు వచ్చాయి. లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించారు. కానీ, జగన్ ఐదేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాలేదు. ఉన్న పరిశ్రమలనూ తరిమికొట్టారు. 2019లో అధికారం చేపట్టిన జగన్.. విధ్వంసం, అరాచకం, అవినీతితో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. పెట్టుబడి పెట్టడానికి వచ్చిన పరిశ్రమల్ని తన అవినీతి, అసమర్థ విధానాలతో తరిమికొట్టారు. అమరావతిని ధ్వంసం చేశాడు. రాజధాని లేని రాష్ట్రంగా మార్చాడు. ఈ నేపథ్యంలో మే 13న జరిగే ఎన్నికల్లో యువత ఆలోచించి ఓటు వేయాలి' అని పేర్కొన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే యువతతోనే సాధ్యమన్నారు.

జగన్ పేరు చెబితే గుర్తొచ్చేవి అరాచకాలే: మాల్యాద్రి

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తన అసమర్థ, అవినీతి పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డిని నమ్మి మరోసారి ఓటేసేందుకు ప్రజలు సిద్ధంగా లేరని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి అన్నారు. ఆదివారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'చంద్రబాబు పేరు చెబితే అభివృద్ధి, స్వయం ఉపాధి, యువతకు భవిష్యత్ గుర్తొస్తుంది. కానీ, జగన్ పేరు చెబితే గుర్తొచ్చేది హత్యలు, అబద్ధాలు, అరాచకమే. బాబాయిపై వేసిన గొడ్డలి వేటు, బాబాయి హంతకులను కాపాడటం గుర్తొస్తుంది. గోదావరిలో మునిగిన పోలవరం డ్యామ్, ఇసుక మాఫియాకు బలైన అన్నమయ్య డ్యామ్ గుర్తొస్తాయి. జే బ్రాండ్ మద్యం, ఇసుక దోపిడీ, కూల్చివేతలు, విధ్వంసాలు, బలహీన వర్గాలపై దాడులు, హత్యలు గుర్తొస్తాయి. అదే చంద్రబాబు పేరు చెబితే సైబరాబాద్, పోలవరం, అమరావతి గుర్తొస్తాయి. యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగులకు ఉపాధి కనిపిస్తాయి' అని పేర్కొన్నారు.

అభివృద్ధిని అడ్డుకున్న ఏకైక సీఎం జగనే!

- మూర్ఖంగా ప్రవర్తించి చరిత్ర హీనుడయ్యారు
- ఫ్యాక్షనిస్టు, విజనరీ తేడాను ప్రజలు గమనించాలి
- మంగళగిరి ఎన్నికల ప్రచారంలో లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 7: గత ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధిని అడ్డుకున్న ఏకైక ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో మిగిలిపోతారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కొలనుకొండ ఆర్ఆర్ రచన అపార్ట్‌మెంట్ వాసులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చంద్రబాబు నాటిన మొక్కను తర్వాత ప్రభుత్వాలు కొనసాగించినందువల్లే హైదరాబాద్ ఈరోజు విశ్వనగరంగా అభివృద్ధి చెందింది. ఏపీలో మాత్రం గత టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు పనులను జగన్ మూర్ఖంగా నిలిపేసి చరిత్ర హీనుడయ్యారు. అనాలోచితంగా పీపీఏలను కూడా రద్దుచేశారు. ఫ్యాక్స్ కాన్, అమర్ రాజా, జాకీ వంటి పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరిమేశారు. కులముద్రవేసి వేధించడంతో దేశంలోనే పేరెన్నికగన్న వ్యాక్సిన్ తయారీ సంస్థ భారత్ బయోటెక్ ఒడిసా వెళ్లి రూ.1,200 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేసుకుంది. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ట్రాన్స్ పోర్టు, క్యాంటీన్ కాంట్రాక్ట్ కోసం టీసీఎల్ కంపెనీ ఎగ్జిక్యూటివ్‌ను నిర్బంధించారు. ఇలాంటి ప్రభుత్వం...ఈ తరహా ప్రజాప్రతినిధులు ఉన్నచోట పరిశ్రమలు ఎలా వస్తాయి? జగన్ చేతగానితనం, అహంకారం వల్లే పరిశ్రమలన్నీ ఇతర రాష్ట్రాలకు క్యూ కడుతున్నాయి. స్వతహాగా జగన్ ఒక ఫ్యాక్షనిస్టు. బాబాయిని ఎలా చంపారో వివేకం సినిమాలో కళ్లకు కట్టినట్టే చూపించారు. ప్రజలు అభివృద్ధి చెందకుండా తాము విసిరే చిల్లర కోసం ఎదురుచూస్తూ ఉండాలన్నదే ఫ్యాక్షనిస్టు జగన్ నైజం' అని లోకేశ్ దుమ్మెత్తిపోశారు.



మంగళగిరి నియోజకవర్గంలోని ఆర్ఆర్ రచన అపార్టుమెంట్‌వాసులతో మాట్లాడుతున్న లోకేశ్

బాబు విజన్ వల్లే లక్షలాది ఉద్యోగాలు..

'జగన్ విధ్వంసక పాలనలో యువతకు ఉద్యోగాలు లేవు. చదువుకునే పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తేశారు. విదేశీవిద్య పథకాన్ని నాశనం చేశారు' అని లోకేశ్ ఆవేదన చెందారు. చంద్రబాబు విజన్‌తో నిర్మించిన సైబరాబాద్ వల్ల నేడక్కడ పదిలక్షలమంది యువతకు ఉపాధి లభిస్తోందన్నారు. ఫ్యాక్షనిస్టుకు, విజనరీకి ఉన్న ఈ తేడాను రాష్ట్రప్రజలంతా గమనించాలని కోరారు. 'గత ప్రభుత్వంలో 72 శాతం పూర్తిచేసిన పోలవరాన్ని రివర్స్ పాలనతో సర్వనాశనం చేశారు. అతి చౌకగా లభించే రెన్యువబుల్ ఎనర్జీ పీపీఏలను జగన్ రద్దుచేసి, యూనిట్ రూ.10కి బహిరంగమార్కెట్‌లో కొనుగోలు చేసిన కారణంగానే విద్యుత్ చార్జీల భారం ప్రజలపై పడుతోంది. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచబోం. ఏడాదిలోగా రాజధానికి అనుసంధానంగా ఉన్న రోడ్లనిర్మాణాలను పూర్తిచేస్తాం' అని లోకేశ్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీతో టీచర్ పోస్టులను భర్తీచేస్తామని, అయిదేళ్లలో పెండింగ్ పోస్టులన్నీ భర్తీచేసి యువత కలలను సాకారం చేస్తామన్నారు.

ప్రాణాలు తీసిన జగనన్న ఇల్లు!

- ఆ ఇంటి నిర్మాణానికి అప్పులు చేసిన లబ్ధిదారు
- తీర్చే మార్గం కానరాక ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఏప్రిల్ 7: వైఎస్ జగన్ ఇచ్చిన సెంటు భూమిలో ఇల్లు నిర్మించుకోవడానికి చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఒక లబ్ధిదారుడు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జిల్లా కేంద్రమైన ఏలూరులో ఈ విషాదం చోటుచేసుకుంది. ఇక్కడి అమీనాపేటలో నివాసం ఉంటున్న నూకల మల్లికార్జునరావు (52)కు పెదవేగి మండలం లక్ష్మీపురంలో వైఎస్ఆర్ జగనన్న కాలనీలో సెంటు స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.లక్షా 80 వేలు ఇచ్చింది. ఆ సొమ్ముతో ఇంటి నిర్మాణం కష్టం కావడంతో రూ.7 లక్షలకు ఒక బిల్డర్‌తో మాట్లాడుకున్నారు. వారి వద్ద చీటీ ద్వారా వచ్చిన రూ. లక్షతోపాటు.. మిగిలిన సొమ్ము క్రమేపీ అప్పులు చేసి బిల్డర్‌కు కట్టారు. ఇంకా రూ.75 వేల పని మాత్రం మిగిలింది. ఓవైపు అప్పులకు వడ్డీలు పెరగడం, మరోవైపు తమ టిఫిన్ బండి వ్యాపారం సరిగా లేకపోవడంతో నష్టాలను చవిచూస్తున్నారు. అప్పులు తీర్చే మార్గం లేక ఇల్లు పూర్తి కావడంలేదరంర బెంగతో ఐదు రోజుల క్రితం మల్లికార్జునరావు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అనేక ప్రాంతాలు వెతికారు. చివరికి ఈనెల 6న నిర్మాణంలో ఉన్న ఇంటి వద్దకు ఆయన కుమారుడు నాగసాయి రమేష్ వెళ్లి చూడగా, బాత్‌రూమ్‌లో గడియ వేసుకుని మల్లికార్జునరావు అపస్మారక స్థితిలో ఉన్నాడు. అతడు ఐదు నిద్ర మాత్రలు మింగినట్లు ఆనవాళ్లు లభించాయి. వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, విజయవాడ రిఫర్ చేశారు. విజయవాడలో చికిత్స పొందుతున్న మల్లికార్జునరావు ఆదివారం మృతి చెందారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏలూరు రూరల్ పోలీసులు తెలిపారు.

నట్టేట ముంచిన జగన్!

- వలంటీర్లూ! మిమ్మల్ని బలిపశువులను చేశాడు
- మే 31తో మీ ఒప్పందం రద్దు.. ఆ విషయం చెప్పకుండా మోసం
- ఉమ్మడి ప్రభుత్వంలో న్యాయం చేస్తాం: నాదెండ్ల మనోహర్



తెనాలి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): 'వలంటీర్లూ... మీ ఉద్యోగ ఒప్పంద గడువు మే 31తో రద్దవుతుందన్న విషయాన్ని జగన్‌రెడ్డి ఏనాడైనా మీకు చెప్పాడా? జగనే సర్వస్వం అని నమ్మిన మిమ్మల్ని రాజకీయ స్వార్థం కోసం వాడుకుని చివరకు నట్టేట ముంచడానికి సిద్ధమయ్యాడనే విషయాన్నయినా మీరు గ్రహించారా?' అని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ వలంటీర్లను ప్రశ్నించారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మిమ్మల్ని పర్మినెంట్ చేస్తానని చెప్పి సంవత్సరాలు గడిచినా ఒక్క సంతకానికి ఇన్నేళ్లు ఎందుకు పట్టింది? రేపు ఎన్నికల తర్వాత జూన్ 4న తొలిసంతకం మీ ఫైల్‌పైనే చేస్తానంటున్నాడు. ఈ దుర్మార్గపు దుష్ప్రచారాన్ని నమ్ముతారా?' అని ప్రశ్నించారు. తన సొంత సైన్యమని చెబుతూ.. వారినే జగన్ సర్కారు మోసం చేస్తోందని మనోహర్ మండిపడ్డారు. 'నిన్నటి వరకు వలంటీర్ వ్యవస్థపై పెదవి విప్పని జగన్‌రెడ్డి సడెన్‌గా ఎన్నికల ప్రచారంలో వలంటీర్లపై ప్రేమ నటిస్తూ.. వారి ఫైల్‌పై జూన్ 4న మళ్లీ అధికారంలోకి వచ్చాక తొలి సంతకం చేస్తానని చెబుతుంటే అనుమానం వచ్చి ఆరాతీస్తే విస్తు గొలిపే విషయాలు తెలిశాయి. తనను నమ్ముకున్న 2.61 లక్షల మంది వలంటీర్ల కుటుంబాలను నడిరోడ్డుపై వదిలేయడానికి జగన్ సిద్ధపడుతున్న విషయం బయటకు వచ్చింది. గ్రామ, వార్డు సచివాలయ చట్టం తీసుకొచ్చి దానిలో వలంటీర్ల వ్యవస్థ అనే పదాన్నే ప్రస్తావించకుండా, ఎన్నికల వరకు వలంటీర్లను వాడుకుని వదిలేసేందుకు ముందుగానే పథకం వేశారు. వారి ఉద్యోగ ఒప్పందం మే 31తో రద్దవుతుంటే, తన రాజకీయ లబ్ధికోసం వలంటీర్లతో బలవంతపు రాజీనామాలు చేయించడానికి కూడా తెగబడుతున్నాడు. ఈ జగన్నాటకాన్ని వలంటీర్లు ఇప్పటికైనా గుర్తించకపోతే నష్టపోతారు. అయితే, మా ఉమ్మడి ప్రభుత్వం వచ్చాక నష్టపోనివ్వదు. మీకు సముచిత స్థానాన్ని, తగిన గౌరవాన్ని కల్పిస్తాం' అని మనోహర్ హామీ ఇచ్చారు. గతంలోనే జగన్ వలంటీర్లను పర్మినెంట్ చేస్తానని, జీతాలు పెంచుతానని హామీ ఇచ్చారని, ఇన్ని సంవత్సరాలు గడిచిపోయినా ఆ హామీని ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. ఈ నెల 14న జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెనాలి వస్తున్నారని, జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని కోరారు.

'మహిళా పక్షపాతిని' అనే అర్హత జగన్‌కు లేదు

- నాసిరకం మద్యంతో మహిళల తాళి తెంచుతున్నాడు
- వృద్ధుల మరణాల వెనుక సీఎస్ కుట్ర: సాదినేని

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సొంత చెల్లెళ్లకే సమాధానం చెప్పలేని జగన్‌రెడ్డికి మహిళా పక్షపాతిని అని చెప్పే అర్హత ఉందా? అని బీజేపీ నాయకురాలు సాదినేని యామినీ శర్మ ప్రశ్నించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడారు. 'మద్యపాన నిషేధం చేస్తామన్న హామీతో వైసీపీ అధికారంలోకి వచ్చింది. పీఠమెక్కిన తరువాత ప్రభుత్వమే స్వయంగా నాసిరకం మద్యాన్ని విక్రయిస్తూ పేద మహిళల తాళిబొట్లు తెంచేస్తోంది. అంతేకాదు... కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న పథకాలను వారికి అందకుండా అడ్డుపడుతోంది. వైసీపీ ప్రభుత్వం ఏపీలో ఐపీఎస్‌ల పరువు తీసింది. ప్రతిపక్షాలు, పత్రికలపై కొద్ది మంది ఐపీఎస్‌లతో ఎన్నికల కమిషన్‌కు తప్పుడు ఫిర్యాదులు ఇప్పించి, డ్రామాలాడుతోంది. రాష్ట్రంలో జరిగిన అనేక విషయాలపై ఐపీఎస్ అధికారులు ముందుగా ఆత్మవిమర్శ చేసుకుని ఆ తర్వాత ఈసీకి ఫిర్యాదు చేస్తే బాగుంటుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు ఈసీకి రాసిన లేఖలో స్పష్టంగా... కొంతమంది పోలీసులు వైసీపీకి అధికార ప్రతినిధుల్లా వ్యవహరిస్తున్నారని మాత్రమే ఫిర్యాదుచేశారు. జగన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు చేసినట్లు 'మొత్తం ఏపీ పోలీసులపైనే మాకు నమ్మకం లేదు' అని చేయలేదు. ఓ వైపు ఎండ ఎక్కువగా ఉందని, వృద్ధులు బయటికి వెళ్లొద్దని వాతావరణ శాఖ చెబుతుంటే... మరోవైపు మధ్యాహ్నం నుంచి పెన్షన్లు ఇస్తామని సీఎస్ ప్రకటించడం వెనుక కుట్ర ఉండొచ్చ'ని అన్నారు.

ఈ సీఎం ఇంగ్లీష్ నేర్పిస్తాడంట! ఆయన నేర్పించేది ఏమిటి? ఎప్పుడో ఇంగ్లీష్ వాళ్లు నేర్పించి వెళ్లిపోయారు. ఇప్పుడు యువతకు కావాల్సింది లివింగ్ స్కిల్స్. అవి టీడీపీ నేర్పిస్తుంది.
- చంద్రబాబు

బాబు లేనిదే ఏపీకి అభివృద్ధి లేదు!

పామర్రు సభలో ఓ మహిళ తాను రాసుకొచ్చిన ప్లకార్డును చంద్రబాబుకు ఇవ్వగా ఆయన చదివి వినిపించారు. 'కృష్ణుడు లేనిదే భారతం, భాగవతాలు లేవు. సీబీఎన్ (చంద్రబాబునాయుడు) లేనిదే ఏపీకి అభివృద్ధి లేదు. బిడ్డకు తల్లి అవసరం ఎంతో.. ఏపీకి సీబీఎన్ అవసరం అంత' అని అందులో ఉంది.

బాబు వస్తేనే జాబ్‌లు..

ఈ సీఎంవి రివర్స్ టెండర్లు.. రివర్స్ పాలన. చివరకు ప్రజల జీవితాలనూ రివర్స్ చేశాడు. యువత భవిష్యత్ అంధకారం చేశాడు. మా కూటమి ప్రభుత్వం రాగానే రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తా. మెగా డీఎస్సీ పెడతా. ఉద్యోగాలు ఇస్తా. జాబ్ కేలెండర్ ఇస్తా. ఏడాదికి 4 లక్షల చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించే బాధ్యత నాది. జగన్ ప్రభుత్వంలో ఉద్యోగాలు రాలేదని, బాబు వస్తేనే జాబ్‌లు వస్తాయని ప్రజలు ఎదురు చూస్తున్నారు.



పామర్రులో జరిగిన ప్రజాగళం సభకు హాజరైన జనం, చంద్రబాబు అభివాదం

మేమొచ్చాక
రైతే రాజు!

(మొదటి పేజీ తరువాయి)

పెనమలూరు నియోజకవర్గంలోని ఉయ్యూరులో జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. పోలవరం ప్రాజెక్టు లేకుంటే కృష్ణా డెల్టా ఎడారిగా మారే ప్రమాదం ఉందన్నారు. అందుకే 2014లో తాము అధికారంలోకి రాగానే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టామని.. అది పూర్తయ్యేలోపు డెల్టాకు సకాలంలో నీరివ్వాలనే ఆలోచనతో పట్టిసీమను కట్టామని తెలిపారు. కానీ ఓ దుర్మార్గుడు అధికారం చేజిక్కించుకుని పోలవరం ఆపేశాడని, కాల్వల్లో కన్నీరు పారిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారులపై గోతులను పూడ్చలేని వ్యక్తి రాష్ట్రంలో మూడు రాజధానుల కడతానని చెబుతున్నాడని ఎద్దేవాచేశారు. 'నేను గత ఐదేళ్లలో సీఎంగా ఉండి ఉంటే హైదరాబాద్‌కు దీటుగా అమరావతిని అభివృద్ధి చేసి ఉండేవాడిని. మీ పిల్లలకు ఉద్యోగాలు ఇక్కడే వచ్చేవి' అన్నారు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 35 వేల ఎకరాలిచ్చారని.. అందులో 10 వేల ఎకరాలు ప్రభుత్వానికి వచ్చేవని.. వాటిని అభివృద్ధి చేసి సంపద సృష్టించేవారిమని చెప్పారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని మారుమూల పల్లెలనూ ప్రపంచంతో అనుసంధానిస్తామని.. స్థానికంగానే ఐటీ సెంటర్లు పెట్టి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. 'సంపద పెంచి పంచాలి. మనకు ఇచ్చే డబ్బులు, పింఛన్లు అప్పులు చేసి ఇస్తే అది మంచి పద్ధతా?' అని ప్రశ్నించారు. ప్రజలే తన స్టార్ క్యాంపెయినర్లని.. ఇంట్లో ఎంత మంది ఉంటే.. వారంతా పిల్లల భవిష్యత్ కోసం టీడీపీకి ప్రచారం చేయాలని కోరారు. ఇంకా కొంత మంది అధికారులు జగన్ సేవలో తరిస్తున్నారని.. ఆయన ఎక్స్‌పైరీ డేట్ అయిపోయిన మందు అని వారు గుర్తుంచుకోవాలని సూచించారు. ఇంకా ఏమన్నారంటే..

ఎక్కువ బూతులు తిడితే మంత్రి..

పామర్రు నియోజకవర్గ పరిధిలోని నిమ్మకూరులో ఒక సాధారణ కుటుంబంలో పుట్టిన నందమూరి తారక రామారావు దీక్ష, పట్టుదలతో సామాన్యులు కూడా అసామాన్యులుగా తయారవుతారని నిరూపించారు. ఈ పామర్రులో ప్రమాణం చేస్తున్నా.. పేదిరకం లేని రాష్ట్రాన్ని చూడాలన్నది నా ఆశయం. అదే ఎన్టీఆర్ సందేశం. మీ ఆశీస్సులు ఉంటే తప్పకుండా అది సాధిస్తా. ఎందరో మహానుభావులు పుట్టిన గడ్డలో నేడు గంజాయి మొక్కలు వచ్చాయి. మీకు కావలసింది అభివృద్ధి.. మీ పిల్లల బంగారు భవిష్యత్. అది తెలుగుదేశంతోనే సాధ్యం. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలంతా నరకయాతన పడ్డారు. సీఎం, మంత్రులు అభివృద్ధిని గాలికొదిలేసి మమ్మల్ని బూతులు తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. గుడివాడలో బూతుల నాని, గన్నవరంలో ఒకాయన, మచిలీపట్నంలో నాని, పెనమలూరులో ఇంకో బూతుల నాయకుడు ఉన్నారు. ఇలాంటి వారిని ఓడించాలి. జగన్ వస్తే ప్రజలు బాయ్‌కాట్ చేయాలి. ఆయన వస్తుంటే చెట్లు నరికేస్తున్నారు. అంటే.. ఆయన కన్నా ముందు గొడ్డలి వస్తుంది. ఫ్యాన్ తిరగడం ఆగిపోయింది.. ఆయన తన పార్టీ గుర్తుగా గొడ్డలిని పెట్టుకోవాలి. బాబాయిపై గొడ్డలి వేటు వేసిందెవరు? 2014లో తండ్రి చావును 2019లో బాబాయి మరణాన్ని.. ఇప్పుడు పింఛన్‌దారులనూ తన రాజకీయం కోసం వాడుకుంటున్నాడు. ఇలాంటి వారు రాష్ట్రానికి అవసరమా? ప్రజల జీవితాలతో ఆడుకునే జలగ జగన్. రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారు. ఈ రాష్ట్రానికి సురక్షితమైన, అనుభవం ఉన్న డ్రైవర్‌ను నేను. ప్రగతి వైపు రాష్ట్రాన్ని దూసుకుపోయేలా చేసే బస్సు మాది. మా బస్సులో ఎక్కితే మీ భవిష్యత్ ప్రయాణం సాఫీగా సాగుతుంది.

అభివృద్ధికి కేంద్రం సహకారం కావాలి..

వైసీపీ వ్యతిరేక ఓటు చీలొద్దనే బీజేపీ, జనసేనతో కలిశాం. ఇదే విషయాన్ని పవన్ కల్యాణ్ కూడా చెబుతున్నారు. కేంద్రంలో బీజేపీయే అధికారంలోకి వస్తుంది. అప్పుడు రాష్ట్ర అభివృద్ధి కోసం వారి సహకారం మనకు అవసరం. అందుకే ఈ పొత్తు పెట్టుకున్నాం. గతంలోనూ ఎన్డీయేలో ఉన్నాం. ఒక్క ముస్లింకైనా అన్యాయం జరిగిందా? వైసీపీ ప్రభుత్వంలో రంజాన్ తోఫా, మైనారిటీలకు విదేశీ విద్య నిధులు వచ్చాయా? మైనారిటీలకు న్యాయం చేసింది.. చేసేది టీడీపీయే. ఈ సైకో పోతినే రాష్ట్రం బాగుపడుతుంది.



సత్తెనపల్లిలో చంద్రబాబుకు వినతి పత్రం అందించిన గోనుగుంట్ల కోటేశ్వరరావు, మంద కృష్ణ మాదిగ

దివ్యాంగుల పెన్షన్ 6 వేలు

- సత్తెనపల్లిలో చంద్రబాబు ప్రకటన

సత్తెనపల్లి ఏప్రిల్ 7: తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగులకు నెలవారీ పెన్షన్ రూ.6 వేలకు పెంచుతానని మాజీ సీఎం చంద్రబాబు ప్రకటించారు. దివ్యాంగుల పెన్షన్‌ను 6 వేలకు పెంచాలని కోరుతూ దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదివారమిక్కడ సత్తెనపల్లిలో చంద్రబాబుకు వినతి పత్రం అందించారు. వెంటనే స్పందించిన ఆయన పై ప్రకటన చేశారు. దివ్యాంగుల సమాజం తరఫున చంద్రబాబుకు, టీడీపీ కూటమికి దివ్యాంగ సంఘ నాయకులు మద్దతు ప్రకటించారు.

ముగిసిన రెండో విడత ప్రజాగళం

ఉయ్యూరు సభతో చంద్రబాబు చేపట్టిన రెండో విడత ప్రజాగళం యాత్ర ముగిసింది. ఈ నెల 3న అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో, మర్నాడు కొవ్వూరు నియోజకవర్గ కేంద్రంలో, గోపాలపురం నియోజకవర్గ పరిధిలోని నల్లజర్లలో.. 5న పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, పాలకొల్లులో.. 6న పల్నాడు జిల్లా పెదకూరపాడు, సత్తెనపల్లి సభల్లో ఆయన పాల్గొన్నారు. మూడో విడత యాత్ర ఈనెల 10న మొదలవుతుంది.

తెలంగాణ టు కడప

- వైసీపీ నేతల అండతో భారీగా మద్యం రవాణా!
- రూ.14.51 లక్షల సరుకు సీజ్.. ఇద్దరు అరెస్టు



కర్నూలు జిల్లా పంచలింగాల చెక్ పోస్టు వద్ద పట్టుకున్న మద్యాన్ని చూపుతున్న సెబ్ పోలీసులు

కర్నూలు, ఏప్రిల్ 7(కర్నూలు): తెలంగాణ మద్యాన్ని భారీగా కడప జిల్లాకు తరలిస్తుండగా సెబ్ అధికారులు పట్టుకున్నారు. శనివారం రాత్రి కర్నూలు జిల్లా పంచలింగాల చెక్ పోస్టు వద్ద రూ.14.51 లక్షల మద్యంను సీజ్ చేశారు. ఆ వివరాలను కర్నూలు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవి కుమార్ ఆదివారం విలేకరులకు వెల్లడించారు. ఈ కేసులో కీలక వ్యక్తి రింగుల బాషాపై ఇప్పటికే కడప, కర్నూలు జిల్లాల్లో 104 కేసులున్నాయి. ఇవన్నీ ఎర్ర చందనం, మద్యం అక్రమ రవాణ కేసులే. తాజాగా తెలంగాణ మద్యం అక్రమ రవాణాకు సంబంధించి అతనిపై 105వ కేసు నమోదు చేశారు. కడప జిల్లా చాపాడు మండలం ఖాదర్‌పల్లికి చెందిన బాషా సహ మరికొందరు ముఠాగా ఏర్పడి అధికార వైసీపీ ముఖ్య నాయకుల అండతో ఎర్ర చందనం అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఎర్ర చందనంపై నిఘా పెరగడంతో కర్ణాటక, తెలంగాణ మద్యం అక్రమ రవాణాపై దృష్టి సారించారు. తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం జింకలపల్లి గ్రామంలోని శ్రీనివాస వైన్స్, వనపర్తిలోని ఎక్సైజ్ శాఖకు చెందిన ఐఎంఎల్ డిపో నుంచి నేరుగా కడప జిల్లాకు మద్యం తరలిస్తున్నారు. అశోక్ లైలాండ్ వాహనంలో వరి పొట్టు మధ్య 240 బాక్సుల తెలంగాణ మద్యం తీసుకు వస్తుండగా కర్నూలు జిల్లా పంచలింగాల చెక్ పోస్టు వద్ద సెబ్ సిబ్బంది పట్టుకున్నారు. మద్యం, వాహనం సీజ్ చేసి, డ్రైవర్ పటాన్ సాగిక్, క్లీనర్ షేక్ షఫీలను అరెస్టు చేశారు. వీరితో పాటు మద్యం అక్రమ రవాణాదారుడు రింగుల బాషా, వాహనం యజమాని కందనూరు హబీబుల్లాలపై కేసు నమోదు చేశారు. రింగుల బాషా కోసం పోలీసులు గాలిస్తున్నారు.

టీడీపీ ప్రచార రథంపై రాళ్లదాడి!

- దాడి వెనుక వైసీపీ.. రథం అద్దాలు ధ్వంసం..
- గుంటూరు జిల్లా జంగంగుంట్లపాలెంలో ఘటన

మేడికొండూరు ఏప్రిల్ 7: తెలుగుదేశం పార్టీ ప్రచార రథంపై వైసీపీ మూకలు రాళ్లదాడి చేశాయి. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం జంగంగుంట్లపాలెం గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఈ ఘటన జరిగింది. ఈ దాడిలో ప్రచారరథం అద్దాలు ధ్వంసమయ్యాయి. డ్రైవర్ వాహనాన్ని అక్కడే ఆపేసి పక్కకు వెళ్లిపోయి తప్పించుకున్నాడు. విషయం తెలుసుకున్న మేడికొండూరు టీడీపీ శ్రేణులు వాహనం వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. వారి ఫిర్యాదు మేరకు మేడికొండూరు పోలీసులు రంగంలోకి దిగారు. దాడిలో ఎక్కువ శాతం మంది 15 ఏళ్ల వయస్సున్న పిల్లలేనని తెలుసుకున్న టీడీపీ శ్రేణులు వారి వెనుక వైసీపీ నేతలున్నారని అనుమానిస్తున్నారు. సత్తెనపల్లి ప్రజాగళం సభలో చంద్రబాబు పిల్లలను చూపుతూ తన నుంచి భవిష్యత్ భరోసా కోరుకుంటున్నారని, వారంతా టీడీపీ విజయం సాధించాలని కోరుతూ సభలకు వస్తున్నారని చెప్పిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే దానిని తిప్పికొట్టేందుకు పిల్లలతోనే ప్రచారం రథంపై దాడి చేయించారని అంటున్నారు.

నన్ను అడిగేదెవడ్రా!

(మొదటి పేజీ తరువాయి)

మా నోటీసులకు మీరేమీ స్పందించలేదని తదుపరి చర్యలు కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తాం' అని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎంకే మీనా నోటీసులో పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని, చట్టాలను త్రికరణశుద్ధితో పాటిస్తానని ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన జగన్ కోడ్ ఉల్లంఘించారని ఈసీ తేల్చడమే పెద్ద విషయం. అది వ్యక్తిగతంగా ఆయనకు, సీఎం పదవికి అప్రతిష్ఠ. తప్పును సరిదిద్దుకోవాల్సిన జగన్ మరింత రెచ్చిపోయారు. 'నేనింతే.. అలాగే నోరు పారేసుకుంటా. అడ్డగోలుగా మాట్లాడుతా' అని పొదిలి సభ సాక్షిగా నిరూపించుకున్నారు. చంద్రబాబుపై పదేపదే అడ్డగోలు ఆరోపణలు, దూషణలకు దిగారు. తానేదో తెలియక తిట్టలేదని, ఇప్పుడు కావాలనే పదేపదే తిడుతున్నానని, ఏం చేసుకుంటారో చేసుకోండంటూ రెచ్చిపోయారు. తన నైజం ఇంతేనని, తాను రాజ్యాంగానికి, రాజ్యాంగ వ్యవస్థలకు జవాబుదారీ కానంటూ జగన్‌రెడ్డి తన అడ్డగోలు మాటలతో తేల్చిచెప్పినట్లయింది. ఇక తేల్చుకోవాల్సింది ఎన్నికల కమిషనే. ముఖ్యమంత్రే కోడ్ ఉల్లంఘించి ప్రతిపక్షనేతలపై బజారు భాషలో తీవ్ర దూషణలకు దిగితే, ఆయన పార్టీ నేతలు ఇప్పటికే అన్ని కట్టుబాట్లు, హద్దులు దాటేశారు. బూతులు మాట్లాడుకునేవారు కూడా సిగ్గుపడేలా వారి భాష ఉంటోంది.

జగన్ తీరే వేరు

జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించక ముందు వైసీపీ అధినేతగా ఒంటెత్తుపోకడలు పోయారు. తను అనుకున్నదే జరగాలని, తన మాటే శాసనంగా నేతలు, కార్యకర్తలు భావించాలని కోరుకున్నారు. అలాగే పార్టీని నడిపించారు. భావప్రకటనా స్వేచ్ఛ, అంతర్గత ప్రజాస్వామ్యం, ప్రశ్నిస్తే హుందాగా స్వీకరించడం వంటివి ఆయనకు నచ్చవు. పార్టీ కాబట్టి ఆ విధానం చెల్లుబాటయింది. ఎన్నికలపుడు ప్రజలను నమ్మించాలంటే ఆ వైఖరితో ముందుకెళ్తే కుదరదు. అందుకే అపర ప్రజాస్వామ్యవాది అనే ముసుగు తొడిగి జనాన్ని ముద్దులతో ముంచెత్తి గద్దెనెక్కారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణమే ముసుగు తొలగించి మీడియాను, ప్రతిపక్షాలను బెదరగొట్టారు. ఇలా 58 నెలలుగా జగన్ తనదైన ఒంటెత్తు విధానాలతో రాష్ట్రాన్ని పాలించారు. ఉన్న రాజధానిని సమాధి చేసి, మూడు రాజధానులన్నారు. ప్రజలు, కోర్టులు ప్రశ్నిస్తే.. 'నా ఇష్టం' అన్నారు. మూడు రాజధానులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోలేదన్న కసితో శాసనమండలి రద్దుకు సిఫారసు చేశారు. ఆ తర్వాత వెనక్కి తగ్గారు. కేంద్ర చట్టాలు ఉంటాయన్న విషయం తెలియకుండా సొంత ఆలోచనలతో దిశ చట్టం తీసుకురాబోయి బొక్కబోర్లాపడ్డారు. కరోనా సమయంలో ఎన్నికలేమిటని అన్నందుకు నాడు ఎన్నికల కమిషనర్‌నే అభిశంసించే ప్రయత్నం చేసి కోర్టులతో చీవాట్లు తిన్నారు. వైసీపీ, పార్టీ నేతలు, కార్యకర్తలు తన చెప్పుచేతల్లో ఉంటూ తన కనుసైగలకు స్పందిస్తుంటే కోర్టులు, ఎన్నికల క మిషన్, శాసనమండలి, వంటి రాజ్యాంగ వ్యవస్థలు తనకు ఎదురు రావడం ఏమిటని ధిక్కరించే స్వభావం జగన్‌ది. తన ఏలుబడిలో ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలకు నోరులేకుండా చేసేందుకు బ్రిటీష చట్టాలను తీసుకొచ్చి ఉక్కుపాదం కింద నలిపివేయాలని శత విధాలా ప్రయత్నించి విఫలమయ్యారు. రాష్ట్రానికి రాజధానిని లేకుండా చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా రికార్డుకెక్కిన జగన్ తన చర్యలతో 58 నెలల పాలనలో ప్రజలకు దూరమయ్యారు. పరదాల చాటున ప్రయాణం, పచ్చని చెట్ల నరికివేత, పర్యటన ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేత వంటి పనులు తనకు మాత్రమే సాధ్యమని నిరూపించుకొని ప్రజల్లో పలుచనయ్యారు. తీవ్ర ఆర్థిక నేరాలు ఎదుర్కొంటున్న జగన్... చంద్రబాబును తీవ్ర నేరస్వభావం ఉన్న వ్యక్తిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు.

ఈసీ ఆదేశాలు బేఖాతర్

ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంఘించి సీఎం జగన్ దూషణల పర్వం కొనసాగిస్తుండగా, ఆయన పార్టీ సోషల్ మీడియా కూడా ఈసీ ఆదేశాలను లెక్కచేయడం లేదు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లను కించపరిచేలా వైసీపీ అధికారిక సోషల్ మీడియాలో పలు పోస్టులు పెట్టారు. వృద్ధులకు పెన్షన్లు ఇవ్వకుండా ఈసీ అడ్డుకున్నట్టుగా, మరోవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఈ చర్యలను ఎంజాయ్ చేస్తున్నట్టుగా పోస్టు పెట్టారు. ఇలాగే ఇద్దరిపై పలు పోస్టులు పెట్టారు. వైసీపీ సోషల్ మీడియాలో వీటిని తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా ఖాతరు చేయలేదు.

జగన్ నెత్తుటి భాషపై ఫిర్యాదు

తన దుందుడుకు చర్యలతో ప్రజల్లో చులకనైపోయిన జగన్‌రెడ్డి తనలాగే ప్రతిపక్షనేత చంద్రబాబును ప్రజల్లో పలుచన చేయాలని అడ్డగోలు భాష వాడుతూ తిడుతున్నారు. ఇటీవల సభల్లో ఆయన జెండా, అజెండా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను తిట్టడమే. తిట్లమైకంలో జగన్ తాను రాష్ట్రానికి ముఖ్యమంత్రినని, రాజ్యాంగ వ్యవస్థలకు జవాబుదారీగా వ్యవహరించాలన్న విషయం మరిచిపోయారు. గలీజు భాష వాడుతున్నారు. ఈ నెల 2న మదనపల్లి సభలో చంద్రబాబును అరుంధతి సినిమాలో కామ వాంఛతో రగిలిపోయే పశుపతి పాత్రతో పోల్చే ప్రయత్నం చేశారు.పేదల రక్తం పీల్చేందుకు ముఖ్యమంత్రి కుర్చీని చూసి 'నేను వదల బొమ్మాలి' అంటూ కేకలు పెడుతున్నారంటూ జగన్ తీవ్ర భాష వాడారు. ఆ మరుసటి రోజు పూతలపట్టు సభలో.. ఈ ఎన్నికలు జగన్‌కు, చంద్రబాబుకు మధ్యకాదని, నేరాలు చేయడమే అలవాటుగా ఉన్న చంద్రబాబుకు, ప్రజలకు మధ్య యుద్ధం జరుగుతోందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "చంద్రబాబు గారు అనే చంద్రముఖిని పెట్టెలో బిగించి, మళ్లీ లకలక అంటూ మన రక్తం తాగేందుకు రాకుండా జాగ్రత్తపడాల్సిన సమయం వచ్చింది" అని తీవ్రంగా వ్యాఖ్యానించారు. 4వ తేదీన నాయుడుపేట సిద్ధం సభలో చంద్రబాబును 31 మంది అవ్వాతాతల హంతకుడిగా అభివర్ణించారు. "పెన్షన్‌లు అందుకోలేక కేవలం రెండు రోజుల వ్యవధిలో 31 మంది అవ్వాతాతలు మరణించారు. చంద్రబాబును హంతకుడు అనలేకపోతే అంతకుమించిన దారుణమైన పదం ఉంటే అది అందామా అని ఆలోచన చేయమని కోరుతున్నా" అంటూ పిలుపునిచ్చారు. ఈ పెద్ద మనిషి చంద్రబాబు మనిషా లేక శాడిస్టా? అంటూ ఇంకా అనేక మాటలు అనేశారు. ఇలా సిద్ధం సభల్లో ముఖ్యమంత్రి తన హోదాను, స్థాయిని మరచి పదేపదే నెత్తుటి భాషను వాడారు. ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టేలా బాబును హంతకుడిగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. జగన్ మాట్లాడిన అడ్డగోలు మాటలపై సహజంగానే తెలుగుదేశం పార్టీ స్పందించింది. జగన్ ఎన్నికల కోడ్ ఉల్లంఘించి అడ్డగోలు భాష వాడుతున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మీనాకు ఫిర్యాదు చేశారు. సిద్ధం సభల్లో జగన్ మాట్లాడిన వీడియోలున్న పెన్‌డ్రైవ్‌ను కూడా అందించారు.

సీఎం జగన్ హద్దుమీరారని తేల్చిన ఈసీ

సిద్ధం సభల్లో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడిన మాటలు, ప్రతిపక్ష నేత చంద్రబాబుపై చేసిన దూషణలను ఎన్నికల కమిషన్ పరిశీలన చేసింది. కేంద్ర ఎన్నికల కమిషన్ గత నెల 16న విడుదల చేసిన ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తూ ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారని నిర్ధారించింది. 'ఫిర్యాదులోని అంశాలు, వీడియోలను పరిశీలించగా వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారు' అని ఈసీ నిర్ధారించింది. ఈ నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలపై 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ ఆదివారం ఉదయం ఈసీ నోటీసు పంపించింది.

మరింత రెచ్చిపోయిన జగన్

హద్దులు మీరి మాట్లాడారని ఈసీ నోటీసులు ఇస్తే.. రాజ్యాంగాన్ని, వ్యవస్థలను గౌరవించే వ్యక్తులు మరోసారి నోరు జారకుండా జాగ్రత్త పడతారు. అయితే, తాను వ్యవస్థలకు అతీతుడినని, తన ఇష్టం వచ్చినట్లు మాట్లాడతానని, ఏం చేసుకుంటారో చేసుకోండన్నట్టుగా ఆదివారం ప్రకాశం జిల్లాలో జరిగిన సభల్లో జగన్ మరింత రెచ్చిపోయారు. చంద్రబాబును పదేపదే తిట్టారు.సంక్షేమ పథకాలు అమలు కాకుండా శాడిస్టులా అడ్డుకుంటున్నారని అడ్డగోలు భాష వాడారు. ఈ మాటలే అనొద్దని జగన్‌రెడ్డికి ఈసీ చెప్పింది. రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలు గౌరవంగా, హుందాగా ఉండాలని సూచించింది. వ్యక్తిగత ఆరోపణలు, దూషణలకు దిగొద్దని జగన్‌కు కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని అంశాలను గుర్తుచేసింది. ఎలా మాట్లాడాలో, ఎలాంటి భాష వాడకూడదో నోటీసుల్లో సవివరంగా తెలిపింది. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి కట్టుదాటకూడదు. నోరుజారకూడదు. ఒకవేళ హద్దుమీరి మాట్లాడారని ఈసీలాంటి రాజ్యాంగబద్ధమైన సంస్థ గుర్తు చేస్తే తన ప్రవర్తన మార్చుకోవాలి. తప్పులను సరిదిద్దుకోవాలి. అయితే జగన్ అందుకు భిన్నంగా ప్రకాశం జిల్లా సిద్ధం సభల్లో తన నోటి దురుసు భాషనే పదేపదే ప్రయోగించారు. చేతిలో అధికారం ఉంది.. అంతకుమించిన అహంకారం కూడా ఉందని తన మాటలతో నిరూపించుకున్నారని రాజకీయపక్షాలు మండిపడుతున్నాయి. అధికార పార్టీ, అందునా ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి గౌరవంగా, హుందాగా ఉండాలి. ఎన్నికల కోడ్‌ను పాటించాలి. ప్రతిపక్షాల ఆరోపణలు, విమర్శలను సంయమనంతో తిప్పికొట్టాలి. ముఖ్యమంత్రే ఈసీ ఆదేశాలను ధిక్కరిస్తే మిగతా వారి సంగతేంటి? సీఎం తరహాలోనే అధికార, ప్రతిపక్ష పార్టీ నేతలు రెచ్చిపోయి గలీజు బాషతో తిట్టుకుంటే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించేదెవరు? అదే జరిగితే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగే అవకాశం ఉంటుందా? రాజ్యాంగ వ్యవస్థలను ముఖ్యమంత్రే గౌరవించకపోతే సామాన్యులకు చట్టాలపై గౌరవం ఉంటుందా? మాటల్లో హద్దులు మీరిన జగన్, ఎన్నికల సమయంలో చేతల్లో కూడా అదే పంథాను చూపిస్తే రాష్ట్రం పరిస్థితి ఏవిటని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. హద్దులు మీరిన ముఖ్యమంత్రిపై ఈసీ గట్టి చర్యలు తీసుకోకపోతే ఆయన బాటలోనే వైసీపీ నాయకత్వం వెళ్తుందని, ఎన్నికల నిర్వహణనే సవాల్‌గా మార్చేస్తారని ప్రజా ఉద్యమాల వేదిక ఆందోళన వ్యక్తం చేసింది.

జగన్‌కు ఈసీ నోటీసులు

- 'చంద్రబాబు పశుపతి' వ్యాఖ్యలపై సీరియస్
- 48 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం
- టీడీపీ నేతల ఫిర్యాదుతో నోటీసులు జారీ

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) సీరియస్ అయింది. ఆయనకు నోటీసులు జారీ చేసింది. కోడ్‌ను ఉల్లంఘించి టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబుపై సీఎం జగన్ చేసిన తీవ్ర వ్యాఖ్యలపై అందిన ఫిర్యాదుల మేరకు సీఈసీ సూచనలతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా ఈ నోటీసులు జారీ చేశారు. చంద్రబాబుపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ నెల 2, 3, 4 తేదీల్లో మదనపల్లె, పూతలపట్టు, నాయుడుపేటలలో 'మేమంతా సిద్ధం' పేరుతో నిర్వహించిన సభల్లో చంద్రబాబుపై సీఎం జగన్ అనుచిత వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. చంద్రబాబుకు ప్రజలను మోసం చేయడం అలవాటని, ఇంటింటికీ పింఛను అందకుండా చేసి 31 మందిని చంపారని, శాడిస్ట్ అని, చంద్రబాబు 'అరుంధతి' సినిమాలో 'పశుపతి'లా తిరిగి వచ్చారంటూ విమర్శలు గుప్పించారు. చంద్రబాబుపై దురుద్దేశపూర్వకంగా సీఎం జగన్ ఈ వ్యాఖ్యలు చేశారని, ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని, గీత దాటిన సీఎం జగన్‌పై వేటు వేయాలని టీడీపీ నేత వర్ల రామయ్య ఈ నెల 5న ఎన్నికల ప్రధానాధికారి మీనాను కలిసి ఫిర్యాదు చేశారు. సీఎం వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో క్లిప్పింగులను కూడా ఫిర్యాదుకు జత చేశారు. వీటిని పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా వీటిని కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదించారు. సీఎం జగన్ వ్యాఖ్యలు కోడ్ ఉల్లంఘన కిందకే వస్తాయని ప్రాథమికంగా తేల్చారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఆదివారం సీఎం జగన్‌కు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందిన 48 గంటల్లో వివరణ ఇవ్వాలని తెలిపారు. నిర్దేశ గడువులోగా వివరణ రాకపోతే తదుపరి చర్యల కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తామని మీనా సదరు నోటీసులో స్పష్టం చేశారు.

జగన్ కుంభకర్ణుడు

(మొదటి పేజీ తరువాయి)

షర్మిల మాట్లాడుతూ.. "వైఎస్ఆర్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు పెద్ద పీట వేశారు. జగన్ సీఎం అయ్యాక ప్రాజెక్టులకు దిక్కే లేదు. కడప స్టీలు ఫ్యాక్టరీ వైఎస్ కల. అది పూర్తయి ఉంటే ప్రత్యక్షంగా 25వేల మందికి, పరోక్షంగా మరో 20 వేల మందికి ఉద్యోగాలు వచ్చేవి. జగన్ సీఎం అయిన తర్వాత శంకుస్థాపనలు తప్పిస్తే స్టీలు ఫ్యాక్టరీ ముందుకు కదలలేదు. జగన్ పాలనంతా హత్యా రాజకీయాలు, దౌర్జన్యాలు, దోపిడీలకే పరిమితమైంది. జనం ఓట్లేసి గెలిపించింది దీని కేనా..? పెండ్లిమర్రి మండలంలోని యాదవాపురం గ్రామంలో భూమి కోసం ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరులు శ్రీనివాసయాదవ్ అనే వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. ఇది పోలీసుల ప్రమేయంతో జరిగిందని ఆరోపణలు రావడంతో స్థానిక సీఐని, ఎస్ఐని సస్పెండ్ చేశారు. అయితే ఎవరిని దోషులుగా చూపుతున్నారో వారి పేర్లను కనీసం ఎఫ్ఐఆర్‌లో కూడా నమోదు చేయలేదు. ఎమ్మెల్యే, ఎంపీకి సన్నిహితులు కాబట్టి ఇప్పటికీ వారు యథేచ్ఛగా బయట తిరుగుతున్నారు. వివేకా హత్య జరిగి ఐదేళ్లయింది. హత్య చేసిన వారు బయట తిరుగుతున్నారు. అన్ని ఆధారాలున్నా చర్యలు లేవు. అవినాశ్‌రెడ్డి నిందితుడని సీబీఐ చెప్పింది. అటువంటి వ్యక్తికి మళ్లీ జగన్ టికెట్ ఇచ్చారు. హత్య చేసిన వారిని గెలిపించాలని చూస్తున్నారు. వివేకా స్వయాన జగన్‌కు బాబాయి. అయినా కనీస న్యాయం జరిగే పరిస్థితి కూడా లేదు. నిందితులు చట్టసభల్లోకి వెళ్లకూడదనే నేను ఎన్నికల్లో నేను నిలబడ్డా. న్యాయం ఒక, వైపు అధర్మం మరోవైపు.. వైఎస్ బిడ్డ ఓ వైపు, వివేకాను హత్య చేసిన నిందితులు మరోవైపు ఉన్నారు.. ఎవరిని గెలిపించాలో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి" అని కోరారు.

షర్మిలను చూస్తే వైఎస్ గుర్తొస్తారు: సునీత

షర్మిలను ఎంపీగా చూడాలన్నదే తన తండ్రి వివేకానందరెడ్డి కోరిక అని ఆయన కుమార్తె సునీత తెలిపారు. షర్మిలను చూస్తే వైఎస్ఆర్ గుర్తుకొస్తారని, ఆయన గుణగణాలన్నీ ఆమెలో ఉంటాయని తన తండ్రి అనేవారని తెలిపారు. పక్కా స్కెచ్‌తోనే వివేకాను హత్య చేశారని సునీత ఆరోపించారు. "వివేకా హత్య పర్సనల్ విషయమని అంటున్నారు. ఇదసలు పెద్ద విషయం కాదన్నట్లు సజ్జల రామక్రిష్ణారెడ్డి అర్థం లేకుండా మాట్లాడుతున్నారు. సలహాదారు అంటే ఎలా ఉండాలో అర్థం చేసుకోవాలి. వివేకాను చంపితే పర్సనల్ ఇష్యూ ఎలా అవుతుంది. వివేకా హత్య గురించి ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి మాటలు విడ్డూరంగా ఉన్నాయని.. ఎవరో ఫోను చేసి ఆయనకు చెప్పారంట. అక్కడ రక్తపు మరకలు తుడిచి వేస్తుంటే ఎందుకు చూస్తూ ఉన్నారు? ఎంపీ, ఎమ్మెల్యేలకు వారి సొంత ప్రయోజనాలే తప్ప ప్రజల గురించి పట్టించుకోరు. అలాంటి వారికి ఓట్లు వేయవద్దని, మీ ప్రయోజనాల కోసం పనిచేసేవాళ్లు కావాలంటే షర్మిలను ఎన్నుకోవాలి" అని సునీత కోరారు. కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి, సీపీఐ నేత గాలి చంద్ర, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఓబులేసు మాట్లాడుతూ.. జిల్లాలో భూకబ్జాలు విపరీతంగా పెరిగిపోయాయని, ఎవరైనా ఎదురుతిరిగినా వారిని హతమారుస్తున్న పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉందని వాపోయారు. కమలాపురం నియోజకవర్గంలో ఎన్నో ఏళ్ల క్రితం ప్రారంభం చేసిన గాలేరు-నగరి సుజల స్రవంతి, జీఎన్ఎస్ఎస్‌లో భాగమైన సర్వరాయసాగర్ వంటి ప్రాజెక్టులు నేటికీ పూర్తి కాలేదన్నారు. రైతులు సాగునీరు లేక, ప్రజలకు తాగునీరు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. రైతులకు అప్పుల నుంచి విముక్తి రావాలంటే ప్రభుత్వాలు మారాల్సిందేనన్నారు. ఎంపీగా వైఎస్ షర్మిలను, ఎమ్మెల్యేగా గాలి చంద్రను గెలిపించాలని కోరారు.

వ్యూహాత్మకంగా సునీత అడుగులు

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఆయనకు సహకరిస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి పార్టీని ఓడించాలని జగన్ సోదరి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, వివేకా కూతురు డాక్టర్ సునీత కంకణం కట్టుకున్నారు. ఎన్ని బెదిరింపులు వచ్చినా లెక్క చేయకుండా సీఎం జగన్, ఎంపీ అవినాశ్‌రెడ్డిలను వివేకా హత్యపై కడిగేస్తున్నారు. వివేకాను చంపించింది ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి అని సీబీఐ చెప్పిందంటూ జనాల్లోకి తీసుకెళుతున్నారు. షర్మిల చేపట్టిన బస్సుయాత్రలో తొలిరోజు సునీత కూడా పాల్గొన్నారు. మళ్లీ తిరిగి ఆదివారం సీఎం జగన్ మేనమామ పి.రవీంద్రనాథరెడ్డి నియోజకవర్గం కమలాపురంలో ప్రచారంలోనూ ఆమె పాల్గొన్నారు. షర్మిల, సునీతలు చాలా వ్యూహాత్మకంగా ముందుకు వెళుతున్నారు. వివేకాకు ఆప్తులుగా ఉన్న వారితో సునీత నేరుగా మాట్లాడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో షర్మిలను గెలిపించాలని కోరుతున్నారు. ఆదివారం శాసనమండలి మాజీ ఎమ్మెల్సీ, డిప్యూటీ చైర్మన్ ఎస్వీ సతీష్‌రెడ్డి, వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, డాక్టర్ ఎస్ఎం బాషాలను సునీత కలిశారు. అలాగే వివేకా సన్నిహితులను కూడా కలుస్తూ వారందరినీ షర్మిల వైపు తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాజమహేంద్ర వరం పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి

జగన్ అబద్ధాలతో మోళ్లుగా నల్లమల అడవి

- ఆడపడుచుల పసుపు తాళ్లు తెంపేస్తున్నాడు: పురందేశ్వరి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): "పవన్ కల్యాణ్ నటించిన అత్తారింటికి దారేది సినిమాలో హాస్యన టుడు బ్రహ్మానందంను ఓ చెట్టుకింద నుంచో బెట్టి, 'అబద్ధాలు ఆడితే ఆకులు రాలిపోతాయి' అని చెపుతారు. అలా, అబద్ధాల కోరు సీఎం జగన్‌ను నల్లమల అడవుల్లోకి తీసుకెళ్లి కూర్చోపెడితే... అతని అబద్ధాలకు ఏకంగా అడవే మోడైపోతుందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం లోక్‌సభ కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి ఎద్దేవా చేశారు. ఇక్కడ ఆదివారం సాయంత్రం జరిగిన రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ కూటమి నేతలు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. "నరంలేని నాలుక ఏదైనా మాట్లాడవచ్చు. దానికో పద్ధతి ఉండాలి. జగన్ మద్య నిషేధం పూర్తిగా అమలుచేసి మళ్లీ ఓటు అడుగుతానని చెప్పి ఓట్లేయించుకున్నాడు. నిషేధం మాట దేవుడెరుగు. నాసిరకం మద్యం తయారు చేయించి అత్యధిక ధరలతో సామాన్యులను నిలువునా దోపిడీ చేస్తున్న దుర్మార్గుడు. ఆడపడుచుల పసుపు తాళ్లు తెంపేస్తున్న దుర్మార్గుడు. ఇతడిని ఇంకా మనం సహించాలా? రైతులను దగా చేస్తున్నారు. కనీస గిట్టుబాటు ధర లేకుండా, వ్యవసాయ ఉత్పత్తులను కొనేవాడు లేకుండా చేసి ఇబ్బంది పెడుతున్నాడు. శీతల గిడ్డంగులు ఏర్పాటు చేస్తానన్నాడు. ఏవీ..? ఇటువంటి దుర్మార్గుడని ఇంకా సంహించాలా? ఏ ప్రభుత్వం అయినా నిర్మాణాత్మక పనులతో తమ పాలన మొదలు పెడుతుంది. కానీ ఈ దుర్మార్గుడు ప్రజావేదిక, అన్నక్యాంటీన్ల విధ్వంసంతో మొదలెట్టాడు. అన్ని వర్గాలను దోచేశాడు. మట్టి, ఇసుక, మైన్స్, లిక్కర్, డ్రగ్స్ అన్నీ మాఫియాలే.. ఇతన్ని మనం ఇంకా సహించాలా? అనుభవజ్ఞుడైన చంద్రబాబు యుక్తి, పవన్ శక్తి, మోదీ స్ఫూర్తితో ఈ రాష్ట్రాన్ని రక్షించడానికి, అభివృద్ధి చేయడానికి ఈ దుర్మార్గుడైన జగన్‌ను ఓడించాలి. వైసీపీని ఇంటికి పంపించాలి. బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీల పొత్తు చారిత్రక ఘట్టం మాత్రమే కాదు... చారిత్రక అవసరం' అని పురందేశ్వరి అన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ.. సైకో జగన్‌ను సాగనంపడానికే టీడీపీ-జనసేన, బీజేపీ ఒకటయ్యాయన్నారు.

ఇంటింటి ప్రచారంపై స్పష్టతివ్వండి

- కేంద్ర ఎన్నికల సంఘానికి కనకమేడల లేఖ

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీకి కూడా ముందస్తు అనుమతి తీసుకోవాలన్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాలపై టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందస్తు అనుమతి అంశంపై స్పష్టత ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు ఆయన లేఖ రాశారు.

జనానికి నరకం... కేడర్‌కు నీరసం!



- ఎండ తగ్గేవరకు ఏసీ బస్సులో జగన్
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు
- రోడ్ షో ఫ్లాప్.. సభ మధ్యలోనే ఖాళీ
- వలంటీర్లపై పొగడ్తలు.. కేడర్ ఊసే లేదు
- స్థానిక సమస్యల ప్రస్తావన కరువు
- డీలాపడిన అభ్యర్థులు.. కనిగిరిలో వెలవెల..
- పొదిలిలో చిమ్మచీకటిలో బస్సు యాత్ర
- 1400 బస్సులు పెట్టినా రాని జనాలు
- గంటల కొద్దీ విద్యుత్ కోతతో అగచాట్లు



ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం దొనకొండ అడ్డరోడ్డు వద్ద ఆదివారం నిర్వహించిన సభలో జగన్ మాట్లాడుతుండగానే ఖాళీగా సభా ప్రాంగణం



సభ జరుగుతుండగానే ప్రాంగణం సమీపంలోనే మద్యం సేవిస్తున్న యువకులు

ఒంగోలు, (ఆంధ్రజ్యోతి)/కనిగిరి, ఏప్రిల్ 7: ప్రకాశం జిల్లాలో 'మేమంతా సిద్ధం' అంటూ సీఎం జగన్ ఆదివారం నిర్వహించిన బస్సుయాత్ర వెలవెలబోయింది. జనం లేకుండా సాగిన సభలో తన గొప్పలు చెప్పుకొంటూ టీడీపీ అధినేత చంద్రబాబుపై విమర్శలకే పరిమితమయ్యారు. దీంతో వైసీపీ శ్రేణులు ఉసూరుమన్నాయి. రమారమి 55 కిలో మీటర్లు సాగిన బస్సుయాత్ర నేపథ్యంలో మార్గమధ్యంలోని మున్సిపాలిటీలు, గ్రామాలలో విద్యుత్ కోత విధించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందిపడ్డారు. అదేసమయంలో ఏసీ బస్సులో ప్రయాణించిన జగన్ మధ్యలో అలా పైకి వచ్చి, ఇలా లోపలికి వెళ్లడంతో వచ్చిన కొద్దిపాటి జనం కూడా నిరుత్సాహపడ్డారు. చివరకు సభావేదిక వద్ద కెమెరా జిమ్మిక్కులకు అనుగుణంగా ఏర్పాటు చేసుకున్న ర్యాంప్ చుట్టూ ఎంపిక చేసుకున్న కేడర్, వెనుక రోడ్డువైపు ప్రజలు ఉండటంతో సభ మధ్యభాగం జనం లేకుండా బోసిపోయింది. ఆదివారం ఉదయం యాత్ర ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం జువ్విగుంటలో ప్రారంభమైంది. పొన్నలూరులో మంత్రి ఆదిమూలపు సురేశ్ గజమాలతో స్వాగతం పలికే ఏర్పాటు చేయగా కీలక నాయకులు డుమ్మా కొట్టారు. 11 గంటల తర్వాత కనిగిరి నియోజకవర్గంలోకి ప్రవేశించిన బస్సుయాత్రకు గంగదేవాలయం వద్ద స్థానిక నేతలు స్వాగతం పలకగా మిట్టమధ్యాహ్నం కనిగిరి నడిబొడ్డుకు వచ్చేసరికి వెయ్యిమంది కూడా లేరు. బస్సు బయటకు వచ్చిన జగన్.. పలుచగా ఉన్న జనాన్ని చూసి రెండుచేతులు జోడించి రెండు నిమిషాల్లోనే లోపలికి వెళ్లిపోయారు. అక్కడి నుంచి చిన ఆరికట్ల వద్ద మధ్యాహ్న భోజన విరామ ప్రాంతం వరకు వచ్చి సాయంత్రం 5గంటల ప్రాంతంలో సభావేదిక వద్దకు చేరారు. అక్కడిదాకా సుమారు 55 కిలో మీటర్ల మేర సాగిన బస్సుయాత్రలో రోడ్‌షో జనం లేక వెలవెలబోయింది. షెడ్యూల్ ప్రకారం దొనకొండ అడ్డరోడ్డు కొనకనమిట్ల వద్ద సాయంత్రం 4.30 గంటలకు సభ ప్రారంభం కావాల్సి ఉంది. ప్రాంగణం నిండకపోవడంతో అర గంట పాటు భోజన విరామ ప్రాంతంలోనే జగన్ ఉండిపోయారు. తర్వాత అంతో ఇంతో జనం చేరుకున్నారని సమాచారం అందాక వచ్చారు. సభలోనూ ర్యాంప్ చుట్టూ తప్ప జనం కనిపించలేదు.

జనం తిరుగుముఖం

సీఎం జగన్ ప్రసంగం ప్రారంభించిన 12 నిమిషాల నుంచి జనం సభా ప్రాంగణం నుంచి వెళ్లిపోవడం కనిపించింది. కాగా, తన ప్రసంగంలో జగన్ పూర్తిగా చంద్రబాబుపై విమర్శలు చేస్తూ మీ బిడ్డ వచ్చాడంటూ తనను తాను పొగుడుకోవడానికే పరిమితమయ్యారు. బీజేపీ నేతల ప్రస్తావన తెచ్చి 'ప్రధాని మోదీ గారు' అని సంబోధించారు. జగన్ తన ప్రసంగంలో వలంటీర్లను పదేపదే పొగుడుతూ ఆకాశానికెత్తారు. ఏ సందర్భంలోనూ పార్టీ కార్యకర్తల ఊసెత్తలేదు.

మద్యం, నగదు పంపిణీ

ఆర్టీసీ, విద్యాసంస్థల బస్సుల్లో జనసమీకరణకు ప్రాధాన్యమిచ్చినప్పటికీ సభాస్థలికి నాలుగు బస్సులలో మాత్రమే నిండుగా జనం రావడం కనిపించింది. వారిలో కూడా సాధారణ ప్రజలు సభావేదిక వైపు రాలేదు. ఇక ప్రతి బస్సులో, వాహనంలో మద్యం సరఫరా, బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సభాప్రాంగణం వెలుపల అనేక మంది మద్యం సేవిస్తూ కనిపించారు. యాత్రసాగిన మార్గంలోనూ పలు చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల నుంచి వచ్చే జనానికి రోజువారీ కూలీ కింద డబ్బులు ఇచ్చినట్లు తెలిసింది. కొనకనమిట్ల సిద్ధం సభకు రాష్ట్రంలోని వివిధ డిపోల నుంచి 1,400 ఆర్టీసీ బస్సులను గ్రామాలకు పంపినప్పటికీ వెళ్లేందుకు ప్రజలు ఆసక్తి చూపలేదు. మద్యం, మనీ పంపిణీ చేసినప్పటికీ బస్సుల్లో ఎక్కేందుకు ససేమిరా అన్నారు. దీంతో ఎక్కువ సంఖ్యలో బస్సులు ఖాళీగానే తిరుగుముఖం పట్టాయి. మరోవైపు, జగన్ పర్యటన కోసం పెద్దసంఖ్యలో బస్సులు కేటాయించిన ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం, ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో రోజువారీ ప్రయాణికులు నానా తిప్పలు పడ్డారు. కనిగిరిలో రోడ్‌షో ప్రజలను అవస్థలకు గురిచేసింది. ముందు రోజే పచ్చనిచెట్లపై వేటుపడింది. జగన్ భద్రత పేరుతో కనిగిరి-కందుకూరు రోడ్డులోని భారీ వృక్షాలను నరికివేశారు. ఇంటర్‌నెట్, లోకల్ డిష్ వైర్లను సైతం కట్ చేయించారు. కనిగిరి నలుమూలల నుంచి వచ్చే దారులను పోలీసులు దిగ్బంధించడంతో జనాలు రాక వ్యాపారాలు వెలవెలబోయాయి.

ఆసుపత్రుల్లో ఆర్తనాదాలు!

బస్సుయాత్ర సాగిన ప్రాంతంలో సుమారు 12 గంటల పాటు విద్యుత్ కోత విధించారు. ఉదయం 6 గంటల నుంచే సరఫరా నిలిపివేశారు. ఇక జగన్ సభ జరిగిన సమయంలో అక్కడికి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న పొదిలితోపాటు దాదాపు అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేశారు. ప్రభుత్వాసుపత్రికి చెందిన సర్వీసు వైర్లను విద్యుత్ అధికారులు భద్రత పేరిట తొలగించారు. దీంతో ప్రభుత్వాసుపత్రిలో రోగులు నానా అవస్థలు పడ్డారు. వివిధ చికిత్సలతో ఆసుపత్రిలో చేరిన వారు వార్డుల్లో గాలి అందక ఊపిరిపోయినంత పనైందని వాపోయారు. చేసేది లేక గాయాలతోనే ఆసుపత్రి వరండాలోకి, చెట్లకిందకు చేరుకుని సేద తీరారు. ఇక, డయాలసిస్ రోగులకైతే ఆదివారం రావద్దని ముందే సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.

నేనే రూ.3 వేలు ఇస్తున్నా!

- బాబు ఇచ్చింది వెయ్యే.. పింఛన్‌పై జగన్ అబద్ధాలు
- తన వల్లే పేదలు బతుకుతున్నారంటూ గొప్పలు

ఒంగోలు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ ఆదివారం ప్రకాశం జిల్లాలోని కొనకనమిట్లలో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభలో అబద్ధాలనే వల్లెవేశారు. పేదల కోసం తాను తప్ప గతంలో పాలించిన వారెవ్వరూ చేసిందేమీ లేదన్నారు. చంద్రబాబుపై పదేపదే నిందలు వేసే ప్రయత్నం చేశారు. చంద్రబాబు పాలనలో వాస్తవంగా పెన్షన్ రూ.2 వేలు ఇవ్వగా వెయ్యి మాత్రమే ఇచ్చారన్న జగన్.. తాను రూ.3 వేలు ఇస్తున్నట్లు చెప్పారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన వాటిలో 99 శాతం అమలు చేశానంటూ చెప్పుకొచ్చారు. చంద్రబాబు వస్తే పేదలకు మంచి చేసే పథకాలు ఆగిపోతాయని, అందుకే తిరిగి తనను గెలిపించాలని ప్రజలను మభ్యపెట్టేలా మాట్లాడారు. నిమ్మగడ్డ రమేశ్ అనే వ్యక్తి ద్వారా చంద్రబాబు వలంటీర్లపై ఫిర్యాదు చేయించి అవ్వాతాతలకు ఇంటికి వెళ్లి పెన్షన్లు ఇవ్వకుండా అడ్డుకున్నారని మరోసారి అబద్ధాలు చెప్పారు. చంద్రబాబు అక్కసు, అసూయతో పేదల పథకాలకు అడ్డుపడుతూ శాడిస్టులా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దాదాపు 45 నిమిషాలు మాట్లాడిన ఆయన ఆద్యంత తానే అన్నీ చేశానని, తన వల్లే పేదలు బతుకుతున్నారని చెప్పారు. కూటమి పార్టీలను ఓడించి మీ బిడ్డను ఆదరించండని కోరారు.



అట్టపెట్టెల్లో బయట పడిన నోట్ల కట్టలు

ఆర్టీసీ కార్గోలో రూ. 22లక్షల నగదు

- అట్టపెట్టెల్లో తరలిస్తుండగా.. సీజ్

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 7: ఏపీఎస్ ఆర్టీసీ కార్గో వాహనంలో అట్టపెట్టెల్లో నోట్ల కట్టలు కలకలం రేపాయి. హైదరాబాద్ నుంచి జంగారెడ్డిగూడెం వస్తున్న ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన కార్గో వాహనంలో నగదు తరలిస్తున్నట్లు పోలీసులకు ముందుగానే సమాచారం అందింది. ఆదివారం ఉదయం 9 గంటలకు జంగారెడ్డిగూడెం గంగానమ్మ గుడి సెంటర్ సమీపంలో ఆ వాహనాన్ని డీఎస్పీ రవిచంద్ర, సీఐ రాజేష్, తహసీల్దార్ స్లీవజోజి ఆపి పార్శిళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. కొన్ని అట్టపెట్టెల్లో బిల్లులు లేని మొత్తం రూ.22,59,500ను గుర్తించి సీజ్ చేసి ట్రెజరీకి తరలించారు.

వైసీపీకి కోడ్ వర్తించదా!?

- సీఎం వస్తున్నారని పార్టీ జెండాలు



ప్రభుత్వ పాఠశాల గేటుకు వైసీపీ జెండాలు

పీసీపల్లి, ఏప్రిల్ 7: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను తప్పక పాటించాలని ఈసీ పదేపదే చెప్తున్నా వైసీపీ శ్రేణులు అవేవీ తమకు వర్తించవన్న రీతిలో వ్యవహరిస్తున్నాయి. సీఎం బస్సుయాత్ర ఆదివారం ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలంలోని పెద అలవలపాడు మీదుగా కనిగిరి వెళ్లింది. ఈ సందర్భంగా వైసీపీ శ్రేణులు ఎన్నికల కోడ్ ఉన్నా పాలేరు నదిపై బ్రిడ్జికి ఇరువైపులా పార్టీ జెండాలను కట్టారు. అంతటితో ఆగకుండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధాన గేటుకు, పక్కనే ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ బోర్‌కు వైసీపీ జెండాలను ఏర్పాటు చేశారు.

బీజేపీలో చేరిన ఇద్దరు వలంటీర్లు

రణస్థలం, ఏప్రిల్ 7: శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం సంచాం గ్రామానికి చెందిన బొంతు గణేష్, సత్యనారాయణ అనే ఇద్దరు వలంటీర్లు ఆదివారం తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. వీరిద్దరికి స్థానిక కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు బీజేపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈసారి బీజేపీకి 300కు పైగా సీట్లొస్తాయి

- కానీ 370 సీట్ల లక్ష్యం సాధించలేకపోవచ్చు
- తెలంగాణలో బీజేపీ పుంజుకుంటోంది: పీకే



న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీజేపీ పుంజుకుంటోందని ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ రాష్ట్రంలో గణనీయంగా ఓట్లు, సీట్లు సాధించి మొదటి లేదా రెండో స్థానంలో నిలిచే అవకాశం ఉందని ఆయన జోస్యం చెప్పారు. సార్వత్రిక ఎన్నికల సందడి నేపథ్యంలో 'ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పీటీఐ)' సంపాదకులకు ఆయన ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఏప్రిల్ 19 నుంచి మొదలవుతున్న ఈ ఎన్నికల్లో బీజేపీ 300కి పైగా సీట్లు సాధిస్తుందని.. అయితే, ఆ పార్టీ పెట్టుకున్న 370 సీట్ల లక్ష్యాన్ని సాధించలేకపోవచ్చని పేర్కొన్నారు. బీజేపీ దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు విపక్షాలకు గతంలో పలు అవకాశాలు వచ్చినా ఉపయోగించుకోలేకపోయాయని వ్యాఖ్యానించారు. తూర్పు, దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ తన సీట్లను, ఓట్లశాతాన్ని గణనీయంగా పెంచుకుంటుందని పీకే అంచనా వేశారు. ముఖ్యంగా.. తెలంగాణలో మొదటి లేదా రెండో స్థానంలో నిలుస్తుందని, అది చాలా పెద్ద విషయమని పీకే తెలిపారు. అలాగే.. "ఒడిశాలో బీజేపీ తప్పకుండా అగ్రస్థానంలో నిలుస్తుంది. చెప్తే మీరు ఆశ్చర్యపోతారుగానీ.. నా లెక్క ప్రకారం బీజేపీ పశ్చిమబెంగాల్‌లో నంబర్ వన్ పార్టీగా నిలవబోతోంది" అని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. తమిళనాడులో బీజేపీ ఓటు షేరు రెండంకెల శాతానికి చేరుతుందని చెప్పారు. బీజేపీకి బాగా పట్టున్న పశ్చిమ, ఉత్తరాది రాష్ట్రాల్లోని కనీసం 100 సీట్లలో ఆ పార్టీని విపక్షాలు.. మరీ ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఓడించగలిగితేనే కమలనాథులకు ఆ సెగ తాకుతుందని.. కానీ, అలా జరిగే అవకాశం లేదని తేల్చిచెప్పారు. "మీరు (రాహుల్/సోనియా) పోరాడాల్సింది ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో. కానీ, మీరు పర్యటిస్తున్నది మణిపూర్, మేఘాలయ వంటి రాష్ట్రాల్లో. ఇలా అయితే గెలుస్తారు? కేరళలో గెలిస్తే దేశమంతా గెలిచినట్టు కాదు. మీరు యూపీ, బిహార్, మధ్యప్రదేశ్‌లో గెలవనప్పుడు.. ఒక్క వయనాడ్‌లో గెలవడం వల్ల ఉపయోగమేమీ ఉండదు. అమేఠీని వదులుకోవడం ఒక తప్పుడు సందేశాన్ని పంపుతుంది" అని పీకే వ్యాఖ్యానించారు. బీజేపీని ఎదుర్కొనే నాయకత్వం, ఎజెండా కూటమికి లేవని.. అందుకే బీజేపీ పదే పదే గెలుస్తోందని విశ్లేషించారు. మోదీ నేతృత్వంలో బీజేపీ అప్రతిహతంగా దూసుకుపోతోందన్న వాదనను ఒక పెద్ద భ్రమగా కొట్టిపారేశారు. 2014 తర్వాత.. అధికారపార్టీ వెనకబడ్డ సందర్భాల్లో విపక్షాలు, ప్రత్యేకించి కాంగ్రెస్ పార్టీ ఆ పరిస్థితిని సొమ్ము చేసుకోవడంలో విఫలమైనట్టు ఆయన పేర్కొన్నారు. మోదీ మూడోసారి గెలిచిన తర్వాత పెద్ద నిర్ణయాలు తీసుకుంటానని ప్రకటించారని.. ఆయనేమి చేస్తారో అన్న ఆసక్తి ఒక రాజకీయ పరిశీలకుడుగా తనకున్నదని ప్రశాంత్ కిశోర్ చెప్పారు. రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ఈ పెద్ద నిర్ణయాల వల్ల ప్రమాదం ఏర్పడుతుందేమోనన్న ఆందోళన వ్యక్తంచేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుకున్న ఫలితాలు సాధించలేకపోతే.. రాహుల్ గాంధీ తప్పుకోవాల్సిందేనని పీకే సూచించారు.

జగన్ ఇక ఇంటికే!!

(మొదటి పేజీ తరువాయి)

డబ్బులివ్వడమే కాదు.. వారి ఆకాంక్షలపైనా దృష్టి సారించాలి. డబ్బులు పంచుతూ.. నేను రాజును.. మీకేం కావాలో నాకు తెలుసు. మీకు ఇస్తున్నా కాబట్టి నాకు ఓట్లేయండని అనుకుంటుంటారు. జగన్ కూడా ఇంతే. నేను డబ్బులు పంచుతూ పోతుంటా.. మీకిదే మంచిది. నెలకు 2 వేలు అందిస్తుంటాను... రోడ్లు వేసినా వేయకున్నా.. రాష్ట్రానికి రాజధాని ఉన్నా లేకపోయినా.. ఫ్యాక్టరీలు కట్టినా కట్టకున్నా.. మీకు డబ్బులిస్తున్నాను..' అని భావిస్తున్నారని వెల్లడించారు. పూర్వకాలంలో చక్రవర్తులు ప్రజలకు తాయిలాలు, బహుమానాలు ఇవ్వడంపైనే దృష్టిపెట్టేవారని.. జగన్ కూడా ఇదే చేశారని చెప్పారు. నగదు బదిలీ మాత్రమే చేశారని.. ఉద్యోగాల కల్పనకు ఊతమివ్వలేదని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే చర్యలు చేపట్టలేదని విమర్శించారు.

దేవదాయ శాఖలో నిలిచిన జీతాలు

- పే అండ్ అకౌంట్స్‌కు తప్పుడు బిల్లులు!!

అమరావతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖలో ఒక అధికారి నిర్లక్ష్యం వల్ల ఉద్యోగులందరి జీతాలూ నిలిచిపోయాయి. ఉద్యోగుల జీతాలకు సంబంధించిన బిల్లులు ప్రతి 30 లేదా 31వ తేదీ నాటికి పే అండ్ అకౌంట్స్‌కు పంపిస్తారు. ఉద్యోగుల సెలవులు, వారి ఇంక్రిమెంట్లు మొత్తం క్షుణ్ణంగా చూసుకుని, అంతా ఒకే అంటేనే బిల్లులు పే అండ్ అకౌంట్స్‌కు పంపించారు. అయితే ఈ నెల జీతాల వ్యవహారం చూసే డీడీవో నిర్లక్ష్యం కారణంగా దేవదాయ శాఖ పంపించిన బిల్లులు మొత్తం పే అండ్ అకౌంట్స్ అధికారులు రిజెక్ట్ చేశారు. పే అండ్ అకౌంట్స్‌కు పంపించిన బిల్లులు, ఉద్యోగులు ఇంక్రిమెంట్లు లెక్కల మొత్తం తప్పులు తప్పులుగా పంపించడమే ఇందుకు కారణం. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన అధికారులు పే అండ్ అకౌంట్స్‌కు రివైజ్డ్ బిల్లులు పంపించేందుకు సిద్ధమయ్యారు. కేవలం ఒక అధికారి నిర్లక్ష్యం కారణంగా 4వ తేదీన రావాల్సిన జీతాలు పూర్తిగా నిలిచిపోయాయి. అసలే ఈ నెల ఉగాది, ఇతర పండుగలున్నాయి. ఇలాంటి సమయంలో జీతాలు రాకపోవడంతో ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. అయితే తమ తప్పుల వల్ల జీతాలు నిలిచిపోయాయన్న విషయం బయటకు రానివ్వకుండా, సీఎఫ్ఎంఎస్‌లో టెక్నికల్ సమస్యల కారణంగా నిలిచిపోయాయని అధికారులు చెబుతున్నారు.

10, 11 తేదీల్లో బాబు, పవన్ ఉమ్మడి సభలు

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉమ్మడిగా పర్యటించనున్నారు. ఈ నెల 10, 11 తేదీల్లో ఉమ్మడి సభలు జరుగుతాయని టీడీపీ వర్గాలు తెలిపాయి. 10న తణుకు, నిడదవోలు, 11న పీ గన్నవరం, అమలాపురం నియోజకవర్గాల్లో ఈ సభలు జరగనున్నాయి.

'ఆమె'కు ఐఏఎస్ ఇప్పిద్దాం!

- అర్హత లేని ఓ అధికారిణికి అందలం
- ఐఏఎస్ హోదా కల్పించేందుకు స్కెచ్
- ధనుంజయరెడ్డి అండతో ఫైల్ సిద్ధం
- యూపీఎస్సీకి పంపించే ప్రయత్నాలు
- రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంతో బ్రేక్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎన్నికల వేళ సందట్లో సడేమియా అన్నట్టు అస్మదీయులను అందలమెక్కించేందుకు ఓ ప్రభుత్వ పెద్ద చకచకా పావులు కదుపుతున్నారు. సీఎంవో కార్యాలయంలో అన్ని రకాల సేవలందిస్తున్న ధనుంజయరెడ్డి తన దగ్గర పనిచేస్తున్న వారికి మేలు చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే తన పేషీలో విధులు నిర్వర్తిస్తున్న నీలకంఠా రెడ్డికి ఐఏఎస్ హోదా కల్పించారు. ఇప్పుడు మరో మహిళా ఉద్యోగికి కూడా ఐఏఎస్ హోదా కల్పించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఆమెకు సర్వీస్ లేకపోయినా, అడ్మినిస్ట్రేషన్‌లో అనుభవం లేకపోయినా.. ఐఏఎస్ హోదా కల్పించేందుకు సీఎంవో మొత్తాన్ని రంగంలోకి దించారు. 2022 ప్యానెల్ ఇయర్‌లోనే డీవోపీటీకి పంపించిన లిస్ట్‌లో సదరు అధికారిణి పేరు కూడా ఉంది. కానీ తొలివిడతలో నీలకంఠారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డికి మాత్రమే ప్రభుత్వం ఐఏఎస్ హోదా కల్పించింది. సదరు అధికారిణి కూడా విశ్వప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. 2022 ప్యానెల్ ఇయర్‌లో 4 పోస్టులున్నా.. ప్రభుత్వం రెండే భర్తీ చేసింది. ఏపీ ప్రభుత్వం పంపించిన లిస్ట్ ప్రకారం ఆ ఇద్దరికి కన్‌ఫర్డ్ ఐఏఎస్ హోదా కల్పిస్తూ 2023లో డీవోపీటీ ఆదేశాలు జారీచేసింది. మిగిలిన రెండు పోస్టులు భర్తీ కాలేదు. వాటిలో ఒక పోస్టులో ఈ అధికారిణికి అవకాశం కల్పించాలని సీఎంవో అధికారులు నిర్ణయించారు. ఆమె పేరుతో మరోసారి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అడ్మినిస్ట్రేషన్‌లో ఆమెకు అనుభవం లేదన్న కారణంతో యూపీఎస్సీ నిరుడు ఆమె ఫైల్‌ను తిరస్కరించినట్టు తెలుస్తోంది. ఈసారి ఆ సమస్య రాకుండా ఆడిట్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఆమెకు టిడ్కోలో జీఎం హోదా కల్పిస్తూ, దానినే అడ్మినిస్ట్రేషన్ అనుభవంగా చూపిస్తూ ఆమె ఫైల్‌ను యూపీఎస్సీకి పంపించే ప్లాన్ చేశారు. డీపీడీలో ఉన్నతాధికారులంతా ఈ ఫైల్‌ను క్లియర్ చేశారు. సీఎం ఆమోదం కోసం వెళ్లిన తర్వాత రెవెన్యూ ఉద్యోగులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సదరు అధికారిణి నాన్ రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తుండగా.. ఆమెకు రెవెన్యూ కోటాలోనే ఐఏఎస్ హోదా కల్పించే ప్రయత్నం చేశారు. దీనికి రెవెన్యూ శాఖ ఉద్యోగులు, అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో ఫైల్ యూపీఎస్సీకి పంపకుండా నిలిపివేసినట్లు సమాచారం. ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న ధనుంజయరెడ్డి, చివరికి ఐఏఎస్‌ల పోస్టింగ్ విషయంలోనూ తన వారికే తొలి ప్రాధాన్యమిస్తున్నారనే విమర్శలు అధికమయ్యాయి. సీనియర్లను కాదని.. కేవలం స్వామి భక్తి చాటుకుందన్న కారణంతో అడ్డదారిలో ఫైల్స్ యుపీఎస్సీకి పంపించే ప్రయత్నం చేయడం ఏమిటన్న ప్రశ్నలు వస్తున్నాయి.

నోటిఫికేషన్ ఏదీ..?

సాధారణ పరిపాలన శాఖ నిబంధనల ప్రకారం రెవెన్యూ, నాన్ రెవెన్యూ ఐఏఎస్ పోస్టుల భర్తీకి కచ్చితంగా నోటిఫికేషన్ ఇవ్వాలి. దీనికి వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న అర్హత కలిగిన ఉద్యోగులంతా దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తులను ప్యానెల్ అధికారులు పరిశీలిస్తారు. అడ్మినిస్ట్రేషన్ అనుభవం, సర్వీస్, రిమార్క్‌లు, ఫిర్యాదులు మొత్తం పరిశీలించిన తర్వాత పేర్లు ప్రభుత్వానికి సిఫారసు చేస్తారు. ప్రతి పోస్టుకు ఐదుగురి పేర్లు పంపిస్తారు. ఇప్పుడు ధనుంజయరెడ్డి సిఫారసుతో ప్రయత్నాలు చేస్తున్న అధికారిణి విషయంలో ఈ నిబంధనలేవీ పాటించలేదు. అసలు నోటిఫికేషన్ ఇచ్చారా..? లేదా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

అడ్డదారిలో ధనుంజయరెడ్డి...

ధనుంజయరెడ్డి ఏపీ కేడర్ ఐఏఎస్‌గా అడ్డదారుల్లోనే వచ్చారు. ఢిల్లీ, అండమాన్ నికోబార్ సివిల్ సర్వీస్ కేడర్‌కు చెందిన ఆయన ఏపీలో ఐఏఎస్ ఎలా అయ్యారన్నది పెద్ద మిస్టరీగానే ఉంది. ఆయనను వైఎస్ హయాంలో ఏపీకి డిప్యూటేషన్‌పై తీసుకొచ్చారు. ఆయన సర్వీస్‌ను ఏపీలోకి మార్చారు. గ్రూప్-బి హోదా అధికారిగా ఉన్న ఆయనకు ఏపీ కేడర్‌కు వచ్చేసరికి డిప్యూటీ కలెక్టర్ హోదా ఎలా వచ్చిందన్న దానిపై స్పష్టత లేదు. ఆయన సీనియార్టీ విషయంలో అప్పట్లో తీవ్ర గందరగోళం ఏర్పడింది. దీనిపై డీవోపీటీ కూడా తీవ్ర విస్మయం వ్యక్తం చేసింది. కానీ అప్పటి సీఎం రాజశేఖరెడ్డికి అత్యంత సన్నిహితుడు కావడంతో.. ఇబ్బంది రాలేదు. ఇప్పటికీ ఆయన సీనియార్టీ, ఐఏఎస్ పదోన్నతిపై గందరగోళం ఉంది. తనలానే తన ఓఎస్‌డీగా విధులు నిర్వహిస్తున్న మహిళా అధికారిణిని కూడా అడ్డదారుల్లో ఐఏఎస్ చేసేద్దామన్న ప్రయత్నాలు ప్రస్తుతానికైతే బెడిసికొట్టాయి.

(మొదటి పేజీ తరువాయి)

ఆ ఐపీఎస్.. వైసీపీ ఫ్యాన్

సంస్థల ఎన్నికల్లో వైసీపీ అరాచకాలను డీఐజీ హోదాలో అడ్డుకోవాల్సింది పోయి వంతపాడారనే పేరుంది. అనంతపురం నుంచి వాహనాల్లో వైసీపీ కార్యకర్తల్ని తీసుకెళ్లి కుప్పం పంచాయతీ ఎన్నికల్లో ఓట్లు వేయిస్తే.. కట్టడి చేయాల్సిన డీఐజీ వారికి సహకరించారనే ఆరోపణలున్నాయి. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలోనూ దొంగ ఓట్లు వేయించేందుకు అధికార పార్టీ నేతలు తమిళనాడుకు చెందినవారిని బస్సుల్లో తీసుకొచ్చారు. ఎన్నికల సమయంలో వచ్చిన కొత్త వ్యక్తులు ఎవరని డీఐజీ కనీసం ఆరా తీయలేదు. నాటి తిరుపతి ఎస్పీ వెంకటప్పలనాయుడు తనిఖీలకు వెళుతుంటే.. 'వద్దు వద్దు.. నాతో ఉండు' అంటూ రాణా ఆపారని ఐపీఎస్‌లు చెబుతారు. ఆయనకు వైసీపీ పెద్దలు సిఫారసు చేసి విజయవాడ పోలీస్ కమిషనర్ పోస్టు ఇప్పించారు. ఓ మాజీ డీజీపీ, ప్రకాశం జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడి మద్దతుతో విజయవాడలో పాగా వేశారు.

సారు తీరే వేరు

- విజయవాడలో టీడీపీ మహిళా కార్పొరేటర్ భర్త చెన్నుపాటి గాంధీపై వైసీపీ గూండాలు అకారణంగా హత్యాయత్నం చేసి కన్ను పొడిచేసేశారు. అయితే నిందితులపై సాధారణ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి బెయిల్ వచ్చేందుకు సహకరించిన ఘనుడు విజయవాడ పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా.
- విజయవాడలో టీడీపీకి చెందిన మహిళపై దాడులు చేసిన వ్యక్తులే తిరిగి కేసు పెట్టారు. సౌమ్యుడిగా పేరున్న టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు కృష్ణలంక ఘటనపై అడిగేందుకు ప్రయత్నించగా... కనీసం పోలీసు స్టేషన్‌లోకి కూడా రానివ్వలేదు. అదే వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్‌కు స్వాగతం పలికి తాను అధికార పక్షం అని రుజువు చేసుకున్నారు.
- సీఎం జగన్ రెడ్డి కక్షగట్టిన ఒక ప్రైవేటు చిట్టీల వ్యవహారంలో వైసీపీ పెద్దల మెప్పు పొందేందుకు చిట్టీల డీఫాల్టర్‌ను పక్కన కూర్చోబెట్టుకుని క్రాంతి రాణా విలేకరుల సమావేశం నిర్వహించారు.

సంఘానికి అధ్యక్షుడెవరు?

రాష్ట్రంలో అన్ని విభాగాలు, శాఖల్లో నెలకొన్న అనిశ్చితి ఐపీఎస్ అధికారుల్లోనూ కనిపిస్తోంది. క్రాంతి రాణా అత్యుత్సాహం తర్వాత ఐపీఎస్ అధికారుల్లో దీనిపై చర్చ మొదలైంది. 'ఇంతకూ మనకు అసోసియేషన్ ఉందా? ఉంటే అధ్యక్షుడు ఎవరు?' అంటూ ఐపీఎస్ అధికారులు ఒకరికొకరు ఫోన్లు చేసుకుని ఆరా తీశారు. ఏపీలో ఐపీఎస్ అధికారుల సంఘం కార్యవర్గం రెండున్నరేళ్ల క్రితం వరకూ ఉండేది. ప్రస్తుతం ఆర్టీసీ ఎండీగా ఉన్న ద్వారకా తిరుమలరావు అధ్యక్షుడిగా, అడిషనల్ డీజీ ఆర్‌కే మీనా కార్యదర్శిగా ఉండగా, క్రాంతి రాణా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా ఉన్నారు. అయితే 2022 ఫిబ్రవరిలో తన కన్నా జూనియర్ అయిన కసిరెడ్డి రాజేంద్రనాథ్ రెడ్డి డీజీపీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు దక్కించుకున్నాక అసోసియేషన్ అధ్యక్షుడిగా తాను ఉండడం సరికాదని తిరుమలరావు తప్పుకొన్నట్లు తెలిసింది. ఐపీఎస్‌లు సమావేశం ఏర్పాటు చేసుకుని మరో కమిటీని ఎన్నుకోవాలి. కానీ అదేదీ జరగలేదు. అసోసియేషన్ సెక్రటరీ కూడా ఏమీ పట్టించుకోకుండా వదిలేశారు. అయితే ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ క్రాంతి రాణా అసోసియేషన్‌లో కనీసం చర్చించకుండా అధికార పార్టీకి వత్తాసు పలికే కొందరు ఐపీఎస్ పెద్దల సూచన మేరకు ప్రతిపక్షాలు, పత్రికలపై ఏకపక్షంగా ఎలా ఫిర్యాదులు చేస్తారనే చర్చ ఐపీఎస్‌లలో జరుగుతోంది. బీజేపీ నేతలు ఈ వ్యవహారాన్ని కేంద్ర హోంశాఖ దృష్టికి తీసుకెళ్లి ఏపీలో ఐపీఎస్‌లపై 360 డిగ్రీల నివేదిక తెప్పించుకున్నాక తగిన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు సమాచారం.

'ఆంధ్రజ్యోతి'పై అక్కసు

అధికార పార్టీకి అనుకూల వ్యక్తిగా పేరున్న క్రాంతి రాణా ఎన్నికల్లో నిష్పక్షపాతంగా పనిచేసే అవకాశం లేదంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి గత నెల 26న ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. ఆ లేఖ వారం తర్వాత బయటికి వచ్చింది. అందులో పేర్కొన్న 22 మంది అధికారులపై చేసిన ఆరోపణలను ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి'పై సారు ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతి భద్రతలు, ప్రజారక్షణ కోసం అహోరాత్రులు శ్రమించే వారిపై కొన్ని పార్టీలు చేస్తున్న ఆరోపణల్ని ఖండిస్తున్నామంటూ.. ఐపీఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ చాప్టర్ పేరుతో ఉన్న ఒక లెటర్ హెడ్‌పై ప్రకటన విడుదల చేశారు. అంతటితో ఆగకుండా తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాల మేరకు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి స్వామి భక్తి చాటుకున్న ఐపీఎస్‌లకు వంత పాడారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.